
# ప్రణవనాదం



పి.ఎస్.నారాయణ

# ప్రణవనాదం

పి. ఎస్. నారాయణ

## నవల

# ప్రణవనాదం

## (నవల)

స్వాతి

మాసపత్రిక

ఫిబ్రవరి, 2008 సంచిక

అనుబంధ నవలగా

ప్రచురింపబడింది.

**వెల:రు. 80**

గమనిక

ఈ నవలలోని పాత్రలు, సంఘటనలు–
అన్నీ కల్పితాలు, ఎవర్నీ ఉద్దేశించినవి కావు.
ఎక్కడయినా పోలికలు, సామ్యాలూ
కనిపించినా అవి యాదృచ్ఛికమే.

–రచయిత

# ప్రణవనాదం

త్రికాలజ్ఞాని మహాయోగి లక్ష్మమ్మ సమాధిముందు బాసికపట్టు వేసుకొని అరగంటపట్టీ కూర్చుని వున్న స్పందన ఉలిక్కిపడ్డట్లుగా కళ్ళుతెరిచింది.

ఆమె చుట్టూ శీతల పవనాలు వలయాలుగా తిరుగుతుండగా, ఎదురుగ్గా వున్న అవ్వ కళ్ళల్లోనుంచి సప్తవర్ణకాంతి పుంజం మెరిసిపోతూ దూసుకు వస్తున్నది. విద్యుత్ ప్రసరిస్తున్నట్లుగా శరీరాన్నంతా ఆవరించుకు పోతున్నది. ఆమె ఉక్కిరిబిక్కిరి అవ్వసాగింది.

ఆమె వింత అనుభూతితో, అవ్వ సృష్టిస్తున్న కొత్త ప్రపంచంలో కాలూనుతూ, కళ్ళుమూసుకున్నది. 'ఓం' అంటూ శ్వాసబిగించి.

మరుక్షణంలోనే ఆమె సర్వం మరిచిపోయి ప్రశాంతతో కూడిన శూన్యంలోని ఆనందాన్ని ఆస్వాదించసాగింది. అందులోనే తాదాత్మ్యత చెందుతూ తనని తాను మైమరిచిపోతూ గాలిలో తేలిపోసాగింది.

తిరిగి పావుగంటకు గాని ఆమె బాహ్యప్రపంచంలోకి రాలేకపోయింది. అలా వచ్చిన మరుక్షణంలోనే తన నేత్రాలు చాలా బరువుగా ఉన్నట్లుగానూ, రెప్పలు పైకి లేపలేనట్లుగానూ అనిపించగా కలవరపడింది కొద్ది క్షణాలు.

ఏమైంది?... ఇప్పటిదాకా తను ఎక్కడున్నది?... ఆ రంగు రంగుల వెలుగు కిరణాలేవి? ఆ శీతలపవనాలేవి? ఇంతవరకూ ఆఘ్రాణించిన ఆ సుగంధభరితమైన సువాసనలను ఎలా మాయమయిపోయినయి?

కూర్చున్నచోటునుంచి, అవ్వకు నమస్కరించి లేస్తుంటే, నీరసంగా అనిపించింది. కాళ్ళు తేలిపోతున్నట్లే అనిపిస్తోంది. పక్కనున్న గోడపట్టుకొని వెనుదిరుగుతూనే

ఉలిక్కిపడ్డట్లుగా అక్కడ నిల్చొని వున్న వ్యక్తిని చూడసాగింది.

అరవయ్యేళ్ళు పైగా ఉంటయి. లావుగా ఉన్నాడు. పొడుగ్గా ఉన్నాడు. బట్టతల. ఎర్రని మేనిచ్ఛాయ. ముడతలు పడ్డ నుదురు...

ఆయనా స్పందననే తదేకంగా చూస్తున్నాడు. కళ్ళార్పకుండా చూస్తున్నాడు.

"నీ పేరేమిటమ్మా?" మృదువుగా, ఆప్యాయంగా అడిగాడు రెండు నిముషాల తరువాత.

"స్పందనండీ!" ఆయన్నే వింతగా చూస్తూ అన్నది.

"నిన్ను ఎక్కడో చూచినట్లున్నదమ్మా...! మీది ఈ ఊరేనా?"

"అవునండీ!"

"ఎప్పుడైనా హైదరాబాద్ వచ్చావా?"

"లేదండి!"

"నేనూ ఇంతవరకు ఆదోని రానేలేదు... అయినా నిన్ను ఇంతకు ముందే చూచినట్లు ఉండటం నాకు ఆశ్చర్యంగా వున్నది!"

"మీది హైదరాబాదా అండి!"

"అవునమ్మా! ఓ మిత్రుడు లక్ష్మమ్మ అమ్మవారిని గురించి చెబితే దర్శించుకు వెళ్దామని వచ్చాను.... చాలా బాగున్నదమ్మా గుడి!"

పక్కన మెట్లమీదనుంచి నలుగురయిదుగురు దిగి వస్తుండటంతో, "పైకి వెళ్దాం పదండి... ఓ పక్కగా ఎంతసేపైనా కూర్చోవచ్చు....!" అంటూ రెండో వైపున పైకి ఉన్న మెట్లవైపుకు నడిచింది స్పందన.

ఇద్దరూ పైకి వచ్చారు. అవ్వ దర్శనం చేసుకొని కుడివైపుగా వెళ్ళి గోడపక్కగా కూర్చున్నారు.

"మీ మిత్రుడు తరచూ ఇక్కడకు వస్తుంటారా?"

"అవునమ్మా! నువ్వు వస్తుంటావా అమ్మా రోజూ ఇక్కడకు!"

"లేదండి... సామాన్యంగా ప్రతి గురువారం వస్తుంటాను... అసలు భక్తులంతా వచ్చేది శుక్రవారం... విపరీతంగా వస్తారు... కాస్త కూర్చోవాలన్నా ఎక్కడా చోటు ఉండదు... అంతమంది జనంలో ప్రశాంతత లభించదు... అందుకనే ఆరోజు కాకుండా మరోరోజు వస్తుంటాను!"

"మీది ఈ ఊరేనా?"

"అవునండీ!"

"నాన్నగారేం చేస్తుంటారు?"

క్షణం తడబడింది ఏం చెప్పాలా అన్నట్లుగా. కళ్ళు మూసుకొని అవ్వను తలుచుకుంటూ, "నాకు అమ్మయినా, నాన్నయినా అమ్మేనండి!" అన్నది తలవంచుకొని. "ఇప్పుడు ఆమె గూడా లేదు!" గొంతు జీరబోయింది.

ఆయనకు అర్థమయింది ఆమె మాట. "సారీ... సారీ!" అన్నాడు ఆమెను బాధపెట్టానా అన్నట్లుగా.

ఇద్దరి మధ్యా మౌనం కొద్దిసేపు తెరలు దించింది.

అవ్వముందు ఎవరో గంట మ్రోగించారు.

"నిన్ను చూస్తుంటే నాకు ఓ ఆత్మీయురాలిని చూస్తున్నట్లే అనిపిస్తున్నది... పూర్వపు ఏదో జన్మలో మనం చాలా దగ్గరవాళ్ళమయివుండాలి!" అన్నాడు ఆయన చిరునవ్వుతో.

స్పందనకూ అలాగే అనిపిస్తున్నది ఆయన్ను చూస్తుంటే... తెలియని ఆత్మీయత తమ మధ్య సన్నని దారంలా అల్లుకుపోతున్నదా అనిపిస్తున్నది.

"మీరు అవ్వను చూడటానికే వచ్చారా ఇంతదూరం?"

"చెప్పాను కదమ్మా! మనస్సంతా అల్లకల్లోలంగా ఉన్నది... ఏం చేయాలో,

భవిష్యత్తు ఎలా ఉంటుందో అన్న ఆందోళనలోవున్న నన్ను ఓ మిత్రుడు ఇక్కడకు పంపాడు!"

"ఏవిధమైన సాయం మీరు అవ్వనుండి ఆశిస్తున్నారు?" కుతూహలంగా ఆయన్నే చూస్తూ అడిగింది.

"నాకు ఆస్తి బాగానే ఉన్నదమ్మా... డబ్బుకు ఇబ్బంది లేదు... అయినా సుఖం లేకుండా ఉన్నది... ఎడతెగని భయంకరమైన ఆలోచనలతో రాత్రిళ్ళు నిద్ర కరువవుతోంది... ఎన్నాళ్ళా నిద్రమాత్రలు నాకు సుఖాన్నిస్తయి! అవీ ఇంకెక్కువ రోజులు పనిచేయవేమో అనిపిస్తోంది! నాకు ఇప్పుడు ముఖ్యంగా కావాల్సింది మానసిక ప్రశాంతత!"

"ఇంకా సంపాదిస్తున్నారా?" కాస్త హేలగా అడిగింది.

"ఇంట్లో ఖాళీగా కూర్చుంటే నా బుర్ర మరిన్ని దయ్యాలకు నిలయమవుతుంది!" అన్నాడు దిగులుగా.

"ఇక నాకు చాలు– అనుకోవటంలోనే తృప్తి, శాంతి లభిస్తయ్యని మీకు తెలియదా?"

"చెప్పాను గదా... చాలు అని ఎలా ఇంట్లో కూర్చోగలను.... ఇప్పుడు పగలన్నా అ వ్యాపారపు పనుల్లో పడి బాధలూ, దిగుళ్ళూ మర్చిపోతున్నాను...!"

"మీరు నాకంటే చాలా పెద్దవారు... అనుభవజ్ఞులు... నేను చెప్పకూడదు ఇలాంటి మాటలు... అయినా మీకో సమస్య ఉన్నదని మీరంటున్నప్పుడు నేను చెప్పక తప్పటం లేదు... నా లెక్కప్రకారం మీ వయస్సు అరవయి వుండవచ్చు... అవునా?"

"యాభై ఎనిమిది సంవత్సరాలమ్మా!"

"ఈరోజుల్లో అది పెద్ద వయస్సుకాదు... ఒకప్పుడు మనిషి అరవయ్యేళ్ళు బ్రతికితేనే చాలా గొప్పగా భావించేవారు... ఇప్పుడు డెభై, ఎనభై మామూలయింది... మీ

యాభై ఎనిమిది సంవత్సరాల జీవితంలో, డబ్బు సంపాదించటమే గాకుండా మీరు చేసిన మంచి పనులు ఏమిటి?" అన్నది కాస్త సంశయించినా తప్పదన్నట్లుగా.

"మంచి అంటే?"

"మనస్సుకు శాంతి చేకూర్చేవి అని... మరొకరికి మేలు చేసేవి అని... మనం ప్రతిఫలం ఆశించకుండా ఇతరులకు మనం చేయగలిగిన సహాయాలు అని...!"

ఆయన చాలాసేపు మౌనంగా ఉండిపోయాడు. "నాకు తెలిసినంతవరకూ లేవమ్మా... కాకపోంగా ఇప్పుడు ఆలోచిస్తే నన్ను నమ్ముకున్న కొంతమందికి హానిగూడా చేసివుండవచ్చు!" అన్నాడు బిడియపడుతూ, మహాయోగి లక్ష్మమ్మ దేవాలయంలో కూర్చొని అబద్ధం ఆడటం చేతకావటంలేదు అన్నట్లుగా, నిజాయితీగా.

హాయిగా నవ్వుతూ, "ఇప్పటికయినా మిమ్మల్ని మీరు తెలుసుకున్నారు అంటే మీరు జ్ఞానవంతులయినట్లే లెక్క ... భవిష్యత్తులో ఇక మీకు ఏ ప్రతిబంధకమూ ఉండదు... మనశ్శాంతి లభిస్తుంది... మిమ్మల్ని అవ్వ తప్పకుండా ఆశీర్వదిస్తుంది... ఆమెను నమ్ముకొని సర్వస్య శరణాగతులై వేడుకోండి!" అన్నది తృప్తిగా ఆయన వంకచూస్తూ.

ఆయన కళ్ళు విశాలమయినయి. ముఖం విశాలమైంది. ఆయన ఆనందంగా, ఆత్మీయంగా ఆమె వంక చూశాడు.

"నేను ఈ గుడికి ఇద్దామని యాభైవేలు తెచ్చానమ్మా.... ఇదంతా నాకు కొత్త ప్రదేశం... సలహాకు ఇక్కడ నిన్ను మించిన ఆత్మీయులు నాకింకెవ్వరూ కనబడటంలేదు... దాన్ని ఎలా ఉపయోగిస్తే బాగుంటుందంటావ్?"

"డబ్బుకు ఇబ్బంది లేదంటుంటిరి... అంతకు మించి ఇవ్వలేరా?" కొద్దిగా కంఠం హెచ్చించింది. "ఈ ప్రపంచంలో అన్నార్తులు ఎందరో ఉన్నారు... అందరి ఆకలీ మనం తీర్చలేంకాని, అవ్వను నమ్ముకున్న కొద్దిమంది కడుపులనైనా మనం నింపగలిగితే అంతకు మించిన తృప్తి ఇంకేముంటుంది?" అక్కడకు కనబడుతున్న

లక్ష్మమ్మ అవ్వను తాదాప్యంగా చూస్తూ అన్నది.

ఆయన సిగ్గు పడుతున్నట్లుగా తల వంచుకొని, "ఈ మొత్తాన్నయినా ఇంట్లో నా భార్యకు తెలియకుండా తీసుకు రావాల్సివచ్చింది!" అన్నాడు నంగినంగిగా.

చటుక్కున తలెత్తి ఆయన ముఖంలోకి చూసింది. "ఆమెను మోసం చేశా?"

"నేను దాన్ని మోసం అనను... నేను కష్టపడి సంపాదిస్తున్నాను... ఆమెకు డబ్బును ఇలాంటి వాటికి ఖర్చు పెట్టటం ఇష్టం ఉండదు కనుక ఆమెకు తెలియకుండా వేరే దాచివుంచి తీసుకు రావాల్సి వచ్చింది!" ఆయన కొద్ది క్షణాలు మౌనంగా ఉండిపోయారు. "ఒక విధంగా ఆమె నా ఇంట కాలు పెట్టిన తరువాతే నా దశ తిరిగింది... నేను ఇంత సంపాదించగలిగాను... అటువంటిదాన్ని నేను మోసం చేయాలని ఎప్పుడూ అనుకోను... ఈ విషయాన్ని గూడా ఎప్పుడో ఒకప్పుడు ఆమెకు చెబుతాను! అప్పుడు ఆమె కోపగించుకుని బాధపడ్డా, నేననుకున్నది చేయగలిగాననే తృప్తి నాకుంటుంది"

"ఆమెకు డబ్బు మీద ఆశా?"

"ఉండి ఉండవచ్చు... అంతేగాకుండా అంతర్గతంగా నామీద కించత్ కోపమూ వున్నది... మాకు పిల్లలు లేరు... అదీ ఒక కారణమని అనిపిస్తున్నది ఈ మధ్యకాలంలో... మొదట్లో బాగానే ఉండేది... వయస్సు వస్తున్న కొద్దీ, తల్లి కాలేని ఆమెకు ఒక విధమైన న్యూనతా భావం ఏర్పడి, దానికి నేనే బాధ్యుడిని అన్నట్లుగా నన్ను ప్రతిదాంట్లోనూ కించపరుస్తూ కసితీర్చుకుంటూ తృప్తి పడుతున్నదేమో మరి!"

స్పందన మాట్లాడలేదు. ఇక ఆయన స్వవిషయాలను రెట్టించి అడగటం తనకు భావ్యంకాదనిపించింది.

"ఈ డబ్బును దేవస్థానానికిచ్చి, దానిమీద వచ్చే ఆదాయంతో ఎంతమందికి వీలయితే అంతమందికి మధ్యాహ్నం పూట ప్రతిరోజూ భోజనం పెట్టమని చెప్పండి... ఇప్పటికే వాళ్ళు ఆ పనికి కొంత ఫండు ఏర్పరిచి ఆ పని చేస్తున్నారు కాని, ఎక్కువ

మందికి పెట్టలేకపోతున్నారు!"

"మంచిదమ్మా! తప్పకుండా అలాగే చేస్తాను... ముందు ముందు గూడా వీలయినంతవరకూ ఇంకా జమ చేయటానికి ప్రయత్నిస్తాను!"

ఆమాటలకు స్పందనకు ఆయన మీద గౌరవమూ, అభిమానమూ ఏర్పడింది.

"నేనిక్కడ మూడు రోజులు ఉందామని వచ్చాను.... మరోసారి కలుస్తానమ్మా నిన్ను... నీతో మాట్లాడుతుంటే నా ఆత్మీయులతో మాట్లాడుతున్నట్లే ఉన్నది!" అన్నాడు ఆయన ఆనందంగా, ఆమె లేవటం చూచి తనూ లేస్తూ.

"మీరెక్కడ దిగారు?"

లాడ్జిపేరు చెప్పాడు.

"రేపు శుక్రవారం... తప్పకుండా రండి... అది చాలా పర్వదినంగా భావిస్తారు ఇక్కడ!" అన్నది చిరునవ్వుతో. "ఏమనుకోకుండా ఒక్కపని చేయగూడదు... ఈ పూట మా యింట్లో భోజనం చేద్దురుగాని రండి... మీలాంటి పెద్దవారు నా చిన్న కుటీరంలో కాలుపెడితే నాకెంతో ఆనందంగా ఉంటుంది!"

స్పందన అంత వినయంగా అడగటంతో ఆయనకు ఎలా కాదనాలో అర్థం కాలేదు. ఇప్పుడే పరిచయమైన ఆమె ఇంటికి భోజనానికి, ఆమె రమ్మనమనగానే వెళ్ళటానికీ బిడియపడ్డాడు.

"గురువారం కదా... నేనీపూట భోజనం చేయనమ్మా... ఏదైనా హోటల్లో కాస్త పలహారం చేసి వెళ్ళి పడుకుంటాను!"

స్పందన నవ్వింది. "నేనూ టిఫెనేలేండి... వెళ్దాం రండి!" అంటూ పాలరాతి గచ్చు మీద వడివడిగా అడుగులు వేస్తూ మెట్లుదిగి రోడ్డెక్కింది.

ఆ క్షణాన ఆయనకు ఆ అమ్మాయితో వాళ్ళింటికి వెళ్ళటంలోనే ఆనందమున్నదనిపించగా మరే ఏ ఆలోచనా లేకుండా అనుసరించాడు!

ఇద్దరూ స్పందన ఇంటిముందు ఆటో దిగారు.

ఇంట్లో దీపాలు వెలుగుతున్నయి. ఇంటి ముందు చిన్న గేటు.

స్పందన దిగుతూనే ఆటో అతనికి డబ్బులిచ్చి వడివడిగా వెళ్ళి గేటు తీసింది.

"ఇంతసేపు మాట్లాడాను... నేను మీ పేరు అడగనేలేదు బాబాయిగారూ!" అన్నది ఆత్మీయంగా ఆయన్నే చూస్తూ.

"జగన్నాథం అమ్మా! వాకిట్లో కాలుపెడుతుంటే బాబాయిగారూ అని పిలిచావ్... నిన్ను నా కూతురే అనుకుంటానమ్మా... తండ్రిలా అభిమానించటమనేది ఒక్క ఆత్మీయులకే చెల్లుతుంది!"

ఆమె ఆనందంగా ముందుకు నడుస్తూ, "మాణిక్యం! కాళ్ళు కడుక్కోవటానికి నీళ్ళు తెచ్చిపెట్టు... అతిథులొచ్చారు!" అన్నది.

వరండాలో దీపం క్రిందగా చాప వేసుకు కూర్చొని పుస్తకం చదువుకుంటున్న కల్యాణి లోపలకు వస్తున్న స్పందనను, ఆమె వెనుకగా వున్న తను ఎప్పుడూ చూడని కొత్త వ్యక్తినీ చూస్తూనే పక్కగా పెట్టివున్న క్రచ్‌ని అందుకొని దాని సాయంతో లేచి నిలబడింది.

కల్యాణి లేచేటప్పటికే మాణిక్యం లోపలనుంచి, పరుగెడుతున్నట్లుగా వచ్చి, మెట్లపక్కగా వున్న సీమెంటు తొట్టిలోని నీళ్ళను ప్లాస్టిక్ మగ్‌తో చివరి మెట్టుమీద పెట్టింది.

స్పందనకయితే నోరు పెగలటంలేదు- ఎన్నాళ్ళకెన్నాళ్ళకు తనింటికో అతిథి రావటం... అమ్మమ్మా, తాతయ్యా ఉన్నంతకాలం వాళ్ళు తరచూ వస్తుండే వారు.... వాళ్ళుపోయీ అయిదారేళ్ళయింది... తరువాత తమను చూడటానికి పొరుగూరునుంచి వచ్చేవాళ్ళే లేరు... తామిద్దరూ ఒంటరి వాళ్ళు... ఇప్పుడయితే మరీ తను ఒక్కతే!...

ఆయన కాళ్ళు కడుక్కొని, మాణిక్యం ఇచ్చిన తువ్వాలతో తడి తుడుచుకుంటూ, మెట్లెక్కి వరండాలోనుంచి, ఒక్కసారి పక్కగా నిలబడి ఉన్న కల్యాణి వంక చూచి

లోపలకు వెళ్ళాడు.

విశాలంగా ఉన్న ఆ హాలు చాలా శుభ్రంగా వున్నది. గోడవారగా పెద్ద సోఫా... డిజైన్ ఉన్న రెండు ప్లాస్టిక్ కుర్చీలు... సోఫాముందు టీపాయ్... దానిమీద రంగురంగుల డిజైన్ కవరు... ఓ పక్కగా టీవీ... మరో పక్కన ఫ్రిజ్... మూలగా, కిటికీకి పక్కగా చిన్న గుండ్రని స్టూలుమీద టెలీఫోన్... దానికి చేతి అల్లికపు కవరు...

స్పందన ఆయన వైపుకు తిరిగి, “కూర్చోండి!” అంటూ వంటయింట్లోకి వెళ్ళింది.

ఆయన ఆత్మీయంగా లోపలకు వెళుతున్న స్పందనవంక చూశాడు.

మాణిక్యం గ్లాసుతో మంచినీళ్ళు తెచ్చి ఇస్తే అందుకుని త్రాగాడు జగన్నాథం.

“అక్కా! మూర్తి మాస్టారు వచ్చి వెళ్ళారు... రేపు ఆయన కర్నూలుకు వెళ్ళాలిట... స్కూలుకు రానని చెప్పమన్నారు!” అన్నది కల్యాణి, స్పందన ఉన్న వంటయింట్లోకి వెళుతూ.

క్రచ్‌తో నడుస్తున్న కల్యాణిని జాలిగా చూచాడు జగన్నాథం. చక్కగా కుందనపు బొమ్మలా వున్నది.  అంత అందమిచ్చిన దేఁవుడు ఆ అమ్మాయికి ఒక కాలు లేకుండా ఎందుకు చేశాడో అర్థం కానట్లుగా చూస్తున్నాడు ఆయన.

చక్కగా అమర్చిన ఆ ఇంటిని మరోసారి చూస్తూ, వంట యింటి తలుపు మీదగా వున్న ఫొటోను చూశాడు. ఆ ఫొటోకు వేసివున్న పూలదండను చూశాడు.

ఉలిక్కిపడ్డట్లుగా లేచి నిలబడ్డాడు. తలుపు దగ్గరకల్లా వెళ్ళి తలెత్తి ఆ ఫొటో వంకే కన్నార్పకుండా చూస్తూ వుండిపోయాడు.

క్షణక్షణానికి అతడి కళ్ళు విశాలమవుతున్నాయి. ఆ ఫొటోలో ఉన్న మనిషిని చూస్తుంటే గతం గుర్తుకు వస్తున్నది... ఆవేశమొస్తున్నది... ఉద్విగ్నత పెరుగుతున్నది... నరాలు బిగుసుకుపోతున్నయ్యా అనిపిస్తున్నది...

‘అవును... ఆమె రాజేశ్వరే!’

అంతా అయోమయమయినట్లుగా అక్కడే ఆ ఫోటోనే చూస్తూ నిలుచుండిపోయాడు చాలాసేపు జగన్నాథం.

మరి స్పందన?... స్పందన?... స్పందన?...

ఒక్కసారిగా బిగుసుకుపోయిన ఆయనలో చలనం వచ్చింది... ఆవేశం వచ్చింది... ఆత్రుత వచ్చింది...

"స్పందనా?" పెద్దగా అరుస్తున్నట్లుగా పిలిచాడు వంటయింట్లో వున్న ఆమెను.

స్పందన ఆ కేకకు హడావుడిగా ఇవతలకు వచ్చి, వాకిటి దగ్గరే నిలబడి, తన తల్లి ఫోటోవంక చూస్తున్న ఆయన్ను చూస్తూనే ఆశ్చర్యపోయింది.

"ఈ ఫోటో ఎవరిది?"

"మా అమ్మది!" వింతగా ఆయన్ను చూస్తూ అన్నది.

"రాజేశ్వరి మీ అమ్మా?" ఆయన ఎదురుగ్గా ఉన్న ఆమె చాలా దూరంగా ఉన్నట్లుగా గొంతు చించుకు అరిచాడు.

ఆయన వేసిన ఆ కేకకు దిగ్భ్రాంతి చెందింది స్పందన.

ఆమె వెనగ్గా మాణిక్యం వచ్చి నిలబడింది. కల్యాణి క్రచ్ శబ్దం చేసుకుంటూ వచ్చి నిలబడింది.

"మా అమ్మ మీకు తెలుసా?" స్పందన చిన్నగా అడిగింది.

ఆయనకు మాటలే కరువయినయి. కళ్ళు మూతలు పడిపోతున్నయి... శరీరం శక్తిని కోల్పోతున్నట్లుగా తూలిపోతున్నది....

అతి కష్టం మీద నోరు పెగల్చుకొని, "నేను నీ తండ్రినమ్మా!" అన్నాడు.

ఎదురుగ్గా తన కూతురు... ఇరవై ఏడు సంవత్సరాల క్రితం తనకు పుట్టిన తన కూతురు...

ఆయన కళ్ళు మిలమిలా మెరుస్తూ కాంతవంతమయినాయి. ఎవ్వరూ లేరనుకున్న తనకు, తన రక్తం పంచుకు పుట్టిన కూతురు ఎదురుగ్గా నిలబడి వున్నది.

ఆయనకు ఆనందమేసింది. ఆవేశమొచ్చింది. ఆతృత పెరిగింది.

తను గమనించలేదుగాని... ఇప్పుడనిపిస్తోంది.... స్పందనలో కొద్దిగా రాజేశ్వరి పోలికలున్నాయి... తనకు ఆమెతో వివాహమయినప్పుడు ఇలాగే సన్నగా పొడుగ్గా ఉండేది... కొనతేరిన ముక్కు... విశాలమయిన నుదురు... పెద్ద పెద్ద కళ్ళు... అందుకే తను ఆమెను చూడగానే ఎక్కడో చూచిన అనుభూతిని పొందాడు...

స్పందనకు అంతా అయోమయమయింది. అర్థంగాని వేదన... భయం... ఆశ్చర్యం... ఇది నిజమా అన్నంత దిగ్భ్రాంతి. ఏం మాట్లాడాలో తెలియనంతగా గిలగిలలాడుతూ ఆ హాల్లో గోడమీదగా వున్న తల్లిఫొటో వంక ఒక్కసారి చూసి, తన పడకగదిలోకి పరుగెత్తుకు పోయి మంచం మీద పడి వెక్కివెక్కి ఏడ్వసాగింది.

అతడూ ఉక్కిరిబిక్కిరి అవుతూ ఇంకా ఆఫొటోవంకే కళ్ళు చించుకు చూస్తున్నాడు.

“రాజేశ్వరి పోయిందా?” మరోసారి రెట్టిస్తున్నట్లుగా పక్కగదిలో రోదిస్తున్న కూతురుకు వినబడేలా అన్నాడు జగన్నాథం.

ఆమెనుండి ఎలాంటి సమాధానం రాలేదు.

అది తన భార్య ఇల్లు... తన స్వంత కూతురు ఇల్లు... అయినా మొట్టమొదటిసారిగా ఆ యింట్లో కాలుపెట్టిన ఆయన చొరవగా స్పందన దుఃఖిస్తున్న గదిలో కాలుపెట్టలేకపోయాడు.

పక్కగా గోడవారగా నిలుచుని ఉన్న మాణిక్యం నోరు తెరిచి, “అవును బాబుగారూ!... అమ్మగారు రెండు నెలల క్రితం పోయారు!” అన్నది. ఆమె కళ్ళూ తడుస్తున్నయి. ఆమె గొంతూ తడుస్తున్నది. దుఃఖాన్ని బిగపట్టుకుంటున్నది ఆమె.

జగన్నాథం గోడకు ఉన్న ఆ ఫొటోనే తదేకంగా చూస్తుంటే కళ్ళు చెమ్మగిల్లటం మొదలుపెట్టినయి.

తనతో రెండు సంవత్సరాలు కాపురం చేసిందీ అనేమాట నిజమేకాని, తామిద్దరూ కలిసి ఒక కప్పుక్రింద వున్నది ఆ రెండు సంవత్సరాలలోనూ కొద్ది నెలలే. ఎక్కువ భాగం ఆమె తన పుట్టినింట్లోనే గడిపింది.

ఆనాటి తన ధన దాహానికి ఆమె సంసార జీవితం బలయిందని చాలా ఆలస్యంగా తెలుసుకున్నా... అప్పటి పరిస్థితి అది... తన దగ్గర డబ్బులేదు... చేస్తున్న వ్యాపారంలో ఎంత కష్టపడినా ఆశించిన లాభాలు రాకపోవటం ... తన కళ్ళకు రాజేశ్వరి భార్యగా కంటే, ఆవిడ పుట్టింట్లో మూలుగుతున్న డబ్బుకు అధికారిణిలాగానే కనబడటం... అది దాన్ని తీసుకు వస్తే తన వ్యాపారాన్ని వృద్ధి చేసుకుని నిలదొక్కుకోవాలని తను ఆరాటపడటం...

అ రోజుల్లో తనకు కలిగిన ఆ కోరికల్లో తప్పులేదనే అనిపించేది.

ఆమె ఒకటి రెండుసార్లు తెచ్చినమాట వాస్తవమేకాని, అది తను అనుకున్నదానికి సరిపోవకపోవడంతో, స్పర్థలొచ్చినయి... ఒక్కతే కూతురయినప్పుడు, ఎలాగూ ఆ ఆస్తినంతా తమకే ఇచ్చేదైనప్పుడు, అవసరానికి సరిపడా తీసుకురావటంలో తప్పేమిటన్నది తన వాదన!

అప్పుడే ఆడపిల్ల జననం... చాలా నెలలు రాజేశ్వరికి పుట్టిల్లే నివాసమయింది. లేవలేకపోతూ కొన్నాళ్ళు, పసిపిల్లంటూ కొన్నాళ్లు... చివరకు తనను ఎప్పుడూ పుట్టింటినుంచి డబ్బు తెమ్మనమని అడగకుండా వుంటేనే తన దగ్గరకు వస్తానని ఆమె కబురు... పంతాలు, పట్టింపులు... అలా విచ్ఛిన్నమయిపోయింది సంసారం...

ఆయన రాజేశ్వరి ఫొటో వంకే తప్పు చేసినవాడిలా చూస్తూ తలవంచుకుని నిలబడిపోయాడు, గతం కళ్ళముందు కదులుతుండగా.

తన గదిలో మంచంమీద పడుకుని బాధను గుండెల్లోనే బిగపట్టుకుంటున్నది స్పందన. రెండు నిముషాలు కళ్ళు మూసుకుని పడుకొని, లేచి ఏదో ఆలోచిస్తున్నట్లుగా, మంచం పక్కన క్రింద కూర్చున్నది. దాని క్రిందగా వున్న పాత ట్రంకు పెట్టెను ముందుకు లాక్కున్నది. దాని మూత తీసింది. అందులో అన్నీ తల్లి వస్తువులే.

అప్పుడప్పుడూ ఆమె ఆ పెట్టె ముందు కూర్చొని ఆలోచనల్లోకి వెళ్ళిపోవటం తనకు తెలుసు... అప్పుడు తను నవ్వుతూ అనేది ''వదిలేసిన మొగుడిని మర్చిపోలేకపోతున్నావేమిటే... పెళ్ళినాటి ఆ పట్టు చీరె, పాత ట్రంకుపెట్టెనూ చూస్తూ కూర్చుంటావు ఎప్పుడూ" అని.

"ఆయనిచ్చిన నీ మీద ప్రేమ ఉన్నట్లే వాటిమీదా ఉంటుంది మరి!" అనేది మురిపెంగా తల్లి ఆ పట్టుచీరను తడుముతూ, తన వంకే చూస్తూ.

''మరి ఎక్కడున్నాడో ఒకసారి వెళ్ళి చూచిరాగూడదూ... నీ కోరిక తీరుతుందిగదా!"

ఆమె ముఖం ఎఱ్రబడేది– తను ఆయన డబ్బు దాహాన్ని సహించలేకపోయింది. ఆయన మాట వినని తననూ ఆయన సహించలేకపోయాడు. ఇద్దరూ పెద్దగా తగువులాడుకున్నదీ లేదు.

స్పందన పుట్టిన తరువాత బారసాలకు రావటం... వెళుతూ, వెళుతూ, 'కాస్త డబ్బుకు ఇబ్బందిగా వున్నది... నాన్ననడిగి వచ్చేటప్పుడు ఓ యాభై వేలు పట్టుకు వస్తే, నాకు వెసలుబాటుగా వుంటుంది' అనడం... తను నిరాకరించటం జరిగిపోయింది... ఆయన వెళ్ళిపోయి తనను రమ్మనమని మళ్ళా అడగలేదు... ఆయన పిలవందే ఎందుకు వెళ్ళాలని తనూ వెళ్ళలేదు...

మధ్యవర్తుల రాయబారాలు... ఇద్దరివీ మెట్టుదిగని వ్యక్తిత్వాలే...

కాపురం విచ్ఛిన్నమయిపోయింది!

తన తల్లి పట్టుచీర క్రిందగా వున్న ఫొటో తీసి, 'ముఖం చూడు ఎంత అమాయకంగా ఉన్నదో... ఒట్టి డబ్బు మనిషి... కర్కోటకపు గుండె' అనేది మురిపెంగా ఆ ఫొటోనే చూస్తూ, పెదవి విరిచి తనతో...

తను నవ్వేసేది.

'అమ్మా, నాన్నా ఏడ్చి గోల చేస్తుంటే ఒకసారి తలవంచాను... సరే ఆఖరుసారిగా

మీరు ఇవ్వగలిగింది ఇవ్వండి... నా మొగుణ్ణి నేను తిరిగి కొనుక్కుంటాను మీ ఆనందం కోసరం.' అమ్మ తను పుట్టిన సంవత్సరానికి అన్నదట... నలుగురిమాటా కాదనలేక...

మళ్ళా మధ్యవర్తుల హడావుడి...

ఆ హడావుడిని కాల్చి బూడిద చేస్తున్నట్లుగా– అప్పటికే ఆయన మరో స్త్రీకి అమ్ముడుపోయాడనే వార్త... వాళ్ళ మధ్య పూర్తిగా ఇనుప తెరలను దించివేస్తూ!

ఆ మాటలు వింటున్న తను జాలిగా తల్లివంక చూసేది.

మాణిక్యం తలుపు దగ్గర నిలబడి, స్పందనను చూస్తూ, "కాఫీ పెట్టేదా? టీ పెట్టేదా?" అని అడిగింది.

ఉలిక్కిపడింది స్పందన... ఫొటోను తదేకంగా చూస్తున్నదల్లా– దాన్ని చటుక్కున పెట్టెలో అడుగున పెట్టేసింది.

'గిరజాల జుట్టుపోయి బట్టతల వచ్చినా... ఆ నుదురు, కళ్ళు, నాసికా ఇప్పుడొచ్చింది ఆయనే అని చెబుతున్నాయి... అప్పటికంటే బాగా పొట్టవచ్చింది వయస్సుతోపాటు!'

లేచి వడివడిగా బయటకు వచ్చింది, తువ్వాల తీసుకుని తడిసిన కళ్ళను తుడుచుకుంటూ.

ఇంకా తల్లిఫొటోనే చూస్తూ నిలబడి వున్న తండ్రిని చూస్తూనే, "అదేంవిటి... కూర్చోండి!" అన్నది.

ఆయన మెడ తిప్పి కూతురు వంక చూశాడు.

"నేను మీ అమ్మకు చాలా అన్యాయం చేశాను!" అన్నాడు.

స్పందన పేలవంగా నవ్వింది.

"గతాన్ని గుర్తుకు తెచ్చుకుంటూ పాశ్చాత్తాప పడటం అర్థంలేని విషయం... కూర్చోండి... జరిగిపోయిన దాన్ని తవ్వుకుంటే వచ్చే లాభం లేకపోగా మనస్సంతా

వికలమయి బాధిస్తుంది!"

"నా జీవితంలో వసుంధర కాలు పెట్టకుండా వున్నట్లయితే, తరువాతనయినా, నా తప్పును నేను గ్రహించి మిమ్మల్ని దగ్గరకు తీసేవాడినేమో!" అన్నాడు.

స్పందన మాట్లాడలేదు.

"అదో విచిత్రమయిన మలుపు... రాజేశ్వరితో గడిపిన కాలంలో నేను డబ్బుకు చాలా ఇబ్బంది పడ్డాను... ఇప్పుడు డబ్బు ఉన్నది కాని మనశ్శాంతి లేకుండా పోయింది!"

"ఎందుకని?"

"నేను త్వరలో అరవై సంవత్సరాలలో కాలు పెట్టబోతున్నాను... దానికీ యాభై అయిదు దాటబోతున్నయి... ఇంతవరకూ అది తల్లి కాలేకపోయింది... ఈ వయస్సులో ఇక అయ్యే అవకాశమూ లేదు!" అన్నాడు నిరాశగా.

స్పందన ఏమీ మాట్లాడలేదు. అది చాలా సున్నితమయిన విషయం.

"కాఫీ కలుపుకు వస్తాను!" అన్నది వంటయింటి వైపుకు వెళుతూ.

"సుగర్ వేయవద్దమ్మా! నా ఆరోగ్యానికి అది సరిపడదు!"

"ఎన్నాళ్ళబట్టీ ఈ ప్రాబ్లమ్!"

"పదేళ్ళయింది నాకు తెలిసి... అంతకుముందు ఎన్నాళ్ళబట్టీ వున్నదో తెలియదు... ఒకసారి కాలికి గాయమై తగ్గకపోతే వైద్యుడి సలహామీద నెత్తురు పరీక్ష చేయించాను... సుగర్ చాలా ఎక్కువగానే ఉన్నట్లుగా తెలిసింది... నాకు ఆశ్చర్యమేసింది... ఈ సమస్య మా నాన్నకు లేదు... మా అమ్మకు లేదు!" చిన్నగా నవ్వాడు ఆయన.

స్పందన వంటయింట్లోకి వెళ్ళింది చిన్నగా నవ్వుకుంటూ. 'తల్లిదండ్రులకుంటేనే రావాలని ఎక్కడున్నది ఏ రోగమైనా... మీ నాన్న మీ అమ్మను వదిలేయకపోయినా, మీరు మా అమ్మను వదిలేయలేదా!' అనుకున్నది విషణ్ణంగా మనస్సులోనే.

తరువాత లోపల మాణిక్యం చేసిన కాఫీని కప్పులో పోసి తెచ్చి ఆయన ముందు టీపాయ్ మీద పెడుతూ, "పూరీలు చేస్తాను... తింటారు గదా!"

"నీకేదయితే నాకూ అదే!" అన్నాడు తృప్తిగా.

కూతురి మాటలు వింటుంటే ఆమెకు తను అన్యాయం చేసినా, కోపంగాని, ద్వేషంగానీ లేవు అనిపించగా మనస్సులోనే సంతోషించాడు.

ఆమెను తన గృహానికి గనుక తీసుకు వెళితే తనకు పిల్లలు లేరనే దిగులే లేదు!

ప్రథమ దర్శనంలోనే తనకు కూతురనే గొప్ప పెన్నిధిని అందించిన లక్ష్మమ్మ అవ్వంటే ఆయనకు ఎంతో భక్తి ఏర్పడింది. మనస్సులోనే హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియబరుచుకున్నాడు.

"నాకు ఊహ తెలిసినప్పటినుండీ అమ్మ వారంలో ప్రతిరోజూ ఒంటి పూట భోజనమే... నాకిష్టమయిన టిఫెన్ చేసిన రోజు నేనూ అన్నం తినేదాన్ని కాదు... ఇప్పుడయితే నేనూ అమ్మలాగానే ఒంటిపూట భోజనం చేస్తున్నాను!"

ఆయన జాలిగా కూతురు వంక చూశాడు.

మాణిక్యం అప్పటికే దొడ్లో పొట్టుపొయ్యి వెలిగించి నీళ్ళు పెట్టింది. స్పందన తండ్రి రాక ఆమెకూ ఆనందాన్ని కలిగిస్తున్నది. ఎవ్వరూ లేని తనూ, యిరవై సంవత్సరాలపైగా వీళ్ళతోనే బ్రతుకుతున్నది. స్పందన చిన్నపిల్లగా ఉండగా ఎత్తుకు మోసింది.

ఇద్దరూ ఎదురెదురుగ్గా కూర్చొని మౌనంగా కాఫీలు త్రాగారు. స్పందన టీపాయ్‌మీద తండ్రి పెట్టిన ఖాళీ కప్పును తీసుకొని వంటయింట్లోకి వెళుతూనే, "మాణిక్యం బజారుకు వెళ్ళి బంగాళదుంపలు పట్టుకురా... నేను చీటీ రాసిస్తాను... మన గుడ్డలకొట్టుకు వెళ్ళి వారికి ఓ ధోవతీ తువ్వాల పట్టుకురా... ఆయన స్నానం చేసింతరువాత కట్టుకుంటారు.... అటు వెళ్తూ వెళ్తూ మూర్తిగారిని రమ్మనమని చెప్పి వెళ్ళు!" అన్నది.

"అలాగేనమ్మా!"

"కల్యాణీ! చదువుకోవటం అయితే గోధుమపిండి తడిపెట్టు!"

"అలాగే అక్కా!"

ఆమె స్పందనను పిలుస్తున్న తీరుకు క్షణం కలవరపడ్డాడు జగన్నాథం. వంట యింట్లోకి చంకలో క్రచ్‌తో వెళుతున్న కల్యాణిని చూస్తూనే, "ఈ అమ్మాయి ఎవరు?" అన్నాడు ఆత్రంగా.

"నా చెల్లెలు!"

ఆయన ఉలిక్కిపడ్డట్లుగా తలెత్తి కూతురు ముఖంలోకి చూచాడు. తనకు పుట్టింది స్పందన ఒక్కతే.. దాని బారసాలకు వెళ్ళినప్పుడే తను ఆఖరుసారిగా రాజేశ్వరిని చూడటం... తరువాత ఆమెను చూడనే లేదు. అటువంటిది ఈ కుంటి అమ్మాయిని తన చెల్లెలు అంటుందేమిటి?... ఆయన ముఖం వివర్ణమయింది. తను ఆమెను వదిలేసిన తరువాత తిరిగి ఆమె వివాహం చేసుకోలేదు గదా?

ఆయనకు ఆ ఊహ వచ్చిన వెంటనే చాలా కలవరపడ్డాడు.

"ఈ అమ్మాయిది పక్క గ్రామం... ఒకటో తరగతినుంచి మా స్కూల్లోనే చదువుతున్నది... వాళ్ళు చాలా బీదవాళ్ళు... అమ్మ ప్రోద్బలంతోనే వాళ్ళు కల్యాణిని స్కూల్లో జేర్చింది... ఆ అమ్మాయి అయిదో తరగతి చదువుతుండగా, వాళ్ళు ఓ సాయింత్రం పనిమీద ఈ ఊరు వచ్చి, కూతురు ఎలా చదువుతున్నదీ అమ్మనడిగి తెలుసుకొని, ఇంటికి సెవన్ సీటర్ ఆటోలో వెళుతుండగా, దానికి యాక్సిడెంట్ అయి వాళ్ళు చనిపోవటమే గాకుండా ఈ అమ్మాయి అవిటిదయింది... విషయం తెలియగానే అమ్మవెళ్లింది... అక్కడ ఒంటరి అయిన ఈ అమ్మాయిని ఆదుకునే దగ్గర వాళ్ళెవ్వరూ లేకపోవటంతో, తనే తీసుకు వచ్చి, మనింట్లోనే ఉంచుకున్నది... ఇప్పుడు పదో తరగతి లోకి వచ్చింది... ప్రతిసంవత్సరం కల్యాణే క్లాసులో ఫస్టు వస్తుంటుంది... చాలా తెలివిగలది!"

జగన్నాథం ఓ నిట్టూర్పు విడిచాడు– రాజేశ్వరి మీద పిచ్చి ఆలోచనలు వచ్చిన అతడి మనస్సుకు ఊరట కలిగింది.

"నా లెక్క ప్రకారం ఇప్పుడు నీకు యిరవై ఏడు సంవత్సరాలు... ఈ పాటికే నీకు వివాహమయి, తల్లివయి ఉంటావని ఊహించాను!" అన్నాడు కొద్ది నిముషాల తరువాత. "నేను తాతనయినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదనుకున్నాను!"

మౌనంగా ఉండిపోయింది ఆయన మాటలు వింటూ స్పందన.

"మగ దక్షత లేని కుటుంబంలో ఆడపిల్లలకు ఇటువంటి పరిస్థితి ఏర్పడటం సహజమే!" అన్నాడు ఆయనే తిరిగి నోరు తెరిచి– తన తప్పిదానికి పాశ్చాత్తాపపడుతున్నట్లుగా.

"అమ్మ నన్ను తల్లిగానే కాదు, తండ్రిగా కూడా పెంచింది!" అన్నది కాస్తంత రోషంగా స్పందన.

"నేను ఎలా కాదంటాను... ఆమె అలా చూడకపోతే నువ్వీనాడు ఇలా నిలబడగలిగి ఉండేదానివా?" అన్నాడు తన మాటను ఆమె తప్పుగా ఊహించినట్లుగా అర్థం చేసుకుంటూ.

తిరిగి స్పందనకు మౌనమే శరణ్యమయింది.

"ఇప్పుడు ఇక నీ తండ్రే నీకు తల్లిగూడా అయి నీ అవసరాలు తీర్చవలసిన బాధ్యతను నెత్తిన వేసుకునేటందుకు సిద్ధంగా ఉన్నాడమ్మా!" అన్నాడు తృప్తిగా మనస్సంతా పూర్తిగా ఆమె మీద అభిమానంతో నిండిపోగా.

వాకిట అలికిడి. మనిషి చెప్పులు విడుస్తున్న శబ్దం.

"రండి మూర్తిగారూ!"

మూర్తి లోపలకు వచ్చి చిరునవ్వుతో జగన్నాథాన్ని చూస్తూ నమస్కరించాడు. "మాణిక్యం మీ రాకను చెప్పినప్పుడు నాకెంతో ఆనందం కలిగింది... స్పందనగారు

ఎవ్వరూ లేని ఒంటరి కాదు... ఆమెకు తోడుగా, నీడగా, కోటగోడలా తండ్రి వున్నాడనే విషయం నాకెంతో తృప్తిని కలిగించింది!" అన్నాడు ఆయన పక్కగా సోఫాలో కూర్చుంటూ.

స్పందన మూర్తిని తండ్రికి పరిచయం చేసింది.

"మనిషి పెరుగుదల పక్కనున్న వారి మంచితనం మీదే ఉంటుంది... వర్తమానం సద్వినియోగం చేసుకున్నప్పుడే భవిష్యత్తు స్వర్గమయం అవుతుంది!"

"పెద్దలు... మీకు నేను చెప్పేదేమున్నది... ఎవరైనా విశాల హృదయంతోనే సత్యసారాన్ని గ్రహించగలుగుతారు!"

స్పందన లేచి లోపలకు వెళ్ళి, కల్యాణి కలిపిన గోధుమపిండిని పళ్ళెంతో సహా తెచ్చి వంటింటి వాకిలి గడప దగ్గర కూర్చున్నది.

"నేను మీకు గూడా టిఫెన్ చేస్తున్నాను... తింటారు గదా!"

జగన్నాథం చొరవతీసుకుంటూ, "అలా అంటావేమిటి... తినమని చెప్పాలి!" అన్నాడు పెద్దవాడిగా కూతురు తప్పు సరిదిద్దుతున్నట్లుగా.

"అందులో తప్పేమున్నది... ఆయన ఇంట్లో వాళ్ళ అమ్మ చేసే వుంటుంది ఈపాటికి... అక్కడో, ఇక్కడో ఒక చోట చేసింది వ్యర్థమయిపోతుంది... ఎందుకు కావాలి అలా!"

"అక్కడా అమ్మ పూరీలే చేస్తున్నది... నేను ఇక్కడ తినను!" అన్నాడు నవ్వుతూ మూర్తి.

"ఫైన్!" అంటూ పకపకా నవ్వేసింది స్పందన.

"ఈ రోజున నా కన్న కూతురును చూడగలిగాననే ఆనందంతోపాటు... ఆ ఒక్కగా నొక్క కూతురూ ఇలా ఎవ్వరూ లేని అనాథలా వున్నదని చాలా బాధగా వున్నది... నా యింట్లో డబ్బు మూలుగుతున్నది... నేనేం చేసుకోవాలి దానిని?"

అన్నాడు తలవంచుకొని బాధగా మూర్తినే చూస్తూ.

"అదేంవిటి మీకు పిల్లలు లేరా?" అడిగాడు మూర్తి మెడతిప్పి ఆయన్నే చూస్తూ.

"పిల్లలు లేరూ అని ఎలా అంటాను... స్పందన నా కూతురుకాదా?"

స్పందన గతుక్కుమన్నట్లుగా తలెత్తి ఆయన వంక చూసింది... ఇప్పుడు తననిగాని తన వెంట రమ్మనమనడు గదా?...

చటుక్కున తలెత్తి అమ్మ ఫొటో వంక చూసింది– కూతురికి ఎంతో ధైర్యం చెబుతున్నట్లుగా వున్న ఆమె చూపులతో మనస్సును కుదుటబరుచుకున్నది.

ఆయన స్పందనవైపుకు తిరిగి, "చెప్పాను గదా... మీ పిన్ని తల్లి కాలేకపోయింది కాబట్టే సహజంగా బంధువర్గం కళ్ళు మామీద పడినయి... అందరూ మా బాగుకోరే వాళ్ళలాగా నటిస్తూ అహర్నిశలూ మాయింటి చుట్టూ తిరుగుతున్నారు.... ఇప్పుడు అనుకోకుండా లక్ష్మమ్మ అవ్వ నా కన్నకూతురుని నాకు చూపించింది... ఇక నేను ఇంత కష్టపడి సంపాదించిన ఆస్తిని మరొకళ్ళకు ధారాదత్తం చేయాల్సిన అవసరం లేకుండా నన్ను ఆశీర్వదించింది!" అన్నాడు ఆనందంతో కళ్ళు మెరుస్తుండగా.

ఇప్పుడు స్పందనకు స్పష్టంగా అర్థమయింది ఆయన మాటల్లోని ఆంతర్యం... కానీ తన తల్లి ఉంటే ఇప్పుడు ఏం చేసేవాడు.

కొద్ది క్షణాలు కన్నార్పకుండా ఆయన వంకే చూస్తూ పదేపదే ఆ ప్రశ్ననే తనలో తాను వేసుకోసాగింది.

"పూరీలలోకి బంగాళదుంప కూర చేస్తున్నాను!" అన్నది తండ్రివంక చూస్తూ.

"నాకెంతో ఇష్టమైనవి అవి... నాకు గుర్తున్నంత వరకూ అమ్మ ఎక్కువగా అవే చేస్తుండేది!" అన్నాడు నవ్వి. "ఇదుగో సుగర్ వచ్చింతరువాత తగ్గించనయితే తగ్గించానుగాని, పూర్తిగా తినటం మానేయలేదు!"

– పదేపదే ఆయన తల్లిమాట ఎత్తటం ఆమెకు కాస్తంత ఎబ్బెట్టుగా

వున్నట్లనిపించింది. అంతగా గుర్తున్నవాడయితే, ఆమెను ఎన్నడైనా బ్రతికివున్నదో, చచ్చిందో తెలుసుకోవటానికి ప్రయత్నించాడా?... ఇప్పుడు తనను చూశాడు కాబట్టి, అందునా తన ఆస్తంతా అన్యాక్రాంతమయిపోతుందేమోననే భయంతో ఉన్నాడు కాబట్టి, ఈ మాటలు మాట్లాడుతున్నాడని పించింది. ఆపైన ముసలి వయస్సులో కాలు పెట్టబోతున్న తమను ఆ ఆస్తి తినేవాళ్ళు ఎంతవరకు సాదరంగా చూస్తారనే అనుమానమూ ఉండి ఉండవచ్చు!

అలా అనుకుంటున్నప్పుడు ముఖం మ్లానమయింది.

ఈ ప్రపంచంలో మనుష్యులకు స్వార్థమే ప్రథానాంశం... ఆ తరువాతే ప్రేమలూ, అభిమానాలు... తండ్రిగాని, మరొకరుగాని!

– అంత డబ్బును తనకు ఎరగా వేస్తే, తను రాకపోతుందా, వాళ్ళను, వాళ్ళ ఆస్తిని ఆదుకోకపోతుందా అనేది ఆయన ఆలోచనలా వున్నది.

మూర్తి లేచాడు. “నేను వెళతాను... అమ్మ నాకోసరం ఎదురు చూస్తుంటుంది తను తినకుండా!” అన్నాడు.

“రేపు మీరు కర్నూలు వెళుతున్నారటగదా... ఎన్నింటికి వస్తారు తిరిగి?”

“నాలుగు గంటలకు వచ్చేస్తాను... నా మిత్రుడికి కొడుకు పుట్టిన సందర్భంలో బారసాల, నామకరణం... భోజనాలు కాగానే బయల్దేరి వద్దామని!”

“వారిని రేపు సాయంత్రం లక్ష్మమ్మ అవ్వ గుడికి తీసుకు వెళ్ళాలి... వారు కొంత డబ్బును గుడికి ఇద్దామనుకుంటున్నారు... దాన్ని ఎలా ఉపయోగిస్తే బాగుంటుందా అని ఆలోచిస్తున్నారు... నేను అన్నదానానికి ఇవ్వమన్నాను... ఏదైనా మీరు వారిని తీసుకుని అక్కడకు వెళ్ళి, ఆలయ ధర్మకర్తతో మాట్లాడి, ఎలా ఆ డబ్బును సద్వినియోగం చేయవచ్చో ఆలోచించి అలా చేయండి!”

“అలాగే... వీలయినంత త్వరగా వచ్చేస్తాను కర్నూలునుంచి!” మూర్తి జగన్నాథానికి నమస్కరించి శెలవు తీసుకొని వెళ్ళిపోయాడు.

మూర్తి వెళ్ళిన పదినిముషాలకు మాణిక్యం వచ్చింది బజారునుంచి స్పందన చెప్పినవి తీసుకొని.

"నీళ్ళు కాగినయ్యేమో చూసి తోడు... వారు స్నానం చేస్తారు!" అంటూ మాణిక్యం ఇచ్చిన సంచీలోనుంచి గుడ్డల కవరు బయటకుతీసింది. అందులోవున్న రెండంచుల ధోవతిని, తువ్వాలను తీసుకొని వంటయింట్లోకి వెళ్ళి, దేవుడి ఫొటోముందు వున్న పసుపు తీసి వాటి కొసలకు పెట్టింది.

హాల్లోకి వచ్చి, "లేవండి... లేచి స్నానం చేసి ఈ ధోవతి కట్టుకోండి!" అంటూ వాటిని ఆయనముందు టీపాయ్ మీద పెట్టింది.

"అయ్యో... ఇప్పుడెందుకు తెప్పించావమ్మా అవి... లాడ్జిలో వున్నయిగదా... వెళ్ళగానే గుడ్డలు మార్చుకుండేవాడని!" అన్నాడు ఆత్మీయంగా కూతురు వంక చూస్తూ జగన్నాథం. ఆమె మాటతీరు, తన ముందు ఆమె ప్రవర్తన, ఆమెకు తనమీద ఎలాంటి ద్వేషమూ లేదనే చెబుతోంది.

"అమ్మ నా గురించి ఎప్పుడూ ఏమీ చెప్పలేదా?" అడిగాడు కుతూహలంగా.

క్షణం అవాక్కయింది ఆ ప్రశ్న వింటూ, అంత సూటిగా ఆయన అడగటంతో.

"ఆమె ఏం చెప్పాలనుకున్నా నాకు ఊహ తెలిసే వయస్సు వచ్చేటప్పటికే మీకు దూరమయి పదేళ్ళు అయివుండవచ్చు... దుఃఖంగాని, ఆనందంగాని అన్నాళ్ళ తరువాత కరిగిపోతుందేగాని, మరొకళ్ళకు చెప్పుకునేటంతగా గుండెల్లో గూడు కట్టుకుని ఉంటుందని నేను అనుకోను!" అన్నది చాలా లౌక్యంగా.

"స్పందనా! నీ తండ్రితో నువ్వు మనస్సు విప్పి మాట్లాడలేవా?... నేనయితే చేసిన తప్పును సరి దిద్దుకోవాలనే అనుకుంటున్నాను... నాకు దొరికిన ఈ అవకాశాన్ని నేను వదులుకోదలుచుకోలేదు!" ఆసక్తితో కూతురు ముఖంలోకే చూస్తూ అన్నాడు.

"తండ్రిగా మీరు నా దగ్గరకు రావాలనుకోవటంలో ప్రత్యేకతేమీ లేదు... అది సహజం... కానీ ఇప్పుడు అమ్మే జీవించివుంటే మీరు ఇలా అనగలిగేవారా?" ఆమాట

అడిగి కన్నార్పకుండా ఆయన్నే చూస్తూ వుండిపోయింది.

జగన్నాథం ఆ ప్రశ్నకు ఉక్కిరిబిక్కిరి అయ్యాడు.

"అమ్మ జీవించి వున్నా నన్ను నీకు తండ్రిని కాదూ అనేదా?" కొద్ది క్షణాల తరువాత తేరుకొని అన్నాడు.

ఆమె హేలగా నవ్వింది. ఆమెకు తెలుసు– తన ప్రశ్నకు ఆయన దగ్గర సరైన సమాధానం వుండదు అని... అలా ఉండటం అంటూ జరిగితే తనని ఇలా యాధృచ్ఛికంగా కలవటం కాదు.... తమను వెతుక్కుంటూ ఇంటికి వచ్చివుండేవాడు!

మాణిక్యం తలుపు దగ్గర నిలబడి, "బాబుగారూ! నీళ్ళు తోడాను!" అన్నది.

స్పందన వెంటనే, "లేవండి... లేచి స్నానం చేస్తే... ఈలోగా నేను టిఫెన్ తయారు చేస్తాను... తిని విశ్రాంతి తీసుకుందురుగాని... పొద్దున్నే వెళ్ళి లాడ్జిలో రూం ఖాళీ చేసి రావచ్చు!"

ప్రతిమనిషికి వయస్సు పెరుగుతున్న కొద్దీ శరీరమే కాదు, మనస్సూ బలహీనపడుతుంది. అభద్రతా భావం ఏర్పడుతుంది... అందునా ముందు ముందు లేవలేని స్థితిలో, తమను ఆదుకునేటందుకు కన్నవారు లేరు అనుకున్నప్పుడు మరింత భయమేస్తుంది.

ఆదే ఆయన చేరదీసిన ఆడమనిషికి ఓ పిల్లోపిల్లవాడో ఉన్నట్లయితే, ఈనాడు ఇంతదూరం లక్ష్మమ్మ అవ్వ దర్శనంకోసరం వచ్చి వుండేవాడేకాదు... వచ్చినా, తను తటస్థపడగా గుర్తించినా, రెండు పలకరింపు మాటలతో వెళ్ళిపోయివుండేవాడు.

ఆయన స్నానం చేసి కొత్త ధోవతి కట్టుకుని, నుదుట కుంకుమ పెట్టుకుని, దేవుడికి దణ్ణంపెట్టుకొని హాల్లోకి వచ్చిన తరువాత, తన చేతిలోని అక్షింతలను ఆయనకిస్తూ, "నన్ను ఆశీర్వదించండి!" అంటూ నేలమీద కూర్చొని, శిరస్సు వంచి ఆయన పాదాలకు నమస్కరించింది.

ఆయన ఆశీర్వదిస్తున్నట్లుగా ఆమె తల మీద చేతిని వుంచి, "నువ్వ వీలయినంత

త్వరలో ఇక్కడ బంధాలన్నీ తెంచుకుని నాదగ్గరకు రావాలని మనసా వాచా కోరుకుంటున్నాను!" అన్నాడు ఆనందంగా.

స్పందన లేస్తూ చిరునవ్వు నవ్వింది.

"కూర్చోండి... టిఫెన్ చేద్దాం!" అన్నది.

కల్యాణి వచ్చి, స్పందన కూర్చున్న సోఫాలోనే పక్కగా కూర్చున్నది. మాణిక్యం పూరీలున్న హాట్‌ప్యాక్‌ను, మంచి నీళ్ళ జగ్గును తెచ్చి టీపాయ్‌మీద పెట్టింది. గ్లాసులు పెట్టింది.

"నాకూ వయస్సు మీరుతున్నది... ఇప్పుడే ఏదో ఒకటి చేయకపోతే మీకు చేసిన అన్యాయానికి నాకు నిష్కృతి లేదు!" అన్నాడు.

"మీరు చెప్పేది బాగానే వున్నది... నాకూ ఆనందంగానే వున్నది... మీరు నన్ను తీసుకు వెళ్ళాలనే నిర్ణయాన్ని, అనుకోకుండా కనబడిన నన్ను చూసి.... క్షణాలల్లో తీసేసుకున్నారు... కానీ ఎన్నో సంవత్సరాలు... జీవితంలోని ఒడుదుడుకులను ఎదుర్కొంటూ... ఒకవిధంగా కాలంతో ఎదురీదుతూ నన్నూ, ఈ స్కూలునూ పెంచి పోషించింది అమ్మ... అటువంటి ఆమె కష్టంతో రూపుదిద్దుకున్న ఈ ఫలాల్ని, ఆమె ఆశయాలనీ, మీలాగానే నేనూ క్షణాలలో నిర్ణయాలు తీసుకొని, నిర్లక్ష్యం చేసి అమ్మకు అన్యాయం చేయగలనా? అసలు అది భావ్యమా నాకు?" అసహనంగా అన్నది స్పందన. ఆలాంటి ఊహకే ఆమె గుండె బరువెక్కుతున్నది.

"నేను ఇప్పుడే రమ్మనమనటం లేదు... త్వరలో అంటున్నాను!"

"నేను మీకు ఈనాడు కనబడకపోయినట్లయితే అసలు మీకు ఈ కోరిక కలిగేదే కాదు... కానీ నేను రోజూ చూచే మూడు వందల మంది పిల్లల్ని వదిలి పెట్టి రావాలి... అది గుర్తుంచుకోండి!"

"నాకు నువ్వు ఒక్కదానివే కావాల్సినదానివి... కానీ నీ మూడు వందల మంది పిల్లలకూ చాలామంది కావాల్సిన వాళ్ళు వాళ్ళ వాళ్ళ ఇళ్ళల్లో ఉన్నారు... ఇక

విద్యాలయంలోనూ నీ స్థానంలో కాలుపెట్టినవాళ్ళే వాళ్ళ బాగోగులు చూస్తారు.... వాళ్ళంతా నీ బిడ్డలు కాదు... రెండు నెలల క్రితం వరకూ మీ అమ్మ చూచింది వాళ్ళను... ఇప్పుడు నువ్వు చూస్తున్నావు... రేపు నీలాగానే ఇంకొకరు చూస్తారు... అదొక వ్యవస్థ... దానికి అంతం లేదు... కానీ మనుష్యులకు అంతం వున్నది... పరాయి అమ్మలు కన్న పిల్లలకోసరం, నీ జీవితాన్ని మోడు చేసుకోవాల్సిన అవసరం లేదు... వచ్చిన అవకాశాన్ని ఎప్పుడూ జారవిడుచుకోగూడదు... నీ తండ్రి... నిన్ను కన్నతండ్రి నిన్ను అక్కున జేర్చుకొని, వెలాతెలాపోతున్న నీ జీవితానికి, నీ భవిష్యత్తుకు రంగులు అద్దుదామనుకుంటున్నప్పుడు– అందులో నువ్వు అంతగా ఆలోచించాల్సిందేమీ లేదు!" స్పష్టంగా ఆయన మనస్సులోని మాటను కూతురుకు చెప్పాడు.

"మనుష్యులు అంతరించిపోవచ్చు... కానీ, విలువలూ, మమతలూ శాశ్వతంగా వుంటాయిగదా... అమ్మ నాకు కొన్ని స్పష్టమయిన మార్గాలు ఏర్పరిచింది... వాటిమీద నేను ఎలా నడవాలో నేర్పింది... ఆలవాటు పడ్డ ఆ దారి మారాలీ అంటే ఎంతగానో ఆలోచించవలసి వుంటుంది!"

"అది మంచి లక్షణమే... కాదనను... తండ్రి మాత్రం తన రక్తం పంచుకు పుట్టిన కూతురుని తప్పుదారిలోకి తీసుకు వెళతాడని ఎందుకనుకోవాలి?" జగన్నాథం దిగాలుగా ముఖంపెట్టి అన్నాడు.

"కానీ, యిరవై ఏడు సంవత్సరాలు ఒక దారిలో నడిచిన నేను, దానిని మార్చాలీ అంటే అది క్షణాలల్లో జరిగే పనికాదు... ఎన్నో ఆలోచించాలి... ఎవ్వరికీ అన్యాయం జరగగూడదు... అలాంటి నిర్ణయం తీసుకోవటానికి చాలా సమయం పట్టవచ్చు– నన్ను అర్థం చేసుకోండి!" ఆయన మాటల్ను పూర్తిగా తృంచివేస్తున్నట్లు కాకుండా మధ్యే మార్గంగా చెప్పింది.

"నువ్వు నా దగ్గరకు వస్తే ఇంకా సుఖపడతావని... ఇక్కడయితే నీ గురించీ, నీ భవిష్యత్తు గురించీ, నీ ఆనందం గురించీ, నువ్వు జీవితంలో ఎదుర్కోబోయే సమస్యల గురించీ నువ్వే ఆలోచించుకోవాలి... అందుకు నీకు మరొకరి సలహా, సహకారం

ఎంతో అవసరం... నీకు భర్త వచ్చేటంతవరకూ, పెద్దవాడిగా నేను నీ మేలు కోరదామని నా ఉద్దేశ్యం!"

"రెండు పూరీలు వేస్తాను!"

"చాలా బాగున్నయ్యమ్మా... వెయ్యి... స్త్రీకి యుక్తవయస్సు వచ్చిందాకా ఎక్కడో పెరిగి, గతంనుంచి భర్త నిర్మించే భవిష్యత్తులో కాలు పెడుతుంది... ఆమెకు అది సంధిసమయం... ఒక విధంగా జీవితాన్ని లాటరీలో పెట్టినట్లే... కానీ కన్న సంతానం అలా కాదుగదా... కన్ను తెరిచినప్పటినుంచీ తల్లిదండ్రుల ఆప్యాయతలతోనే పెరుగుతుంది... ఒక నిబద్ధతను అలవరుచుకుంటుంది!"

స్పందన ఆ రాత్రి నిద్రపోలేదు. తెల్లవార్లూ ఎదురుగ్గా వున్న తల్లి ఫొటోనే చూస్తూ కళ్ళు తెరుచుకు పడుకున్నది.

నాలుగో రోజు ఉదయం జగన్నాథం హైద్రాబాద్ వెళ్ళిపోతూ, "నువ్వు తరుచూ హైద్రాబాద్ వస్తుండు... అక్కడి వాతావరణం పరిచయమవుతుంది... మనవాళ్ళంతా పరిచయమవుతారు!" అని చెప్పాడు.

"స్కూలు శెలవలప్పుడు రావటానికి ప్రయత్నిస్తాను... వచ్చేముందు మీకు ఫోను చేస్తాను!" అన్నది ఆయన వెళ్ళవలసిన బస్సు ఎక్కిస్తూ.

* * *

పడమట దిక్కు ఎర్రబడి పోతున్న సమయంలో స్పందన తలెత్తి గోడకున్న గడియారం వంక చూస్తూ కుర్చీలోనుంచి లేచి వరండాలోకి వచ్చింది.

వాకిట్లో మూర్తి పిల్లలచేత క్రికెట్ ఆడిస్తున్నాడు. యిరవైమంది పిల్లలదాకా ఉన్నారు. వాళ్ళంతా గుమిగూడి ఆయన్ను ఏదో అడుగుతున్నారు... స్కూలు మెట్లమీద మరో పదిమంది కూర్చొని ఉన్నారు.

"ముందుగా మీరు నేర్చుకోవాల్సింది అంపైర్ చెప్పింది తలవంచుకు వినడం... చెప్పినట్లు చేయటం.. అతడి నిర్ణయం ఒక్కోసారి తప్పుకావచ్చు.... కానీ ఈ ఆటలో

గెలుపు ఓటమిలకంటే క్రమశిక్షణకు ప్రాధాన్యమివ్వాలి... అతడు ఎల్బీడబ్ల్యూ యిచ్చాడు... మీరు ఇక మాట్లాడటానికి వీల్లేదు... ఆట కొనసాగనివ్వండి!"

"ఇది అన్యాయం సార్!" అన్నాడు బ్యాటింగ్ చేస్తున్న టీం కెప్టెన్.

"న్యాయమా కాదా అనేది తరువాత సంగతి... మీరు అడిగారు... అతడు కాదంటున్నాడు... మీరు ఒప్పుకోకపోతే ఈరోజుకు ఆట రద్దవుతుంది... అంతేకానీ అతడి నిర్ణయం మారదు... నేను మాట్లాడతాను అతడి తోటి ఆట అయిన తరువాత... అతడిది తప్పయితే మరోసారి అలా జరక్కుండా చూస్తాను!"

స్పందన వరండా స్థంభాన్ని ఆనుకు నిల్చొని అటువైపే చూస్తున్నది. మూర్తి మాటలు ఆమెకు స్పష్టంగా వినబడుతున్నయి.

ఆ స్కూలు డిసిప్లయిన్‌కు పెట్టింది పేరు. టెన్త్ పబ్లిక్ పరీక్షలలో జిల్లాలో ప్రథమస్థానంలో ఉంటుంది సామాన్యంగా ఎప్పుడూ.

స్పందన దానికి హెడ్‌మిస్ట్రెస్సే కాదు, కరెస్పాండెంటు... స్వంతదారిణి కూడా!

వెనక్కు వెళ్ళి తన గదిలో కుర్చీలో కూర్చుంటూ తలెత్తి గోడకున్న తల్లిఫొటో వంక చూచింది. అలా ఆమె రోజుకు ఎన్నిసార్లు ఆ ఫొటోవంక చూస్తుందో లెక్కేలేదు.

ఆ ఫొటోకు ఉదయాన తాజా పూలను మార్కెట్‌నుంచి తెచ్చి, దండకట్టి పాతది తీసివేసి, కొత్తదాన్ని ఆయా మాణిక్యం వేస్తుంది.

ఒకరోజు మూర్తి అన్నాడు, "చందనపు పూలదండ తెచ్చివేస్తే రోజూ మార్చాల్సిన అవసరం ఉండదుగదా!" అని.

"నాకు ఆమె ప్రతిరోజూ కొత్త స్ఫూర్తి కలిగించాలని ఆశ, కోరిక... దుమ్ము కొట్టుకున్న పాత దండను చూస్తూ నేను ఆ స్ఫూర్తిని పొందలేకపోవచ్చు!"

తరువాత అరగంటకు ఆయా మాణిక్యం క్లాసురూములన్నీ ఊడ్చి, తలుపులకు తాళాలు వేసి, స్పందన కూర్చున్న గదిలోకి వచ్చింది.

ఆమెను చూస్తూనే స్పందన లేచి బయటకు వచ్చింది.

ఆడుకుంటున్న పిల్లల్ని, దూరంగా ఉండి వాళ్ళకు సలహాలిస్తున్న మూర్తిని, చూస్తూ నిలుచున్నది. ఆయన తెలుగు మాస్టరేకాని, పాఠాలు చెప్పటంలోనే కాదు, పిల్లల ఆటపాటల్లో కూడా ముందుంటాడు. డ్రిల్లుమాస్టారుకు చేదోడు వాదోడుగా వుండి, ఆ ఊళ్ళోనూ, జిల్లాకేంద్రంలోనూ జరిగే అన్ని ఆటల పోటీల్లోనూ ఆ స్కూలు పిల్లలు పాల్గొనేలా చేస్తుంటాడు.

తండ్రి వెళ్ళిపోయి మూడు రోజులయినా ఆమె మానసికంగా ఇంకా స్థిమిత పడలేదు. ఇప్పుడు అమ్మ పోయిందనే దిగులేకాదు, మరో కొత్త సమస్య వచ్చిందనే బాధ ఆమె మనస్సుకు అశాంతిని కలిగిస్తోంది. తన తండ్రి తనను తనింటికి రమ్మనమని, తమతోనే ఉండమని ఆహ్వానించటంలో తప్పులేకపోయినా, అక్కడకు వెళ్ళటానికి తనకు మనస్కరించటంలేదు. అమ్మకు మూసి వేసిన తలుపులను, తన కోసరం తెరిచిపెట్టటంలో వాళ్ళది సదుద్దేశ్యం కాకపోవటం ఆమెను కృంగదీస్తోంది. ఆయనగారి ఆస్తీ పరుల చేతుల్లో పడకుండా ఉండేటందుకు, కూతుర్నంటూ తనను తీసుకు వెళ్ళి దానికి సెక్యూరిటీ గార్డ్‌లా నిలబెట్టాలనుకోవటం ఎంతవరకు సమంజసం... ఆపైన పైకి ఆ ఆస్తి అంతటికీ నువ్వే వారసురాలివి అంటూ రంగు పులమటం.... వయస్సు వచ్చింది కాబట్టి రేపు వాళ్ళకు హృదయపూర్వకంగా సేవ చేయగలిగేది కన్నకూతురే అనే నమ్మకం కూడా ఉండి ఉంటుంది... తాళిగట్టిన పెళ్ళాన్ని నిర్లక్ష్యం చేసినా, తన కూతురు మాత్రం తనకు కావాలి.... తనను పెంచి పెద్దచేసిన అమ్మకు అన్యాయం జరిగినా, ఆమె ఆశయాలన్నీ అడుగంటిపోయినా వాళ్ళకు నష్టం లేదు, బాధలేదు...

పిల్లలు ఆడుతున్న ఆట ముగిసినట్లుగా, భుజానికి సంచులు తగిలించుకుని వెళ్ళిపోతున్నారు.

మూర్తి వరండాలోకి వచ్చాడు.

“ఈసారి జిల్లా ఇంటర్ స్కూల్ టూర్నమెంట్స్‌కు మన స్కూలునుంచి క్రికెట్ టీమ్‌ను పంపాలనేది నా ప్రయత్నం! మన పిల్లలు చాలా చక్కగా ఆడుతున్నారు!”

అన్నాడు అతడు. "దాని వలన మనకు కొంత ఖర్చు అవ్వవచ్చు!"

"ఫరవాలేదు పంపండి... ఏదో విధంగా సర్దుదాం!"

"థాంక్యూ... మరి నేను వస్తాను!" అంటూ అతడు వెనక్కు తిరిగాడు.

"మాణిక్యం నా గదికి తాళం వేస్తున్నదిగదా... ఉండండి... నేనూ వస్తాను... మీరు ఎక్కడికైనా వెళ్ళాల్సిన పని ఉన్నదా?"

"అమ్మను డాక్టరు దగ్గరకు తీసుకు వెళ్ళటం ఒక్కటే పని!" అన్నాడు చిన్నగా నవ్వి.

"నా మనస్సేమీ బాగోలేదు... మా ఇంట్లో పది నిముషాలు కూర్చొని టీ త్రాగి వెళ్దురుగాని!" అంటూ మెట్లుదిగింది.

ఆ స్కూల్లో స్పందన అంటే పిల్లలకే కాదు... అక్కడ పనిచేసే టీచర్లకూ భయమూ, భక్తీ ఉన్నాయి.

రెండు నెలల క్రితం వరకూ ఆమె తల్లి చూచేది ఆ స్కూలు వ్యవహారాలన్నీ. బీఈడీ చదివిన తను సాయం చేస్తుండేది. ఆమె పోయింతరువాత తనే అన్నీ చూసుకోవాల్సి వచ్చింది. ఆఫీసు పనుల్లోనూ, ఏవైనా సమస్యలు వచ్చినప్పుడు మూర్తి సలహా, సహాయం తీసుకుంటుంటుంది. మూర్తి తండ్రి తన తాతయ్యకు తెలిసినవాడు. అమ్మ ఈ ఊరు వచ్చినప్పటినుండి ఆ కుటుంబంతో ఆమెకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. మూర్తి తెలుగు పండింట్ కోర్స్ చేసింతరువాత ఇదే స్కూల్లో అమ్మ ప్రోద్బలంతోనే జేరాడు.

మాణిక్యం ఆమె గదికి తాళం వేసి బయటకు వచ్చి వాళ్ళు గేటు దాటగానే దానికిగూడా తాళంవేసింది.

ముగ్గురూ ఆ కాంపౌండ్ వాల్‌కు అనుకునే వున్న ఆమె ఇంట్లో కాలు పెట్టారు..

* * *

"ఇది అమ్మ శ్రమకు ఫలించిన విద్యాలయం కాదు... దేవాలయం... అందుకే అమ్మ జ్ఞాపకార్థం మన స్కూలు ఆవరణలోనే ఓ పెద్ద గదిని నిర్మించి ధ్యానమందిరంగా చేయాలని నా తపన!" అన్నది స్పందన ఇంటి మెట్లెక్కుతూ..

వరండాలో కల్యాణి కూర్చొని తెల్లని సిల్కు గుడ్డను ఫ్రేములో బిగించి రంగుదారాలతో పూలు కుడుతోంది.

"ఫోను మీద వున్నది మాస్తే మరొకటి లేదని బహు తాపత్రయపడుతున్నది!" అన్నది నవ్వుతూ కల్యాణి వంక చూస్తూ స్పందన.

ఇద్దరూ లోపలకు వెళ్ళి సోఫాలల్లో కూర్చున్నారు. మాణిక్యం వంటయింట్లోకి వెళ్ళింది టీ పెట్టేటందుకు.

"ఈ మధ్య నాకూ అలాంటి ఆలోచనే ఒకటి వచ్చింది!" మూర్తి అన్నాడు ఉత్సాహంగా ఆమె వంక చూస్తూ. "ఆమె పేరు మీద ప్రతిసంవత్సరం ఎండాకాలం శెలవల్లో పిల్లలకు ఒక క్యాంప్ నడుపుదామని... పదిహేను రోజులు పిల్లలు పూర్తిగా ఇక్కడ ఉండేలా... భగవత్ ధ్యానం, యోగానే కాకుండా, అమ్మకు ఎంతో ఇష్టమయిన క్రమశిక్షణను వాళ్ళకు అలవాటు చేయాలనేది నా ఉద్దేశ్యం... వాళ్ళల్లోని, వాళ్ళకిష్టమయిన విషయాలల్లో ఉత్సాహాన్ని, ప్రజ్ఞను వెలికితీసి, ప్రోత్సహించాలని..."

"మంచి ఆలోచన... ఇప్పటికే ఆలస్యమయింది!"

"నాలో ఈ విషయం కొద్దికాలంగా రూపుదాల్చుకుంటున్నా... తాత్సారం చేయటానికి కారణం అది డబ్బుతో కూడిన పని అవ్వటమే!"

"ఎంత కావాల్సి వస్తుందని మీ అంచనా?"

"శెలవల్లో ఏర్పాటు చేస్తాం కాబట్టి వసతికి ఇబ్బంది లేదు... ఆహారం, ఉపాహారం విషయంలోనే ఖర్చుపెట్టాలి.... బయటవాళ్ళను ఆహ్వానించినప్పుడు కొంత ఖర్చవుతుంది!"

"అందుకు గాను, వాళ్ళకు అందుబాటులో ఉండేలా మనం ఫీజు నిర్ణయించవచ్చు

గదా!"

"నిర్ణయించవచ్చు గాని... మన దగ్గర తెలివిగల బీద విద్యార్థులూ ఉన్నారు... వాళ్ళను వదిలేయటం నాకిష్టం లేదు... కనీసం క్యాంపుకు యాభైమందినైనా ఎన్నుకోవాలి!"

స్పందన ఒక్కక్షణం ఆలోచిస్తున్నట్లుగా ఆగింది. "ముందు మీరు పూర్తి కార్యక్రమాన్ని తయారు చేయండి... ఖర్చులు కూడా అంచనా వేయండి... చూద్దాం... అమ్మ వుంది... అవ్వవుంది... వాళ్ళమీదే భారం వేద్దాం... మన స్కూలంటే అభిమానమున్న వాళ్ళూ చాలా మంది వున్నారు... వాళ్ళేమైనా సాయం చేయగలరేమో ప్రయత్నిద్దాం... అప్పటికీ తక్కువ పడితే, మీకు తెలియని దేమున్నది... అమ్మ ప్రతినెలా ఆదాయంనుంచి, అనుకోని అవసరాలకు గానూ కొంత నిధిని తయారు చేసింది గదా... మనమూ అమలు పరుస్తున్నాం దాన్ని... అందులోనుంచి తీసి వాడదాం!"

మూర్తి చాలా తృప్తిగా ఆమె వంక చూశాడు.

"మనం ఒకసారి ప్రయత్నిస్తేనేగాని దాని కష్టనష్టాలు మనకు అర్థంకావు... ముందు ముందు సంవత్సరాలకు అవి ఉపయోగపడతయి!" అన్నది స్పందన. "అది సరే! మరి స్కూలు స్థాయి క్రికెట్ పోటీలకు టీంను తయారు చేస్తున్నారు కదా... అదీ ఎండాకాలమే అవుతుందేమో!"

"రెండూ ఒకసారి కాకుండా చూడాలి... ఈసారి కర్నూలు వెళ్ళినప్పుడు ఆ విషయం విచారిస్తాను!"

ఫోన్ గణగణా మ్రోగుతుంటే స్పందన లేచి ఫోనెత్తి, "హలో... స్పందనను మాట్లాడుతున్నాను!" అన్నది.

"నేను నాన్ననమ్మా!"

"చెప్పండి!"

"మీ పిన్ని నిన్ను చూడాలని చాలా ఆతురత పడుతున్నది... రేపు రాత్రికి బయల్దేరి అక్కడకు వస్తున్నది... అది చెబుదామనే ఫోను చేస్తున్నది... తెల్లవారుజామున అయిదున్నరకు వస్తుందట బస్సు అక్కడకు... స్కూలు దగ్గరే దిగమని చెప్పాను... నువ్వుగాని, మాణిక్యంగాని బస్సు దగ్గరకు రండి!"

"అలాగేనండి!"

"మంచిదమ్మా! ఉంటాను!" ఫోను పెట్టేశాడు జగన్నాథం.

స్పందన చికాగ్గా వెనక్కు తిరిగి వచ్చి సోఫాలో కూర్చుంటూ, "నాకు అర్థం కానిదొక్కటే... ఆమె నాకు పిన్ని ఎలా అవుతుంది?" అన్నది.

మూర్తికి ఆమె ఎవరి గురించి మాట్లాడుతున్నదో అర్థం కాలేదు.

అదే అడిగాడు. "ఎవరు ఫోను చేసింది?"

"మా నాన్న!"

అర్థమయింది మూర్తికి. "ఆయన భార్య గురించేగదా మీరు మాట్లాడుతున్నది... మరి మీ నాన్నగారి రెండో భార్య మీకు పిన్నికాదా?"

"మా అమ్మ చచ్చిపోవటం వలన పెళ్ళి చేసుకుంటే ఆమె నాకు పిన్ని అవుతుంది... మా అమ్మ బ్రతికి వుండగానే, ఆమెకు విడాకులు ఇవ్వకుండా, ఓ ఆడమనిషిని ఆయన చేరదీస్తే, ఆమె నాకు పిన్ని ఎలా అవుతుంది!" అన్నది ఏహ్యంగా ముఖంపెట్టి. ఆమె కళ్ళల్లో ఎర్రటి జీరలు ఏర్పడుతున్నాయి.

తన కోసరం, తన ఉన్నతి కోసరం, తనకు బంగారు భవిష్యత్తును ఇవ్వటం కోసరం, రెక్కలు ముక్కలు చేసుకొని శ్రమించిన తన తల్లికి ఆమె ఏవిధంగా సోదరి సమానురాలు అవుతుంది- నాన్సెన్స్... తను భరించలేదు!

మాణిక్యం టీ తీసుకు వచ్చి వాళ్ళముందు టీపాయ్ మీద పెట్టింది.

టీ త్రాగేటంతవరకూ ఎవ్వరూ మాట్లాడలేదు.

అప్పటికి కోలుకొని తనని తాను నిగ్రహించుకుంటూ, "ఇప్పుడు ఈ సమస్య ఒకటి...నా బుర్ర తినేస్తూ!" అన్నది తలెత్తి మూర్తి వంక చూస్తూ.

"దాన్ని సమస్య అనుకుంటే ఎలా... తండ్రి ఇప్పటికయినా దగ్గరవుతున్నందుకు సంతోషపడాలి కాని!" అన్నాడు మూర్తి నచ్చచెబుతున్నట్లుగా.

"ఆయన ఆస్తిని నేను అనుభవించాలి అనేది ఆయన నోటినుండి వెలువడుతున్న మాట... కానీ, ఆ ఆస్తిని నేను జాగ్రత్తగా కాపలా కాయాలనేది ఆయన గుండెల్లో గూడుకట్టుకున్న నిజం... అదీగాక, ఈ ఎరతో వయస్సు మీరిన తమకు నేను సేవచేయాలనేది మనస్సులోని మరో కోరిక!"

"తప్పేమున్నది... ప్రతిమనిషీ కోరుకుండేది అదే... మీరు ప్రశాంతంగా ఆలోచించండి మీకే అర్థమవుతుంది!"

"ఇన్ని సంవత్సరాలు మేం కనబడలేదు... మేం తింటున్నామో, పస్తులుంటున్నామో ఆయనకు పట్టలేదు... మేం చచ్చామో, బ్రతికి ఉన్నామోకూడా తెలుసుకోవాలని ఆయన ప్రయత్నించలేదు... ఇప్పుడు... ఇప్పుడు ఆయన ఆస్తిమీద డేగలు వాలుతుంటే, వాటినుండి రక్షణకోసరం, నన్ను అడ్డు నిలబెట్టుకోవాలనుకోవటం, కన్నతండ్రిగా ఆయనకు న్యాయమా?" ఆమెకు ఆవేశమొస్తున్నది, ఆయన ఉద్దేశ్యాలు ఆమె కళ్ళముందు స్పష్టంగా కనబడుతుండగా.

మూర్తి అనునయంగా అన్నాడు. "అమ్మ ఎప్పుడూ దేనికీ ఇలా ఉద్రేకపడేది కాదు... ఆవేశపడేది కాదు... చాలా నెమ్మదిగా ఆలోచించేది... సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకునేది... ఆమెతో నాకున్న పరిచయంలో నేను అర్థం చేసుకున్నది అది!"

"అమ్మ మనస్సు తెలుసుకునేటందుకే లక్ష్మమ్మ అవ్వ సమాధిముందు రాత్రి అంతసేపు కూర్చున్నది నేను!"

"మీ సమస్యకు పరిష్కారం దొరికివుండాలి కదా మరి!"

"నేనింకా మా అమ్మ స్థితికి జేరుకోలేదు!" అమాయకంగా మూర్తి వంక చూస్తూ బేలగా అన్నది.

* * *

తెల్లవారుజామున సరిగ్గా అయిదున్నర గంటలకు అలారం మ్రోగింది. అప్పటికే మాణిక్యం లేచి వాకిలి ఊడుస్తున్నది.

స్పందన వరండాలో కుర్చీ వేసుకుని స్కూలు ముందు రోడ్డు వంకే చూస్తూ కూర్చున్నది. హైద్రాబాద్‌నుంచి వచ్చే బస్సు ఏ క్షణాననైనా రావచ్చు.

ఆయనగారు వచ్చి వెళ్ళి ఇంకా మూడు రోజులు కాలేదు. ఈవిడగారు అంత హడావుడిగా ఇప్పుడు ఎందుకు వస్తున్నదో? తనను హైదరాబాద్ తమింటికి శాశ్వతంగా వచ్చేయమని ఒత్తిడి చేయటానికి కాదుగదా?– మనస్సును ఆలాంటి ఆలోచనలు కలవరపరుస్తున్నాయి.

పదినిముషాలలోనే బస్సు రావటం గమనించి, లేచి, చెప్పులేసుకొని మెట్లుదిగి బయటకు వచ్చింది.

"నేను రానా అమ్మా?" అడిగింది మాణిక్యం.

"అక్కర్లేదులే... నీపని కానిచ్చేసేయ్!" అంటూ గేటుదాటి వడివడిగా స్కూలు వైపుకు నడిచింది.

అక్కడ ఆగిన బస్సులోనుంచి ఓ లావుపాటి ఆవిడ దిగింది. పట్టుచీర కట్టుకున్నది. ఎర్రటి మనిషి. పెద్దబొట్టు. జుట్టును చుట్టచుట్టి ముడి వేసుకుని కనకాంబరాలు పెట్టుకున్నది. హుందాగా ఉన్నది. ఆమెతోనే ఓ యువకుడు దిగాడు. సన్నగా, పొడుగ్గా వున్నాడు. కళ్ళజోడు. జీన్స్ ప్యాంటుమీద చారల చొక్కాను లోపలకు వేసుకున్నాడు.

వాళ్ళిద్దరే దిగటంతో ఆమెను గుర్తించటానికి పెద్ద ఇబ్బంది పడలేదు స్పందన.

"నమస్కారమండీ!... నేను స్పందనను!" అన్నది.

ఆమె నవ్వి, స్పందన చేయి పట్టుకుంటూ, "నువ్వే వచ్చావా, అమ్మా!" అన్నది ఆప్యాయంగా.

ఆమె చేతిలోని సంచీని అందుకున్నది స్పందన.

"వీడు నాతమ్ముడు, ప్రతాప్! బికాం చదివి... వాళ్ళబావగారికి వ్యాపారంలో సాయంగా వుంటున్నాడు... మా అమ్మాయిని చూడటానికి నేను వెళుతున్నానురా అంటే- పదక్కా నేనూ వస్తాను... ఒంటరిగా అంతదూరం నువ్వు మాత్రం రాత్రి ప్రయాణం ఎలా చేస్తావు అంటూ బయల్దేరాడు... పిచ్చి వెధవకు నేనంటే చెప్పలేనంత ప్రేమ!" అన్నది మురిపెంగా తమ్ముడి వంక చూస్తూ.

ముగ్గురూ ఇంట్లోకి వచ్చారు.

మాణిక్యం సంచీని అందుకుని లోపలపెట్టింది.

లోపలకు వస్తూనే ప్రతాప్ సెల్ బయటకు తీసి బావగారికి ఫోను చేశాడు కులాసాగా జేరినట్లుగా.

వాళ్ళు ముఖాలు కడుక్కునేటప్పటికి పాలురావటంతో కాఫీ కలుపుతుంటే ఆమె చొరవగా వంటింట్లోకి వచ్చి, "మాకు కాఫీలు అలవాటు లేదమ్మా... బోరన్‌విటా వుంటే కలుపు... లేదా వట్టి పాలు త్రాగుతాం!" అన్నది

"బోరన్‌విటా ఉన్నదిలేండి! మా కల్యాణీ అదే త్రాగుతుంది!" అంటూ తనొక్కదానికే కాఫీ కలుపకుని, వాళ్ళిద్దరికీ బోరన్ విటా కలిపి ఇచ్చింది.

"నువ్వు కనబడటంతో మీనాన్న ఎంత ఆనందంగా వున్నారో తెలుసా... ఏదో నిధి దొరికినంత సంతోషంతో మమ్మల్ని నిలవనిస్తేనా!... సరే ఆయన అంతగా ఆనంద పడుతున్నప్పుడు... ఆయన అర్ధాంగిగా నేను మాత్రం ఎందుకు ఆనందించగూడదు అనుకుంటూ వెంటనే బయల్దేరాను!" అన్నది గలగలా నవ్వుతూ.

కల్యాణి వీళ్ళ హడావుడికి లేస్తూనే, ముఖం కడుక్కునేటందుకు, చంకన కర్రేసుని హాల్లోనుంచి బాత్‌రూం వైపుకు వెళ్ళింది.

ఆ అమ్మాయిని చూస్తూనే, "కల్యాణి సంగతి గూడా చెప్పారమ్మా... విధి చేతిలో ఒక్కొక్కసారి ఎంతటి వాళ్ళయినా ఇలా అనాథలవ్వవలసిందే... పైన దేఁవుడు ఉన్నాడు కాబట్టే ఆ అమ్మాయి మీ అండన జేరింది!" అన్నది. "చక్కటి పిల్ల... మంచి తెలివిగలదిటగదా... కానీ అవిటితనాన్ని, అందమూ తెలివీ కప్పిపుచ్చలేవు గదా... పెళ్ళి చేయాలన్నా కాస్తో కూస్తో ఏదైనా లోపమున్నవాడుగాని దొరకడు!" అన్నది జాలిగా, చిన్నగా రహస్యం చెబుతున్నట్లుగా.

చికాగ్గా ముఖం తిప్పుకున్నది ఆమె మాటలకు స్పందన.

అప్పటికే ఆరున్నరయింది. తన పనులు మొదలు పెడితేనేగాని, స్కూలు టైంకు అందుకోలేదు... వాళ్ళ రాకతో తను ఈ రోజు ధ్యానంలో కూర్చోగలుగుతుందో లేదో... కూర్చున్నా మనస్సు నిలకడగా వుంటుందా అన్నదీ సందేహమే!

"మీరు పడుకుంటానంటే ఆ గదిలో మంచాలు ఉన్నయి... తెల్లవార్లూ బస్సులో కూర్చొని వచ్చారుగదా.... కాసేపు విశ్రాంతి తీసుకోండి!" అన్నది స్పందన. "నాకూ స్కూలు టైం అవుతున్నది!"

"స్కూలు నీదేగదా... నీకు టైం ఏమిటి... ఇవాల్టికి ఇంట్లో ఉండరాదూ... రాత్రికి మేం వెళ్ళిపోవాలి.... మేం లేకపోతే మీనాన్నకు ఒక్కక్షణం గడవదు... ప్రతిదీ ఇంట్లో అయితే నేను చూడాలి... వ్యాపారంలో అయితే మా తమ్ముడుండాలి!" అన్నది.

"పక్కనేకదా స్కూలు... అటూయిటూ తిరుగుతుంటాలేండి... స్కూలు తెరిచింతరువాత మాణిక్యం ఇంటికి వచ్చి వుంటుంది.... మీకు ఇబ్బందిలేకుండా కావాల్సినవి ఇస్తుంటుంది!" స్పందన ఇక మాటలు పెంచకుండా మరో గదిలోకి వెళ్ళిపోయింది.

వసుంధర లేచి గదిలో నాలుగు వైపులా అన్నీ చూస్తూ తృప్తిగా తమ్ముడి

ముఖంలోకి చూసింది.

ఆమె గోడమీద వున్న రాజేశ్వరి ఫొటోను చూస్తూనే, "అమ్మ పోయిన విషయం తెలిసి నాన్న ఎంత బాధపడ్డారో తెలుసా..." అంటూ స్పందన ఉన్న గదిలోకి వెళ్ళింది. "కనీసం నాకు మాట మాత్రంగానయినా తెలియబరచలేదు... వేం తగువులాడుకోలేదు, విడిపోలేదు... మాటపట్టింపు వచ్చి దూరమయినాం... అంత మాత్రాన చివరి చూపుకూడా లేకుండా చేయాలా... ఆ సంగతి తెలిసినప్పటినుండీ నా ప్రాణం విలవిలలాడుతున్నది- అంటూ ఒకటే ఇదయిపోతున్నారు!" అన్నది ఆమె.

ఏంమాట్లాడాలో స్పందనకు అర్థంకాలేదు. ఆమె మాటల్లో బహుచతురత చూపిస్తున్నదా అనిపిస్తోంది... తమను పాతికేళ్ళలో ఒక్కసారయినా చూచివెళ్ళాలనే జ్ఞానమే ఆయనకు లేనప్పుడు ఈరోజున ఆమె చనిపోయిందని తెలిసి బాధపడటం దేనికి?

"మీ అమ్మతో పెళ్ళయినప్పుడు ఏ ఇంట్లో వున్నారో, ఇప్పుడూ అదే ఇంట్లో ఉన్నాం... ఇల్లు మారాము తెలుసుకోలేకపోయామూ అనుకోవటానికి వీల్లేదు అనేది ఆయన బాధ... నేను అప్పటికీ అన్నాను... మీరు చెప్పింది నిజమే అవ్వవచ్చుగాని... చిన్న పిల్లకు ఆ విషయం ఎలా తెలుస్తుంది... అప్పటికే మీ మామగారూ, అత్తగారూ పోయారంటుంటిరి... జరిగిందేదో జరిగిపోయింది... పోయిన ఆమె గురించి చింతించే దానికంటే... బ్రతికున్న కన్న కూతురు సంగతి ఆలోచించండి- అని!"

"నా జీవితంలో నేను అమ్మలేకుండా ఏడ్చిన మొదటి రోజు అది... ఏం చేయాలో తెలియని శూన్యం నన్ను ఆవరించింది- ఆమె ఇక నాకు లేదూ అనుకున్నప్పుడు... ఆమె నాకు తల్లే కాదు... గురువు, దైవం... దారి చూపే వెలుగు... ఆమె మరణించిందీ అని తెలుసుకున్న మరుక్షణంలోనే నేను స్మృతిని కోల్పోయాను!" స్పందన కళ్ళు తడుస్తుండగా అన్నది.

"ఊరుకో అమ్మా ఊరుకో... నీకు బాధ ఉండదని కాదు... అన్నీ ఆమే అయి

పెంచినప్పుడు ఎవరి పరిస్థితి అయినా అలాగే వుంటుంది... కష్టాలు కలకాలం ఉండవ్... ఆమె లేని లోటు తెలియకుండా ఇక నిన్ను నాన్న చూచుకుంటాడు... నువ్వు నీ ఒంటరితనాన్ని మర్చిపోయి నలుగురిలో ఉల్లాసంగా ఉండవచ్చు!"

ఆమె మాటలు వింటుంటే రోషమొచ్చింది స్పందనకు. "నేను ఒంటరిదాన్ని ఎలా అవుతాను.... నాకు మూడు వందలమంది పిల్లలు ఉన్నారు... వాళ్ళ తల్లిదండ్రులు తోడుగా వున్నారు... వాళ్ళకు నామీద ఉన్న ఆత్మీయత ఎప్పుడూ అలాంటి ఆలోచననే నా దరికి రానీయదు... ఇక్కడ అందరికీ అమ్మన్నా, నేనన్నా ఎంతో గౌరవం... వాళ్ళే ఆరోజున నిలబడి అమ్మకు– ఆమె ఎవ్వరూ లేనిదికాదు అన్నంత ఘనంగా వీడ్కోలు యిచ్చి పంపారు!" ఆ మాటలన్న తరువాత ఆమె మనస్సు శాంతించినట్లుగా దేవుడి గూటివైపుకు చూచింది.

– అక్కడ తనకు ధైర్యం చెబుతున్నట్లుగా కూర్చొని వున్న లక్ష్మమ్మ అవ్వ కనబడింది!

స్నానం చేసి వచ్చి, తన గది తలుపులు వేసుకుని ధ్యానంలో కూర్చున్నది. జపం పరిశుద్ధంగా చేస్తే గుండె లోతుల్లోనుంచి నీటి బుడగలు వస్తున్నట్లుగా అనుభూతి చెందుతారు. వాయువు మేఘాన్ని చెదరగొట్టినట్లుగా, దైవ నామస్మరణ లౌకికమైన ఆలోచనలను చెదరగొడుతుంది. ఈ రోజున మనస్సంతా కలుషితమవ్వగా, ఎలాంటి అనుభూతినీ పొందలేకపోవటమే గాకుండా, ఎక్కువసేపు కూర్చోనుగూడా లేకపోయింది.

లక్ష్మమ్మ అవ్వ రూపాన్ని మూసుకున్న నేత్రాలలో స్థిరంగా ఉంచుకోలేని అలజడిలో నమస్కారం పెట్టుకుని, అమ్మ ఫొటో వంక రెండు నిముషాలు తదేకంగా చూస్తూ ఉండిపోయింది.

ఎనిమిదిన్నర అవుతుండగా బయల్దేరుతూ, "క్లాసులు ప్రారంభం కాగానే ఎవరి పనులు వాళ్ళకు అప్పజెప్పి వచ్చేస్తాను... ఈలోగా స్నానం చేస్తే, నేను రాగానే పలహారం చేద్దాం!" అన్నది.

"అలాగేనమ్మా!" అంటూనే సెల్‌లో ఎవరితోనో పెద్దగా నవ్వుతూ మాట్లాడుతున్న తమ్ముడివంక చూస్తూ, "ఇక్కడ కూర్చొని ఏం చేస్తావురా గోళ్ళు గిల్లుకుంటూ...

అమ్మాయితో వెళ్ళి స్కూలు చూసిరా!” అన్నది వసుంధర.

స్పందన చటుక్కున, “తరువాత తీసుకు వెళ్తాను లేండి... ఇప్పుడంతా హడావుడిగా వుంటుంది!” అంటూ గడపదాటింది.

ఆమాటను పట్టుకుని వసుంధర వదల్లేదు. తరువాత గంటకు టిఫెన్లు వాళ్ళకు పెట్టి, తను తిని, స్కూలుకు వెళుతుండగా, ఆమె తమ్ముణ్ణి స్పందన వెంట స్కూలుకు పంపింది.

మూర్తిగారికి సెకండ్ పీరియడ్ లేకపోవటం కొంతనయం... ఆయనకు అప్పజెబితే కబుర్లు చెప్పుకుంటూ కూర్చుంటారులే అనుకున్నది.

టీచర్స్ రూంలో వున్న మూర్తిని పిలిపించింది వెళుతూనే స్పందన. ఆమె గదిలో ఆమె ఎదురుగా కూర్చున్నాడు ప్రతాప్.

“ఎన్నాళ్ళయింది మీరు ఈ స్కూలును ప్రారంభించి?”

“నా అయిదో ఏట మా అమ్మ అప్పటికే నడుస్తున్న ఈ స్కూలును కొన్నది... తరువాత తరువాత బాగా వృద్ధి చేసింది... కొనకముందు ఇక్కడే టీచర్‌గా పనిచేస్తుండేది... వాళ్ళు మూర్తిగారి నాన్నగారికి తెలిసినవాళ్ళు... వాళ్ళు అమ్ముతాం అనగానే తాతయ్య సాయంతో దీన్ని తీసుకుని, నడపడం మొదలుపెట్టింది!”

“ఎంతకు కొన్నారేం?”

“అప్పుడు ఎంత?... ఊరికి చాలా దూరంగా ఉండేది... ఇంతని నాకు తెలియదుగాని, తక్కువే ఉండివుంటుంది ఈ రోజుల్తో పోల్చిచూస్తే!”

“ఇప్పుడు ఇక్కడ గూడా బాగా రేటు పెరిగివుంటుంది!”

నుదురు చిట్లించింది స్పందన.

“తెలియదు!”

“అప్పుడు వేలల్లో ఉంటే ఇప్పుడు లక్షల్లో... అప్పుడు లక్షల్లో ఉంటే ఇప్పుడు

కోట్లలో వుంటుంది... వ్యాపారం చేసే మాకు ప్రతిదీ లెక్కే!" అన్నాడు నవ్వుతూ ప్రతాప్.

మూర్తి వచ్చాడు. ప్రతాప్‌ను పరిచయం చేసింది.

"మీరే సబ్జక్ట్ చెబుతుంటారు?" మూర్తి కూర్చుంటుండగానే అడిగాడు ప్రతాప్.

"తెలుగు!"

పకపకా నవ్వాడు ప్రతాప్. "ఎవడికి కావాలండీ తెలుగు... ఇంగ్లీషు మీడియం స్కూలు కాదా ఇది?... దానికి ఈరోజున డిమాండ్ ఎంతున్నదో తెలుసా?"

"డిమాండ్ సంగతి నాకు తెలియదుగాని... మొన్న ప్రభుత్వం నిర్వహించిన గ్రూప్ వన్ పరీక్షల్లో తెలుగు మీడియంలో చదివినవాళ్ళు టాప్ ర్యాంకుల్లో ఉన్నారు... ఆర్డీవోలయ్యారు!" అన్నాడు చిరునవ్వుతో మూర్తి.

"విజయం సాధించిన వాళ్ళల్లో తెలుగు మీడియం వాళ్ళు ఎంతమంది?"

"తెలియదు... ఎంతమందైనా వజ్రం వజ్రమేకదా!"

అసహనంగా చూచింది ప్రతాప్ వంక స్పందన– అతడు మూర్తిని అవమానిస్తున్నట్లుగా మాట్లాడుతున్న తీరుకు.

"మాదీ ఇంగ్లీషు మీడియం స్కూలే... ఏ మీడియందైనా, మన మాతృభాష అయిన తెలుగు అనే సబ్జక్టు ఖచ్చితంగా పిల్లలకు నేర్పాలీ అనేది మన విధి కూడా!" అన్నది కాస్తంత కరుకుగా.

"నిజమే... కానీ నా ఉద్దేశ్యమేమిటంటే తెలుగు టీచర్‌గా ఉద్యోగంకంటే ఏ ఇంగ్లీషు టీచర్‌గానో అయితే ఇంకా ఎక్కువ సంపాదించవచ్చని... చూస్తున్నారుగదా ప్రపంచాన్ని... చదువుకుంటున్న ప్రతివాడూ సాఫ్ట్‌వేర్‌లోకి దూకెయ్యాలని... ఆపైన అమెరికా చెక్కేస్తే జేబునిండా డాలర్లు నింపుకోవచ్చని!"

మూర్తి అన్నాడు. "ప్రతివాడికీ ఒక టేస్ట్ వుంటుంది... ఒక ధ్యేయం వుంటుంది...

అందులో నిష్ణాతుడిని అవ్వాలనే ఆశ వుంటుంది... మీరేం చదివారు?... ఏం సాధించాలనుకున్నారు?"

"బికాం చదివాను... వ్యాపారం చెయ్యాలనుకున్నాను... చేస్తున్నాను!"

"ఆ బోడి బికాంకు ఇప్పుడేం విలువ ఉన్నదండీ... మీరు బిటెక్ చేసివుంటే ఇప్పుడు సంపాదించే దానికంటే ఎన్నోరెట్లు ఎక్కువ సంపాదించి ఉండేవారు... మీరన్నట్లు కంప్యూటర్ ప్రోగ్రాం ఏదైనా నేర్చుకుని... అమెరికా వెళ్ళి లక్షల్లో మునిగితేలే వారు... అందునా ఎమ్‌సెట్‌లో పాసుమార్కులు వస్తే చాలు... సీటు ఖాయం!" అన్నాడు వెక్కిరింతగా.

స్పందన హాయిగా నవ్వేసింది మూర్తి కొట్టిన దెబ్బకు.

ప్రతాప్ లేస్తూ, "స్పందనా! నీ పని నువ్వు కానిచ్చేసేయ్... కాసేపు అలా తిరిగి నేనూ మూర్తిగారూ స్కూలు చూసివస్తాం!" అన్నాడు.

విచిత్రంగా చూసింది స్పందన అతడి వంక. అతడు చూపిస్తున్న అతి చొరవకు అసహనంగా అటూ ఇటూ కదిలింది కుర్చీలోనే.

ఆమె ఇబ్బందిని గమనించినట్లుగా మూర్తి లేస్తూ, "పదండి...మా స్కూలు ఆవరణ ఎంత శుభ్రంగా, అందంగా వుంటుందో... నేను మాటల్లో చెప్పేదానికంటే మీరు చూస్తేనేగాని తెలియదు!" అన్నాడు.

"మూర్తిగారూ! మీరుండండి...మీకు కొన్ని పనులు చెప్పాల్సినవి ఉన్నాయి... ప్రతాప్‌గారూ మీరు ముందు వెళ్ళి చూస్తుండండి... వెనగ్గా వారు వచ్చి మిమ్మల్ని కలుస్తారు... క్లాసుల్లోకి వెళ్ళవద్దు... వాళ్ళను డిస్టర్బ్ చేయటం నాకే గాదు, వాళ్ళకూ ఇష్టం వుండదు!" అన్నది నొక్కి పలుకుతూ.

ముఖం ముడుచుకుని ఆ గదిలోనుంచి బయటకు వెళ్ళాడు ప్రతాప్.

అతడు బయటకు వెళ్ళగానే, "మనం ఇలాంటి వాళ్ళను చూసీ చూడనట్లుగా వదిలేయాలి... వాళ్ళ మాటలకు మనం స్పందించగూడదు... వాళ్ళ మనస్తత్వమే

అంత అనుకొని సర్ది చెప్పుకోవాలి మనస్సుకు!" అన్నాడు మూర్తి.

"చెప్పండి... నాకేం పని ఇస్తున్నారు?"

"ఏమీలేదు... అతడికి ఎప్పటికప్పుడు నోటిమీద వాతలు పెట్టకపోతే మరీ పెట్రేగిపోతాడు!... అది చెబుదామనే మిమ్మల్ని వుండమన్నది!" అన్నది నవ్వి స్పందన. "అతడితో వెళ్ళి అతడిని గమనించండి... నేను ఇంటికి వెళ్ళి లంచ్ తరువాత వస్తాను!" అన్నది లేస్తూ.

మధ్యాహ్నం భోజనాల సమయంలో, "ఇక నువ్వు హైద్రాబాద్ ఎప్పుడు వస్తావో చెప్పాలి... మేం అంతా నీ కోసరం ఎదురుచూస్తుంటామ్!" అన్నది నవ్వుతూ వసుంధర.

"వస్తానండి... కాస్త తీరుబడి చేసుకుని వస్తాను... స్కూలుకు ఏవైనా రెండు మూడు రోజులు శెలవలు రావాలి గదా... నేను ఇక్కడ లేకపోతే చాలా ఇబ్బంది అవుతుంది!"

"మీ నాన్న అయితే... నువ్వు ఇన్నాళ్ళూ ఎక్కడున్నావో తెలియక రాలేదు కాని... ఇక ఇప్పుడు... తరచూ వస్తుంటారులే... ఏ తండ్రి మాత్రం కన్న కూతురు వంటరిగా వుండటాన్ని చూస్తూ భరిస్తాడు!"

"ఇంత దూరం వచ్చారు గదా... మంత్రాలయం వెళ్ళి వస్తారేమిటి... గంటన్నర ప్రయాణం!" అడిగింది స్పందన.

"నేనూ ఇంతవరకూ చూడలేదమ్మా... వినటమేగాని... వెళితే బాగానే వుంటుందిగాని రాత్రంతా బస్సు ప్రయాణం... మళ్ళా రాత్రికే వెళ్ళిపోవాలి!"

"రేపు వెళ్దురుగాని అని చెప్పాను గదా!" అన్నది స్పందన మర్యాదపూర్వకంగా.

"కాదులే అమ్మా!... నిన్ను చూడాలనే ఆతురతతో ఎక్కడున్నవన్నీ అక్కడ వదిలేసి వచ్చాను... వెళ్తాంలే!" అంటూనే కంచంలో చేతులు కడుక్కుంటూ, అప్పుడే స్కూలునుంచి వస్తున్న కల్యాణిని చూస్తూనే, "ఇదుగో పిల్లా! ఈ కంచాలు తీసుకువెళ్ళి దొడ్లో పడేయ్!" అన్నది.

స్పందన త్వరత్వరగా, "ఆ అమ్మాయి ఎందుకు... నేను పడేస్తాలేండి!" అంటూ వాష్ బేసిన్ దగ్గర చేయి కడుక్కువచ్చి, డైనింగ్ టేబుల్ మీద వాళ్ళు అన్నం తిన్న కంచాలను తీయసాగింది.

"నాకు ఇక క్లాసులు లేవక్కా!... నేను తీస్తానులే... నువ్వెళ్ళు!" ముందుకు క్రచ్ సాయంతో వస్తూ కల్యాణి అన్నది.

"నువ్వు అన్నం తిని వెళ్ళి నా గదిలో కూర్చొని చదువుకో... టైం వేస్ట్ చేయవద్దు... మీ పబ్లిక్ పరీక్షలు నాలుగు నెలల్లోకి వచ్చినయి!" అన్నది పెద్దగా అరుస్తున్నట్లుగా, ఆమె కల్యాణిని ఎంగిలి కంచాలు తీయమని చెప్పటంతో మనస్సులోనే చికాకు పడుతూ.

కల్యాణి తన గదిలోకి వెళ్ళింది స్కూలు డ్రస్సు మార్చుకునేటందుకు.

"అది స్కూల్లోనే కాదు, జిల్లాలోనే ప్రథమంగా రావాలని... రాష్ట్రంలో మొట్టమొదటి పదిమందిలో వుండాలనేది నా కోరిక... అందుకే దానికి ఇంట్లో ఇలాంటి పనులేవీ నేను చెప్పను!" అన్నది స్పందన ఆమెకు మరో మాటకు అవకాశమివ్వకుండా.

కానీ ఆమె వదల్లేదు. "మనవాళ్ళ పిల్లేనా?... ఎవరూ లేరని దగ్గరకు తీశారటగదా... నిన్ను అక్క అంటుందేమిటి?" అన్నది గొంతు తగ్గించి రహస్యంగా అడుగుతున్నట్లుగా.

"కల్యాణి మా యింటికి వచ్చినప్పటినుండీ అమ్మను 'అమ్మా' అని పిలవటం అలవాటు చేసుకున్నది... అప్పుడు నేను అక్కనే అవుతానుగదా మరి! చిన్నపిల్లలకు ప్రేమలే తెలుస్తయిగాని... బంధుత్వాలు తెలియవు!" అంటూ అక్కడ ఒక్కక్షణం గూడా ఉండకుండా కంచాలను తీసుకుని దొడ్లోకి వెళ్ళిపోయింది స్పందన.

అక్కడ దొడ్లో నీళ్ళ తొట్టి దగ్గర కాళ్ళూ చేతులూ కడుక్కుంటున్న కల్యాణి దగ్గరకు వచ్చి, "అనవసరంగా ఆమెతో మాటలు పెట్టుకోబోకు... అడిగినదానికి

ముక్తసరిగా జవాబివ్వు... ఆమె ఏమైనా అన్నా పట్టించుకోబోకు!" అంటూ లోపలకు వచ్చేసింది.

లోపలకు వస్తున్న స్పందనను చూస్తూనే వసుంధర, "ఈమేనా లక్ష్మమ్మ అవ్వ... ఆయన ఈమె అంటేనే తెగ ఇదయిపోతున్నారు... అంత గొప్పదా ఆమె?" అన్నది దేవుడి గూటి దగ్గర వున్న అవ్వ పెద్ద ఫొటోను చూస్తూ.

"అవును...ఆమే మహాయోగి లక్ష్మమ్మ అవ్వ... మా అందరికీ దేవత... ఆమెను ప్రార్థిస్తే మనకు మనశ్శాంతి లభిస్తుంది!" అన్నది తనూ అటే చూస్తూ.

"కోరికలు గూడా తీరతయ్యా?"

"అదృష్టముంటే తీరేవాళ్ళకు తీరతయి... మనం విన్నవించుకునే పద్ధతిలో వుంటుంది... మనం కోరుకునే కోరికలో ఉంటుంది!"

"అంటే– అన్ని కోరికలూ తీరవన్నమాటే గదా!" అన్నది కొంటెగా.

"నేను భారతదేశానికి రాష్ట్రపతిని కావాలని అనుకున్నారనుకోండి... ఆ కోరిక తీరకపోవచ్చు!" అన్నది మరింత కొంటెగా స్పందన. "చూస్తారేమిటి... సాయంత్రం తీసుకు వెళతాను... ఆటోలో వెళ్దాం!"

"నిద్రలేచింతరువాతగానీ నిర్ణయించలేను!" అన్నది ఠీవిగా, తన భారీ శరీరాన్ని డైనింగ్ టేబుల్ దగ్గరనుంచి కదిలిస్తూ.

"ఆ గదిలో పడుకోండి... హాయిగా ప్రశాంతంగా వుంటుంది!" అన్నది తన పడకగది ఎదురుగది చూపిస్తూ.

"స్పందనా! మూర్తిగారు క్రికెట్ టీం తయారు చేస్తున్నారటగదా... రేపు ఎండాకాలం శెలవల్లో జిల్లా ఇంటర్ స్కూల్ కాంపిటిషన్స్‌లో పాల్గొనాలని అనుకుంటున్నారట... నాకు ఆ ఆటలో మంచి అనుభవం ఉన్నది... మా కాలేజీ టీంకు ఒక సంవత్సరం నేను కెప్టెన్‌ని కూడా... నేను అప్పుడప్పుడూ వచ్చి పిల్లలకు టిప్స్ ఇస్తుంటానని ఆయనతో చెప్పాను!" అన్నాడు ప్రతాప్ ఆమెకు చాలా దగ్గరగా

నిలబడి.

"మంచిదండీ!" అంటూ తన బెడ్‌రూంలోకి పని ఉన్నదానిలా వెళ్ళిపోయింది స్పందన.

వసుంధర గదిలోకి వెళుతూనే మంచమెక్కేసింది. ప్రతాపూ పక్కమంచంమీదకు జేరాడు.

"బావగారితో మాట్లాడతావేమిటే?" అన్నాడు సెల్ బయటకు తీస్తూ.

"మాట్లాడేదేమున్నది... ఎలాగూ రాత్రికి వెళ్తునే వున్నాం... నువ్వు చెప్పావుగదా పొద్దున్నే కులాసాగా జేరామని!" ఆమె కళ్ళు మూసుకున్నది నిద్రవస్తున్నట్లుగా.

స్పందన తరువాత పావుగంటకు స్కూలుకు వెళుతూనే మూర్తిని పిలిచి, "క్రికెట్ టీం సంగతి ప్రతాప్‌కు ఎందుకు చెప్పారు?" అని అడిగింది సీరియస్‌గా.

"నేను చెప్పలేదండీ బాబు! ఆయనగారే స్టోర్ రూంలో క్రికెట్ కిట్లు చూసి– నన్ను గంటసేపు తినేశాడు... ఆయనగారేమో ఆల్‌రౌండరట... వాళ్ళ కాలేజీ టీంకు కెప్టెనట... నేను, మీరు చెప్పినట్లు, నోరు తెరిస్తే ఒట్టు!" అన్నాడు నవ్వుతూ.

స్పందనా నవ్వేసింది.

"రాత్రికి వెళ్ళిపోతారట... వాళ్ళ మాటలు వింటుంటే నాకు మహా చికాగ్గా వున్నది... ఆ ముసలాయన్ని చూసి మాటవరసకయితే, ఉండమన్నాను కానీ... వాళ్ళు ఎంత తొందరగా వెళితే అంత హాయిగా వుంటుంది అనిపిస్తోంది నాకు!" అన్నది.

మూర్తి లేచి గదిలోనుంచి వెళుతున్నవాడల్లా, వెనక్కు తిరిగివచ్చి, "నాది ఓ చిన్న అనుమానం... మీరే తీర్చాలి!" అన్నాడు కాస్త తటపటాయిస్తూ.

అతడివంక నిశితంగా చూసింది స్పందన. "చెప్పండి... ఏవిషయంలో?" అన్నది.

"మీరు ఏమీ అనుకోవద్దు... నేను తప్పుగా మాట్లాడినా బాధపడవద్దు!" అన్నాడు

ఇబ్బంది పడుతున్నట్లుగా.

ఉత్కంఠతతో ముందుకు వంగింది. "అసలు సంగతేమిటి?" అన్నది.

"మీరు ఈ స్కూలును అమ్మేసి హైద్రాబాద్ వెళ్ళిపోవాలనుకుంటున్నారా?" చాలా త్వరత్వరగా అన్నాడు ఆ మాటలను.

ఆ మాటలు వింటూనే విభ్రాంతితో నోరు తెరుచుకు ఉండిపోయింది కొన్ని క్షణాల వరకు స్పందన.

"మీకెందుకు వచ్చింది ఆఅనుమానం?" అన్నది తరువాత కోలుకొని, తలవంచుకు నిలబడిన మూర్తినే చూస్తూ.

"ప్రతాప్‌గారు అన్నారు... వీలయినంత త్వరలో మీకు ఈ స్కూలు బాధ్యతలన్నీ వదిలించేసి, మిమ్మల్ని తీసుకు వెళ్ళి తన దగ్గరే ఉంచుకోవాలనుకుంటున్నారట మీ నాన్నగారు!"

చటుక్కున లేచి నిలబడింది స్పందన. ఆ మాట వింటూనే ఆమెకు చర్రున కోపమొచ్చేసింది.

"ఆయనగారన్నారని ఈయనగారు చెప్పారా?" అన్నది కంఠం హెచ్చించి కోపంగా.

మూర్తి తడబడ్డాడు.

"పదండి వెళ్ళి అడుగుదాం... ఆయనే అన్నాడో... వీళ్ళు కల్పించారో తెలుసుకుందాం!" అన్నది తలుపు వైపుకు అడుగులు వేస్తూ విసురుగా. "ఏమనుకుంటున్నాడు అతను... నోటికి ఎంత వస్తే అంత మాట్లాడేయటమేనా?... నా ఇష్టాఇష్టాలు అంటూ ఏమీ ఉండవా?" ఆమె ఆవేశాన్ని నిగ్రహించుకోలేకపోతున్నది.

మూర్తి అర్థం చేసుకున్నాడు– వాళ్ళు ఏదో ఎత్తుగడలోనే ఉన్నారన్నట్లుగా.

అందుకే, అతడు పెద్దగా నవ్వేసి, కూర్చుంటూ, "ముందు ఆ ఆవేశాన్ని

తగ్గించుకోండి... అధముడు మాటల్లో చురుగ్గా ఉంటాడు... ఉత్తముడు చేతల్లో చురుగ్గా ఉంటాడు... మనం జీవితంలో ఇలాంటి వాళ్ళను చాలామందిని ఎదుర్కోవాల్సి వస్తుంది... అతడి మాటల్ని నేనూ నమ్మలేదులేండి... అయినా అనుమానాన్ని మనస్సులో పెట్టుకొని మధన పడేదానికంటే, నివృత్తి చేసుకోవటం మంచిదని మీదగ్గర చనువు తీసుకుని అడిగాను!" అన్నాడు అనునయంగా ఆమెను చూస్తూ.

పదినిముషాలదాకా ఆమె మాట్లాడలేదు. కుర్చీలో కూర్చొని, తల్లి ఫొటో వంకే చూస్తూ ఉండిపోయింది– మూర్తి అనునయవాక్యాలు ఆమె ఆవేశం మీద చన్నీళ్ళు చల్లుతుండగా.

ఆమెకు అతడంటే ఎంతో గౌరవం. తూచితూచి మాట్లాడే అతడి మాటల్లో ఎంతో నిజాయితీ వుంటుంది.

"ఇది అమ్మ కట్టిన దేవాలయం... నేను దీన్ని వదిలి బ్రతకగలనా?... మీరు ఆ మాట విన్నవెంటనే ముఖం వాచేలా చివాట్లు పెట్టి వుండవలసింది!"

"ఇది మీ స్వవిషయం...మీ అభిప్రాయం తెలుసుకోకుండా నోరుజారటం నాకు తగని పని...అయినా, అలాంటి నిర్ణయం మీరు తీసుకోదలుచుకుంటే తప్పకుండా నా సలహా అడుగుతారని నా నమ్మకం... ఎనీవే... ఫర్‌గెటిట్!"

చాలాసేపు ఎవరి ఆలోచనల్లో వారు ఉండిపోయారు.

స్పందన ఉన్నట్లుండి ఫోనుతీసి, ఇంటికి రింగ్ చేసింది. కల్యాణి ఎత్తగానే, "వసుంధరగారు ఉన్నారా, అక్కడ?" అని అడిగింది.

ఆదుర్దాగా మూర్తి, ఫోను పట్టుకున్న ఆమె చేతిమీద 'వద్ద'న్నట్లుగా చేయివేశాడు– ఇది ఎన్ని గొడవలకు దారి తీస్తుందో అన్న భయంతో. మరుక్షణంలోనే తన తప్పిదాన్ని గ్రహించి, చేతిని వెనక్కు తీసుకుంటూ, "సారీ!" అన్నాడు.

ఆమె అతడి చేతినిగాని, మాటల్నిగాని పట్టించుకోలేదు.

అవతలవైపు ఆమె లైన్లోకి రాగానే, "మీరు రాత్రికి ఉండమంటే

వెళ్తామంటున్నారు...మరోసారి ఆలోచించండి... కాదు, వెళ్ళాలీ అంటే... మూర్తిగారిని పంపి టిక్కెట్లు తెప్పిస్తాను!" అన్నది.

మూర్తి ఓ నిట్టూర్పు విడిచి, తేలికపడుతూ వెనక్కు వాలాడు కుర్చీలో.

"లేదమ్మా... ఏమీ అనుకోవద్దు... రాత్రికి వెళ్ళాలి... ఈసారి తీరిగ్గా వచ్చి నువ్వు ఎన్నాళ్ళు ఉండమంటే అన్నాళ్ళు ఉంటాను... హైటెక్‌కు దొరుకతయ్యేమో ప్రయత్నించమంటున్నాడు ప్రతాప్... లేకపోతే రిజర్వ్ చేయించవద్దు... కర్నూలు వెళ్ళి అక్కడ హైటెక్ బస్సు ఎక్కుతాం!"

"అలాగే!" అంటూ ఫోను పెట్టేసి, మూర్తిని చూస్తూ, "మీరు వెంటనే వెళ్ళి రెండు టిక్కెట్లు హైటెక్‌లో తీసుకోండి... లేకపోతే వాళ్ళ కాళ్ళుపట్టుకునైనా సరే!" ఆమె కళ్ళు ప్రతాప్‌మీద కసితో ఎర్రగా మండిపోతున్నాయి.

మూర్తి ఆమె ఇచ్చిన డబ్బు తీసుకుని బయటకు వచ్చేశాడు.

సాయంత్రం అయిదు గంటలకు స్కూలు బెల్లు కొడుతుండగానే ఇంటికి వచ్చేసింది స్పందన-వాళ్ళను బస్సెక్కించి పంపించేస్తేనేకాని మనస్సుకు శాంతి వుండదు అనుకుంటూ.

ఆమె వచ్చేటప్పటికి ఇంకా వాళ్ళు మంచాలమీద పడుకునే ఉన్నారు. కల్యాణికి బోరన్‌విటా కలిపి ఇస్తున్న సమయంలో వసుంధర లేచి వంటయింట్లోకి వచ్చింది.

కల్యాణి స్పందన ఇచ్చిన గ్లాసును తీసుకుని హాల్లోకి వెళ్ళగానే, "నువ్వు చాలా అమాయకురాలివిలా వున్నావమ్మా.... అనాథలను తెచ్చి తిండి పెట్టటం మంచిదేగాని... బోరన్‌విటాలు ఇచ్చి, పట్టు పరికిణాలు కుట్టించి అందలమెక్కించటం అవసరమా అని... ఎవళ్ళను ఎక్కడ వుంచాలో అక్కడ ఉంచితేనే మన గౌరవాన్ని మనం కాపాడుకోగలుగుతాం... కష్టపడి సంపాదించేది మనకోసరమేగాని... పరాయివాళ్ళకు దానధర్మాలు చేయటానికి కాదుగదా!" అన్నది హితువు చెబుతున్నట్లుగా చిన్నగా, స్పందన దగ్గరికల్లా వచ్చి.

అసలే ప్రతాప్ వాగుడికి మండిపడుతున్న ఆమెకు, కల్యాణి గురించిన మాటలు ఆజ్యం పోసినట్లే అయింది.

"నిన్న మొన్నటి వరకూ మీకు నేను, నాకు మీరూ పరాయివాళ్ళమేకదా... ఇప్పుడు... ఇరవై ఏడేళ్ళ తరువాత పాత చుట్టరికాన్ని కలుపుకొని దగ్గరవాళ్ళమయ్యాం... అలాగే కల్యాణిగూడా... అది మా యింటికి వచ్చేటంత వరకూ పరాయిదే... కానీ వచ్చిన తరువాత మా అమ్మకు కూతురయింది... నాకు చెల్లెలయింది!" కోపాన్ని నిగ్రహించుకుంటూ, మరో రెండు గ్లాసుల్లో అక్కా తమ్ముళ్ళిద్దరికీ బోరన్‌విటా కలిపింది.

వసుంధర ఉక్కిరిబిక్కిరి అయింది ఆమె మాటలకు.

స్పందన మాటలు కాదనటానికి కారణం వెంటనే మనస్సుకు తట్టకపోవటంతో, "అవునులే అమ్మా... అవును!" అంటూ ముఖాన్ని నల్లగా మాడ్చుకుని, తను అంతవరకూ పడుకున్న గదిలోకి వెళ్ళిపోయింది రెండు గ్లాసులూ తీసుకుని, ప్రతాప్ ఇంకా అక్కడే మెళుకువతో పడుకొని ఉండటంతో.

ఆ రాత్రికి బస్సుకు వెళ్తున్న ఆమెకు బజారునుంచి జరీఅంచు చీర తెచ్చింది మధ్యాహ్నమే స్కూలునుంచి సరాసరి వెళ్ళి.

అప్పటిదాకా మొటమొటలాడుతూ మౌనంగా ఉండిపోయిన ఆమె– బొట్టుపెట్టి ఇచ్చిన చీరెను చూస్తూనే– స్పందన మాట కరుకేగాని, తనంటే ఇష్టమే అని సర్దిచెప్పుకున్నది తనకు తాను.

పదిన్నరకు బస్సు.

స్కూలు దగ్గర స్టేజీకి సంచీ తీసుకుని బయల్దేరుతుండగా, "అరేయ్ తమ్ముడూ! స్పందన టిక్కెట్లు తెప్పించింది గదా... డబ్బులిచ్చావా?" అన్నది వసుంధర.

"లేదక్కా! ఇద్దాం ఇద్దాం అనుకుంటూనే మాటల్లోపడి మరిచిపోయాను... ఇస్తాను!" అంటూ జేబులోనుంచి పర్సుతీశాడు.

"భలేవారే! మీ దగ్గర టిక్కెట్టుకు డబ్బులు తీసుకుంటానా నేను... వద్దు వద్దు!"

అన్నది తేలిగ్గా నవ్వేస్తూ– డబ్బులు పోతేపోయినయి... మరిన్ని మనస్థాపం కలిగించే మాటలను వాళ్ళనుండి వినే అవసరం లేకుండా... అంతకు మించి వెళ్ళి మొగుడికి తనమీద పితూరీలు చెప్పి గొడవలకు దారితీయకుండా ఉంటుందనే సదుద్దేశ్యంతో– మర్యాద పూర్వకంగా.

ఆమె మాట్లాడలేదు. ప్రసన్నురాలయినట్లుగానే చిరునవ్వు చిందించింది. ప్రతాప్ పర్సును జేబులో పెట్టేసుకున్నాడు.

ఇద్దరూ బస్సెక్కి స్పందనకు చేయూపుతుండగానే బస్సు బయల్దేరింది.

లోపల సీట్లలో కూర్చుంటూనే ప్రతాప్ అక్క చేయిపట్టుకు ఊపేస్తూ, "స్పందన నాకు బాగా నచ్చింది అక్కా!... నీ ఇష్టం నువ్వెప్పుడు ముహూర్తాలు పెట్టించినా నేను రెడీనే!" అన్నాడు సంతోషంతో ఊగిపోతూ.

"నాకూ నచ్చిందిలేరా... పెద్దక్క కూతురుకంటే ఇదే నయం... అందమున్నది... డబ్బున్నది... ఎటూ మీ బావగారికీ వాళ్ళనూ వీళ్ళనూ దత్తు తీసుకోవటం అంతగా ఇష్టంలేదు... అనుకోకుండా స్వంత కూతురు కనబడింది... అప్పటినుంచీ ఆ అమ్మాయినే ఇంటికి తెచ్చుకోవాలని బాగా ఉత్సాహపడుతున్నారు... మా సవితి ఉంటే పడనిచ్చేది కాదేమోగాని... ఆమె లేదుగదా... దీనికీ ఇక మన అండే అవసరం!" అన్నది నోరంతా తెరిచి నవ్వుతూ, తమ్ముడి చెవిలో గుసగుసగా.

వాళ్ళు ఎక్కిన బస్సు అక్కడనుండి కదలగానే, ఇంట్లోకి పరుగెడుతున్నట్లుగా అడుగులు వేసింది స్పందన. వంటయింట్లో దేఁవుడి గూటి దగ్గర వున్న వెండి గిన్నెలోనుంచి కాస్త పసుపు తీసుకుని, అరచేతిలో వేసుకున్నది. దానిమీద నాలుగు బొట్లు నీళ్ళు వేసి, హాల్లోకి వచ్చింది. స్టూలు తెచ్చుకుని, వంటయింటి వాకిటి తలుపు దగ్గరగా వేసి, దానిమీద ఎక్కి, అమ్మ ఫొటో క్రిందగా, ఆ పసుపుతో 'ఓం' అని రాసి దిగి స్టూలు తీసివేసింది.

ఆ ఫొటో ఎదురుగ్గా నిల్చొని, కళ్ళు తెరుచుకొని, తనకీ జన్మనిచ్చిన తల్లి వదనంమీదనే దృష్టిని కేంద్రీకరించింది. ప్రస్తుత మానసిక అస్థిమితతనుంచి

కోలుకోవాలన్నట్లుగా అమ్మ ఉండగావున్న మానసిక స్థితిలోకి వెళ్ళటానికి ప్రయత్నించసాగింది.

ఆమె అలా ఎంతసేపు నిల్చుని వున్నదో ఆమెకే తెలియదు. చిన్నగా ఆమె చెవులకు ఓంకారనాదం గింగిర్లుమంటూ వినిపిస్తుండగా ఆమెకు తెలివి వచ్చింది. అప్పటికే ఆమె ముఖమూ, శరీరమూ ఎవరో నీళ్ళు చిమ్మినట్లుగా, చెమటతో తడిసి ముద్దయి వున్నయి.

"ఓం... ఓం... ఓం..."

* * *

తెల్లవారుతుండగానే ఫోను వచ్చింది. అది హైద్రాబాద్‌నుంచి.

"నేను నాన్నను మాట్లాడుతున్నానమ్మా! పిన్ని వాళ్ళు కులాసాగా ఇంటికి జేరారు... రాత్రిపూట ప్రయాణం- ఎలా వెళ్ళారా అని నువ్వు ఆదుర్దా పడుతుంటావని ఫోను చేస్తున్నాను!"

"మంచిదండి!"

"నువ్వు వీలయినంత తొందరలో హైద్రాబాద్ వస్తే నాకు ఆనందంగా వుంటుందమ్మా!"

"చూస్తానండి!"

"చూస్తాననటం కాదు... పదిహేను రోజుల్లో క్రిస్మస్ శెలవలు వస్తున్నయి... అప్పుడు తప్పకుండా రావాలి! నువ్వు ఒక్కదానివే రావటానికి ఇబ్బందీ అనుకుంటే ప్రతాప్‌ను పంపుతాను... వాడే తీసుకువచ్చి, మరల శెలవులు అవ్వగానే నిన్ను తీసుకువెళ్ళి దింపుతాడు!"

"వద్దు... వద్దండీ... నేను వస్తానుగదా!" అన్నది ఆయన మాటలకు కాస్త ఇబ్బందిగా.

ప్రతాప్ పేరు వింటేనే ఆమెకు చికాకు వేస్తున్నది. అతడి మాటతీరు– ముఖ్యంగా తను స్కూలు అమ్మేస్తానన్నట్లుగా మూర్తిగారితో అనటం– ఆమెకు అతడిమీద ఏవగింపు కలిగిస్తోంది.

"మీ పిన్ని అక్కడకు వచ్చి నిన్ను చూసి ఎంతగా సంతోషించిందో చెప్పలేను. మన పిల్లలను మన దగ్గర ఉంచుకొని రోజూ చూసుకుంటుంటే మనకు ఆనందం... అంతేగాని, అంతదూరాన ఆ అమ్మాయి ఒంటరిగా, నా అనేవాళ్ళు లేకుండా ఉండటం ఏమీ బాగాలేదంటున్నది... ఆపైన ఇంకో మాటకూడా అన్నది మనస్సు కష్టపెట్టుకుంటూ..." ఆయన క్షణం ఆగాడు.

స్పందన మాట్లాడలేదు. చికాగ్గా ఫోను పట్టుకుని సోఫాలో కూర్చున్నది.

"స్పందన గనుక నన్ను అమ్మా అని పిలిస్తే నా జన్మ ధన్యమయివుండేది... నేనెంతగా సంతోషించేదాన్నో చెప్పలేను... కనీసం పిన్నీ అని పిలిచినా తృప్తిపడి వుండేదాన్ని– అన్నది బాధపడుతూ... నేను అనునయించానులే... కన్నతండ్రినయిన నన్నే నాన్నా అని పిలవటానికి అది మొహమాటపడిపోతున్నది.... దేనికయినా అలవాటవ్వటానికి కొంత సమయం పడుతుంది... తొందరపడితే ఎలా... గంటల పరిచయంతోనే ఎవరూ ముందుకు దూకలేరు అని సముదాయించాను!" అన్నాడు ఆయన నవ్వుతూ.

స్పందనకు నోరు పెగలటంలేదు.

"సరేలే... వీటన్నిటికీ కాలమే సమాధానం చెబుతుందికాని... నువ్వు ఎట్టి పరిస్థితులలోనూ క్రిస్మస్ శెలవలకు హైద్రాబాద్ వచ్చి మాతో గడపాలి... నువ్వు వచ్చిన వెంటనే పెదనాన్న, చిన్నాన్న కుటుంబాల్ని, మీ పిన్ని అక్కయ్యల కుటుంబాల్ని... మరికొంతమంది దగ్గర బంధువుల్నీ... నా ఆత్మీయ మిత్రుల్ని మనింటికి ఆహ్వానించి పెద్ద పండుగే చేసుకోవాలని మా ఆశ... అదే ఈ ఇంట్లో ఇకముందు జరగబోయే పెద్దపెద్ద ఫంక్షన్లకు ప్రారంభ సూచిక అన్నమాట!... ఉంటాను మరి..." అంటూ ఆయన ఫోను పెట్టేసిన తరువాత పదినిముషాల వరకూ స్పందన రిసీవర్‌ను చేతిలో

అలాగే పెట్టుకొని తల్లి ఫొటో వంక చూస్తూ కూర్చున్నది.

ఆరోజు స్కూల్లో గూడా అన్యమనస్కంగానే గడిపింది.

– వాళ్ళను చూస్తున్నా, వాళ్ళ మాటలు వింటున్నా ఆమెను తెలియని భయం ఆవరిస్తున్నది.

ధైర్యాన్ని కోల్పోవటానికి మించిన నష్టం మరొకటి లేదు– అనే అమ్మ మాటలనే గుర్తుకు తెచ్చుకుంటూ మనస్సుకు సాంత్వన చేకూర్చుకునేలా ప్రయత్నిస్తున్నది.

డబ్బులేకపోయినా ఫరవాలేదు– మంచి మిత్రుల్ని మాత్రం ఎన్నడూ దూరం చేసుకోగూడదు. తను ఈ ఊరు వదిలి ఎక్కడా శాంతిగా బ్రతకలేదు. అమ్మ కట్టించిన దేవాలయాన్ని రోజూ దర్శించకుండా ఉండనూ లేదు.

అలా గతాన్ని తలుచుకుంటూ, భవిష్యత్తును గురించి భయపడుతున్న సమయంలో వాకిట్లో మూర్తి మాట విని బయటకు వచ్చింది స్పందన.

“అమ్మకు బాగాలేదు... బాగా ఆయాసమొస్తోంది... జ్వరంగూడా ఉన్నట్లే ఉన్నది... మంచం మీదనుంచి లేవలేకపోతోంది– మాణిక్యాన్ని తీసుకువెళతాను!” అన్నాడు ఆదుర్దాగా.

“పదండి... నేనూ వస్తాను!” అన్నది స్పందన.

“ఫరవాలేదండి... మాణిక్యం చాలు!”

“మాణిక్యం ఉంటుంది... నేను ఒక్కసారి చూసి వచ్చేస్తాను!”

వాళ్ళిల్లు అక్కడకు దగ్గరే. పదినిముషాలల్లో ముగ్గురూ అక్కడకు వెళ్ళారు.

అప్పటికే పక్కింటామెను తల్లి దగ్గర వుంచి వచ్చాడు.

ఆమెకు అరవైపైనే వుంటయి. నెరిసిన జుట్టు... కనబడీ కనబడని కళ్ళు... శరీరం కాస్త లావు అవ్వటంతో ఆయాసం ఎక్కువగా వుండి కదలలేక ఇబ్బందిపడుతోంది.

ఆమెకు మూర్తి ఒక్కడే కొడుకు. భర్తపోయి చాలా సంవత్సరాలయింది.

ఆమె స్పందనను చూస్తూనే చేయెత్తి దగ్గరకు పిలిచింది– 'ఇలా ఉన్నదమ్మా నా పరిస్థితి' అన్నట్లుగా గుండెమీద చేయివేసుకు చూపించింది.

మూర్తి, "నేను డాక్టర్ను పిలుచుకు వస్తాను!" అని తల్లికి చెప్పి బయటకు వెళ్ళిపోయాడు.

"ఇలా అప్పుడప్పుడూ వస్తూనే వుంటుంది... భయపడాల్సిందేం లేదు అంటే వాడు వినడు!" రొప్పుతూనే మాటలను ఆపిఆపి అన్నది. "నా దిగులు నా అనారోగ్యం గురించి కాదమ్మా... వాడొక ఇంటివాడయితే నేను పోయినా వాడి ఆలనా పాలనా చూచేవాళ్ళు ఉంటారని... నాకు చెప్పీచెప్పీ విసుగు పుడుతోంది!"

"ఎందుకు చేసుకోరట పెళ్ళి?" అన్నది తేలిగ్గా నవ్వేస్తూ స్పందన.

ఆమె మరింత దిగులుగా ముఖం పెట్టింది.

"వాడివి లేనిపోని భయాలు... కోడలు వచ్చి నీకు సేవ చేస్తుందని అనుకుంటున్నావేమో... లేచి తిరుగుతూ తమ పనులు తాము చేసుకుంటున్న అత్తల్ని దగ్గర ఉంచుకోవటానికే ఇష్టపడటంలేదు నేటి కోడళ్ళు... ఇక మంచంలో పడితే, వచ్చే ఆమె నీకేదో తలకెత్తుతుందని ఆశపడబోకు అంటాడు– అంటే కోడలు నన్ను చూడదని ముందే భయపడుతూ, పెళ్ళిచేసుకోకుండా జీవితాన్ని నాశనం చేసుకోవాలనా... అర్థంలేని మాటలు... ఎవరికి ఎట్లా దేఁవుడు రాసిపెట్టి వుంటే అట్లా అవుతుంది... ఇంకో మూడునాళ్ళ ముచ్చట నా బ్రతుకు... అటువంటి నాకోసరం వాడు అనవసరంగా తపన పడటం తప్ప, జీవితంలో ఏం కోల్పోతున్నాడో తెలుసుకోలేకపోతున్నాడు!" అసలే ఆయాసం, అందులో ఆవేశం... రొప్పు ఎక్కువయింది.

"మీరు మాట్లాడకండి... ఆ విషయం తరువాత ఆలోచిద్దాంగాని... కాసిని వేడివేడి కాఫీ కలిపిస్తాను... త్రాగితే హాయిగా వుంటుంది!"

"పోయే ప్రాణాలకు కాఫీలు ఉపశమనమా అమ్మా! వాడో ఇంటివాడయితే

నేను ఏ బాధాలేకుండా సుఖంగా చచ్చిపోతాను!" అన్నది బరువుగా శ్వాసపీలుస్తూ.

స్పందన లేచి వంటయింట్లోకి వెళ్ళి కాఫీ కలుపుకు వచ్చింది.

మాణిక్యం సాయంతో ఆమెను లేపి కూర్చోబెట్టి, కాఫీ త్రాగిస్తుండగా, మూర్తి డాక్టర్ను తీసుకు వచ్చాడు.

ఎప్పుడూ చూచే డాక్టరే. ఆమె బాధ ఆయనకు తెలిసిందే. వెంటనే ఇంజక్షన్ ఇచ్చి మందులు రాసిచ్చి వెళ్ళిపోయాడు. తరువాత పావుగంటలోనే ఆమెకు ఆయాసం తగ్గుముఖం పట్టగా లేచి కూర్చున్నది.

మూర్తి మందులు కొనుక్కురావటానికి వెళ్ళాడు.

"నేను ఇలా అన్నానని వాడితో అనవద్దమ్మా... పెళ్ళి చేసుకోకపోతే ఉద్యోగం పీకేస్తానని కాస్త భయపెట్టు- అంతే!" అన్నది ఆమె చాలా చిన్నగా స్పందనకే వినబడేటట్లుగా.

స్పందన ఫక్కున నవ్వింది.

"చిన్న పిల్లాడా... చెప్పినమాట వినకపోతే కొడతానంటే భయపడేటందుకు... ఆయన ఎందుకు చేసుకోవటం లేదో నేను కనుక్కుంటానుగాని మీరు దిగులుపడుతూ రోగం పెంచుకోకండి... పెళ్ళి చేసుకోకుండా ఎన్నాళ్ళుంటారు ఎవరైనా... అనుకూలంగా ఉండే అమ్మాయి కోసరం చూస్తుండి వుంటారు!" అన్నది అనునయంగా ఆమెతో.

ఆమె కళ్ళు మూసుకు పడుకున్నది. మధ్యలో రెండు మూడు నిముషాలకొకసారి కళ్ళు తెరిచి ఎదురుగ్గా గోడకున్న వెంకటేశ్వరస్వామి ఫొటోకు దణ్ణం పెట్టుకుంటున్నది- ఆమె ప్రార్థన తనకు రోగం తగ్గాలనో, లేక కొడుక్కు తొందరగా పెళ్ళికావాలనో తెలియక ఆమెనే చూస్తూ వుండిపోయింది స్పందన.

మందులు తీసుకుని మూర్తి రాగానే, "మరి నేను వెళ్ళి వస్తాను!" అంటూ లేచింది.

"పదండి... నేను దించి వస్తాను!" అంటూ ఆమెను అనుసరించాడు.

"మీరుండి అమ్మకేం కావాలో చూడండి... దగ్గరే కదా... నేను వెళ్ళగలను! ఒక పని చేయండి... కాసేపుండి మాణిక్యాన్ని పంపండి... తను తిని, మీకు క్యారియర్ తీసుకు వస్తుంది... ఈలోగా నేను వంటచేసేస్తాను!"

"ఎందుకండీ... హోటల్‌నుంచి నేనే ఏదో ఒకటి పట్టుకు వస్తాను!"

"ఆమెకు పెడతారా అవి... ఆయాసం మళ్ళీ రావటానికా... ఏం ఫరవాలేదు నేను చేసి పంపిస్తాను!" అంటూ రోడ్డుమీదకు వచ్చేసింది.

అతడు ఆమెను అనుసరించాడు. రోడ్డంతా చీకటిగా వున్నది. వీధిదీపాలు వెలగటంలేదు.

తను ఆపినా అతడు ఆగడని స్పందనకు తెలుసు. అందుకే ఆమె మౌనంగా నడవసాగింది.

"మూర్తిగారూ! మిమ్మల్ని నేను ఒకటి అడుగుదామనుకుంటున్నాను!" అన్నది ఆ గుడ్డి వెలుగులో క్రింద గుంటలున్నయ్యేమోనని చూచి అడుగులు వేస్తూ.

"నిరభ్యంతరంగా!" అతడు పకపకా నవ్వాడు ఆ మాట అని.

స్పందన అటూయిటూ చూచింది ఎవరైనా ఆరోడ్డు మీద ఉన్నారా అన్నట్లుగా... అతడు అంత పెద్దగా నవ్వినందుకు ఇబ్బందిపడుతూ. ఎవ్వరూ కనబడకపోవటంతో కాస్త కుదుటబడింది.

"నవ్వులాటకాదు... సీరియస్‌గా అడుగుతున్నాను!"

"నేనూ సీరియస్‌గానే వింటాను, సమాధానం చెబుతాను!" అన్నాడు అతడు మరోసారి నవ్వి.

"పోనీలేండి... ఇప్పుడు కాదు!" ముఖం ముడుచుకుంటూ అన్నది.

"ఏదైనా నిజాయితీగా తెలుసుకోవాలనుకుంటున్నపుడు బిడియపడగూడదు!"

కాస్త అతడికి దగ్గరిగా జరుగుతూ, చిన్నగా, "మీరు ఇంతవరకూ ఎందుకు వివాహం చేసుకోలేదు?" ఎంత సీరియస్‌గా అడిగినా– ఆమె ముఖం కందింది ఆ మాటలంటున్నప్పుడు.

"నన్ను ఒకటి అడుగుతాను అని మీరన్నప్పుడు నేను ఎందుకు నవ్వానో తెలుసా... ఇందుకే... ఈ ప్రశ్న నాకు తెలిసిందే గనుక... అంటే అమ్మ క్లాసు పీకిందన్నమాట– నేను లేకుండా చూసి!" అన్నాడు, తిరిగి నవ్వబోయి, ఆపుకుంటూ, ఆమె వైపుకు మొహాన్ని తిప్పి.

"ఎందుకనుకోవాలి అలా అని... ఇలాంటప్పుడు ఇంటి పక్కవాళ్ళకూ, మాణిక్యాలకూ అవసరముండదుగదా అని నేనే అడుగుతున్నాను!"

అతడు ఒక్కక్షణం ఆగాడు.

"ఎందుకో చేసుకోవాలనిపించటంలేదు!" అన్నాడు నిర్లిప్తంగా.

ఆమె ఆగలేదు. "అందమైన అమ్మాయి కావాలనా?... అందమైన అమ్మాయిని వివాహం చేసుకోవటం అంటే రంగులేసిన ఇంటిని కొనుక్కోవటమేనని నేనెక్కడో చదివాను... అలాగే డబ్బు కోసరమే చేసుకుంటే ఆ అమ్మాయికి మా అమ్మకు పట్టిన గతే పడుతుంది! మనస్సెరిగి వివాహం చేసుకుంటే జీవితం ఆనందమయమవుతుంది... ఇద్దరి నడుమా మంచి బంధమేర్పడుతుంది... మీలోనూ ఆ అమ్మాయి కోరుకుండే గుణాలు వుండేలా చూసుకోండి... అప్పుడు వివాహ జీవితం స్వర్గమయమే!" అన్ని చెప్పిన తరువాత తనని తాను ప్రశ్నించుకున్నది స్పందన– మరొకరికి సలహాలు చెప్పేటంత పెద్దదయిందా తను అని– ఆ ఆలోచన రాగానే తడబడుతూ మాటలాపేసింది.

ఇద్దరూ లోపల కాలుపెడుతుండగానే ఫోను గణగణా మ్రోగింది. అది హైద్రాబాద్ నుంచేమోనని ఇబ్బందిగా దానివంక చూస్తూ రిసీవరెత్తింది.

"నేను గుప్తాను మాట్లాడుతున్నానమ్మా!"

"నమస్కారమండీ... బాగున్నారా?"

"బాగున్నాం అమ్మా... స్కూలు ఆవరణలో కళావేదిక కట్టాలని అమ్మ ఉన్నప్పుడు అనుకున్నాం... అమ్మ ఉన్నట్లయితే ఈపాటికి దాని పనులు మొదలయివుండేవి... సరే! దేనికయినా ఆరోజు రావాలిగదా... వీలయినంత తొందరలో మొదలుపెడదాం అనుకుంటున్నానమ్మా!"

"నాకూ ఒక ఆలోచన వచ్చిందండి... అమ్మ ఆ స్కూలు కోసరం ఎంత కష్టపడిందీ మీకు తెలిసిందే... ఆ ప్రాంగణంలోనే అమ్మ పేరున ఓ ధ్యానమందిరం కట్టాలని నా మనస్సులో వున్నది... దానికి కొంత స్థలం వదిలి, ఆటస్థలానికి అవరోధం కలగకుండా మీరు కట్టించే కళావేదికకు ప్లాను గీయించాలి!" అన్నది స్పందన.

ఆయన ఆలోచిస్తున్నాడన్నట్లుగా కొద్దిక్షణాల నిశ్శబ్దమేర్పడింది.

"అయితే ఒక పని చేద్దాం!... నా భార్య పేరున ముందు అనుకున్నట్లుగానే విశాలంగా కళావేదిక కట్టిద్దాం... ఏ సభ జరిగినా ఆహూతులకు ఇబ్బంది లేకుండా అన్ని హంగులతో... అందులోనే ముందు భాగం మేడమీద ఓ మినీ హాలు వచ్చేలా నేనే కట్టిస్తాను... దాన్ని అమ్మ పేరున ధ్యానమందిరం చేద్దాం!"

"హాలును వివాహాలకివ్వాలనే ఆలోచనేం లేదుగదా.... పక్కన స్కూలుకు ఇబ్బందవుతుంది!"

"లేదమ్మా... అలాంటిదేం లేదు... మరీ మనకు కావాల్సినవాళ్ళు ఎవరైనా బలవంతం చేసినా స్కూలుకు శెలవలయితేనే అంగీకరిద్దాం... నాకయితే సాహిత్య, కళారంగాలలో జరిగే సభలకే ఇవ్వాలని... అటు రాజకీయ పార్టీలకూ వద్దు... ఏ కార్యక్రమం జరిగినా హాలు ఔన్నత్యాన్ని కాపాడేలా వుండాలి... కొద్ది రుసుం దాని నెలసరి ఖర్చులకు సరిపడేలా వసూలు చేద్దాం!"

"మంచిదండీ!"

ఫోను పెట్టేసింది స్పందన. ఎదురుగ్గా కూర్చున్న మూర్తితో ఆ వివరాలన్నీ

చెప్పినప్పుడు అతనూ సుముఖంగానే స్పందించాడు. "మరే ఆలోచనా వద్దు... కావాల్సినంత స్థలమున్నది... ఆయన్ను కట్టించేయమనండి... మీరు అనుకున్న ధ్యానమందిరమూ వస్తున్నప్పుడు ఇంకా ఆలోచించేదేమున్నది?" అన్నాడు.

తరువాత పావు గంటకు తన కోసరం వండుకున్నది క్యారియర్‌లో పెట్టి అతడి చేతికిస్తూ, "ఇది మీకూ మీ అమ్మగారికి... మాణిక్యాన్ని పంపిస్తే భోజనం చేసి వస్తుంది!" అని చెప్పింది.

అతడు గడప దాటాడు. స్పందన అతడి వెనుకే గేటుదాకా వచ్చింది.

"అమ్మ చాదస్తురాలు... మీకు తెలిసిందేకదా... పెళ్ళి చేసుకొని నేను మనశ్శాంతి పోగొట్టుకోదలుచుకోలేదు!"

అధాట్టుగా తలెత్తి అతడి ముఖంలోకి చూచింది స్పందన.

"ఎందుకు అనుకుంటున్నారు అలా అని!"

"అత్తా కోడళ్ళు వీధిన పడితే నేను ఎక్కడ తల దాచుకోవాలో అర్థంగాక!" మళ్ళా నవ్వబోయాడు.

"వద్దు... నవ్వవద్దు!" అన్నది స్పందన కఠినంగా. "సమస్య ఎంతటిదైనా సకాలంలో చర్య తీసుకుంటే ఏ హానీ జరగదని మీరే నాకు చాలాసార్లు చెప్పారు!"

"నా భయాన్ని నేను చెబుతున్నాను!"

"ఈ ప్రపంచంలో పిల్లలకు పెళ్ళి కాకపోతే ఎక్కువగా ఏడ్చేది ఒక్క తల్లే!"

"అంటే నా అనుమానం నిజమేనన్నమాట!" అన్నాడు, ఈసారి నవ్వు ఆపుకోకుండానే.

"అమె కోరికలో అసంబద్ధత ఏమీ లేదుగదా!"

"మరి మీరెందుకు పెళ్ళి చేసుకోలేదు!"

"నేను చేసుకోకపోతే అలా ఏడ్చేవాళ్ళు లేరుగనుక!" స్పందనా తేలిగ్గా నవ్వేసింది.

అతడు ముఖాన్ని వెనక్కు తిప్పి, తీక్షణంగా ఆమె మొహంలోకి చూశాడు. "ఓకే... మా అమ్మ ఉద్దేశ్యంలాగానే, మీ ఉద్దేశ్యమూ నేను వెంటనే వివాహం చేసుకోవాలనేదే అయితే... మీరన్నట్లుగా మంచి మనసున్న అమ్మాయి ఎవరైనా మీ దృష్టిలో వుంటే చెప్పండి... ఒక్కటి గుర్తుంచుకోండి... ఆ అమ్మాయికి మీకున్నంత మంచి మనస్సు ఉండాలి... తప్పకుండా మూడుముళ్ళూ వెంటనే వేసేస్తాను!" అంటూనే ఇక అక్కడ ఉండకుండా, ముఖాన్ని ముందుకు తిప్పుకుని, చరచరా నడుచుకుంటూ ఆ చీకటిలో కలిసిపోయాడు.

అతడి మాటలకు నిర్విర్ణురాలైంది స్పందన. బిగుసుకుపోయి అక్కడే అతడు వెళ్ళిన వైపుకే చూస్తూ, చాలాసేపు నిలబడిపోయింది!

* * *

ఆదివారం ఉదయం ఏడుగంటలకు హైద్రాబాద్ వెళ్ళే బస్సు ఎక్కింది స్పందన. సోమవారంనుంచి వారం రోజులపాటు స్కూలుకు క్రిస్మస్ శెలవలు.

శనివారం సాయంత్రం జగన్నాథం మళ్ళా కూతురుకు ఫోనుచేశాడు.

"రేపు పొద్దున బయల్దేరుతున్నావుగదా..." అంటూ. "నువ్వు హైద్రాబాద్ రావటం ఇది మొదటిసారనుకుంటాను... కర్నూలు రాగానే నాకు ఫోను చేసి బస్సు నెంబరు చెప్పు.... అక్కడనుంచి సరిగ్గా ఐదు గంటల ప్రయాణం... ప్రతాప్ బస్టాండుకు వస్తాడు!"

తను ఇబ్బందిగా చూసింది ఫోనువంక. ప్రతిదానికీ వాళ్ళు ప్రతాప్‌ను ముందుకు తీసుకు వస్తున్నారు– తను రావచ్చుగదా!

"అడ్రసు చెప్పండి... నేను ఆటోలో వచ్చేస్తాను!"

"చాలా కష్టమమ్మా ఇల్లు పట్టుకోవటం... వాడు వస్తాడు గదా!"

"సరేలేండి!" అన్నది ఇక అ విషయం సాగదీయటం ఇష్టం లేదన్నట్లుగా.

వెంటనే మూర్తిని పిలిపించి విషయం చెప్పి, స్కూలుని, ఇంటిని తను లేనప్పుడు కనిపెట్టుకుని ఉండమన్నది. పెద్దది మాణిక్యం ఉండటంతో కల్యాణికీ భయంలేదు.

బయల్దేరేముందు అమ్మ ఫొటోకు, లక్ష్మమ్మ అవ్వ ఫొటోకు నమస్కరించి చెప్పులేసుకున్నది. కాళ్ళు కొద్దిగా తడబడ్డాయి బయటకు వస్తుంటే.

బస్సు దగ్గరకు మూర్తి వచ్చాడు. హైటెక్ బస్సు. హాయిగా వున్నది. ఊరు దాటగానే బస్సులో సినిమా మొదలు పెట్టారు.

బస్సు ఎక్కబోయేముందు మూర్తితో చెప్పింది తను. “నాలుగు రోజుల్లో వచ్చేద్దామని ఆలోచన... రానిస్తారో లేదోనని భయంగా వున్నది... ఏదైనా నాకు అక్కడ ఇబ్బందిగా వుంటే ఇంటికి ఫోను చేస్తాను... మాణిక్యం వచ్చి మీకు చెబుతుంది... మీరు జగన్నాథంగారికి, నేను వెంటనే ఇక్కడకు రావాలంటూ... ఏదో కారణం సృష్టించి, ఫోను చేసి చెప్పండి!”

“ఎందుకు భయపడతారు అలా?” అన్నాడు ఆయన నవ్వుతూ.

“వాళ్ళందరితో నాకు కొన్ని గంటలే పరిచయం... వాళ్ళ హడావుడేమిటో నాకు అర్థం కావటం లేదు– ఇన్నాళ్ళూ లేని ఆపేక్ష ఇంత అకస్మాత్తుగా నామీద ఎందుకు పుట్టుకు వచ్చిందా అని... అది నిజమో కాదో నేను ఇప్పుడప్పుడే చెప్పలేనుగాని... నా అనుమానాలు నాకున్నయి... అమ్మ పోయిందని తెలిసే వాళ్ళు ఏవో ఎత్తులు వేస్తున్నారనుకుంటున్నాను... ఆమె ఉంటే ఇంత చొరవ తీసుకుండే వాళ్ళు కాదు!”

“ఏం ఫరవాలేదు...వాళ్ళల్లో ఏ ఉద్దేశ్యాలున్నా అది మీ తండ్రి ఇల్లు... మీకు అక్కడికి వెళ్లే అధికారమున్నది... ఇక వాళ్ళ ప్రవర్తనంటారా... బాగుంటే మరోసారి వెళతారు... లేదా ఒక్కసారితోటే రాంరాం చెప్పేస్తారు!” అని ధైర్యం చెప్పి, “ఓకే. మీకు ఏ మాత్రం అక్కడ ఇబ్బంది కలిగినా మీరన్నట్లే ఫోను చేయండి... తరువాత సంగతి నేను చూస్తాను!” అన్నాడు.

తను బస్సు ఎక్కింది ఆ ధైర్యంతోటే.

గుంటల బాటలో బస్సు కుదుపులు శరీరాన్నే కాదు మనస్సునూ కుదిపేస్తాయి.

స్పందనకు ఉన్నట్లుండి ఓ అనుమానం వచ్చింది. 'ప్రతాప్ ఆమె తమ్ముడు... వ్యాపారంలో బావగారికి సాయంగా వున్నాడు... తను ఆయనకు స్వంత కూతురు... తనని అతడికి కట్టబెడితే... అటు వ్యాపారంలో బావమరిది సాయమూ వుంటుంది, ఇటు ఆస్తీ మరొకరికి పోదు.... ఆపైన వయస్సు దాటుతున్న వాళ్ళకు చేదోడు వాదోడుగా ఇద్దరం వుంటాం– అందునా ఇద్దరం కావాల్సిన వాళ్ళమే కాబట్టి ఏ గొడవా వుండదు– అనే ఆలోచనతో గాని, తనను దగ్గరకు తీసుకోవాలని ప్రయత్నించటం లేదుగదా!'

ఆమాట అనుకోవటం ఆలస్యం, ఒళ్ళంతా చెమటలు పట్టసాగింది. ఏదో భయంకరమైన వలలో ఇరుక్కు పోతున్నట్లుగా కలవరపడసాగింది...

– అందుకే అతడు స్కూలు అమ్ముతున్నట్లుగా మూర్తిగారితో చెప్పాడేమో... ఇక్కడవన్నీ అమ్మేసి, తనను శాశ్వతంగా వాళ్ళతో ఉంచుకోవాలనేది ఉద్దేశ్యమేమో?...

ఆమెకు నచ్చనట్లుగా 'నో...నో...' అన్నది పెద్దగా.

సినిమాలో మునిగి తేలుతున్న తోటి ప్రయాణీకురాలు తలతిప్పి వింతగా స్పందన వంక ఒకసారి చూసింది ఆ మాట వింటూనే.

స్పందన సిగ్గుపడుతున్నట్లుగా తల వాల్చుకున్నది– పక్కామె ముఖం తిప్పుకొని, మళ్ళా సినిమాలో లీనమైపోయింది.

తన తల్లి ఆ కుటుంబంలో ఏం సుఖం అనుభవించిందని... తను వెళ్ళి ఆ కొంపలో పడాలి?

ఆమె తరువాత ఇక్కడకు వచ్చి రెక్కలు ముక్కలు చేసుకుని, తాతయ్య సాయంతో, ఈ స్కూలు కొనుక్కొని, అభివృద్ధి చేయటమేగాకుండా తనకూ, స్కూలుకు గూడా ఈ ఊళ్ళో మంచి పేరు తెచ్చుకున్నది... అటువంటి స్కూలును అమ్మి ఆమెకు అన్యాయం

చేసి, వాళ్ళ కోరికలను తీర్చేటందుకు గాను తను ఆ యింట్లో కాలు పెట్టాలా?

నాన్సెన్స్!

అసలు తను పొరుగూళ్ళకు వెళ్ళటమే తక్కువ. తన ఊరుగాక, కర్నూలులో వుండి బిఇడి చేసింది- అప్పుడు తాతయ్యగారింట్లో తన స్వంతిల్లే అన్నట్లుగా ఉంటూ.

గతుకుల రోడ్డు మీద బస్సు ఎగిరెగిరి పడుతోంది ఆమె ఆలోచనలలాగానే.

ప్రతాప్ కళ్ళముందు కదిలాడు. ఎందుకో అతడి మాటలు, చేష్టలు తనకు మొదటినుంచి వెకిలిగానే ఉన్నట్లనిపిస్తోంది. ఇన్ని సంవత్సరాల పరిచయమున్న మూర్తిగారే తనను గౌరవంగా సంభోదిస్తారు. అటువంటిది మొదటిసారిగా చూచిన మూడు గంటల్లోనే తనను ఏకవచనంలో సంభోదించాడూ అంటే- అతడి స్థాయి ఏమిటో అప్పుడే అర్థమయింది.

మనిషికి విలువ ఇవ్వాలన్నా, హీనపరచాలన్నా అతడి ప్రవర్తనా, మాటలాడే తీరూ కారణమవుతాయి. దాన్ని పునాదిగా చేసుకునే ఆ మనిషి వ్యక్తిత్వాన్ని అంచనా వేయవచ్చు!

అతడికి తగ్గదే ఆ అక్కగూడా... అతడి మాటలకు సమానంగా ఆమె ఠీవి, దర్పం!

ఆమె తన ఆలోచనలలో మునిగి తేలుతుండగానే బస్సు ఎమ్మిగనూరు దాటింది. కోడుమూరు దాటింది.

బస్సులో ప్రయాణీకులంతా లీనమై చూస్తున్న ఆ సినిమా వంక తలెత్తి చూసింది.

- ఏదో అర్థంకాని పాట... బెత్తెడు బెత్తెడు గుడ్డల్లో హీరోయిన్ వెనకాలే ఎగురుతున్న పాతికమంది ఆడపిల్లలు... ఆ పాట అవుతుండగానే ఎవరు ఎవర్ని కొడుతున్నారో గూడా అర్థం కానంతగా ఫైటింగ్... వాళ్ళ ముఖాలమీద నుంచి చివ్వున లేస్తున్న నెత్తురు...

తలవంచుకున్నది చూడలేనట్లుగా ఆ దృశ్యాన్ని. చేతిసంచీ తెరిచి ఆ నెల చందమామ బయటకు తీసింది.

అందులో ఏ కథైనా సహజమా, అసహజమా అనే ఆలోచనే రానీయకుండా త్వరత్వరగా చదివిస్తూ, మంచి మాటలు చెప్పే ముగింపుతో వుంటుంది. వాటిని తలెత్తకుండా చదువుతూ పేజీలు తిప్పసాగింది స్పందన. అందరినీ మరిచిపోయింది. తనలోని ఆలోచనలనూ, భయాలనూ ఎక్కడికో తోసివేసింది. పూర్తిగా ఆ కథల్లోనే లీనమైపోయింది.

డ్రైవర్ పెద్దగా చెబుతున్నాడు "లంచ్ తీసుకుండే వాళ్ళు తీసుకోండి... ఇక్కడ పావుగంట ఆగుతుంది బస్సు!" అంటూ.

చటుక్కున తలెత్తింది స్పందన.

తను అప్పుడే కర్నూలు వచ్చేసింది. చేతి గడియారం వంక చూస్తే పన్నెండు గంటలపైన ముప్పయి నిముషాలయింది.

పక్కన కూర్చున్న ఆమెకు పైనున్న తన పెట్టె చూపించి, "ఇప్పుడే ఫోను చేసి వస్తాను... కాస్త పెట్టె చూస్తుండండి!" అని చెప్పి బస్సు దిగింది.

ఎదురుగ్గా వున్న ఎస్టీడీ బూత్‌లోకి వెళ్ళి తండ్రి నంబర్‌కు డయల్ చేసింది.

ఎత్తింది ఆమె తండ్రే!

"నేను స్పందననండి!"

"నీ మాట కోసరమే నేను ఉదయంనుంచీ ఫోనుదగ్గరే కూర్చున్నానమ్మా... ఎక్కడనుంచి చేస్తున్నావ్?"

"కర్నూలు నుంచండీ!"

"బాగున్నదమ్మా... ఇంకో ఐదు గంటల్లో ఇక్కడకు వచ్చేస్తున్నావన్నమాట... మన ఇల్లు నీకు స్వాగతం చెప్పేటందుకు ఎదురు చూస్తున్నది... ఈరోజు ఎంతో

సుదినం!... సెల్‌నుంచేనా మాట్లాడుతున్నది?"

"కాదండి... డిపోలోవున్న ఎస్‌టీడీ బూత్‌నుంచి చేస్తున్నాను!"

"బస్సులో నీ పెట్టె సంగతి ఎవరికైనా చెప్పి వచ్చావా?" ఆదుర్దాగా అడిగాడు.

"చెప్పానండి... ఫరవాలేదు!"

"బస్సు నెంబరు చెప్పు!"

చెప్పి ఫోను పెట్టేసి బస్సెక్కి కూర్చున్నది స్పందన.

అయిదుగంటల నలభై అయిదు నిముషాలకు ఆ బస్సు హైద్రాబాద్ బస్టాండులో ఆగింది. దిగేటందుకు పెట్టెను పట్టుకుని తలుపు దగ్గరకు వచ్చేటప్పటికి, ఎదురుగ్గా ప్రతాప్, చేతిలో హెల్మెట్‌తో నవ్వుతూ, ఆహ్వానిస్తున్నట్లుగా చేయిజాచాడు, "హాయ్... స్పందనా!" అంటూ.

ఆమెకు అర్థమయింది అతడు చేయి జాచటంలోని ఉద్దేశ్యం– తనతో చేయి కలపాలనేది అతడి కోరిక!

వెంటనే దానికి అవకాశమివ్వకుండా చేతిలోని పెట్టెను అందించింది స్పందన.

అతడు ఇబ్బందిగానే అందుకొని వెనక్కు తిరిగాడు.

ఇద్దరూ బయటకు వచ్చారు.

"ఇక్కడే వుండు... స్కూటర్ స్టాండ్‌లో వున్నది... తీసుకు వస్తాను!" అంటూ చేతిలోని సూట్‌కేస్‌ను ఆమె పక్కగా పెట్టి, వడివడిగా స్టాండ్ వైపుకు వెళ్ళాడు.

– అంటే తననిప్పుడు స్కూటర్ ఎక్కమంటాడా?

అయోమయంగా చూచింది అతడు వెళుతున్న వైపుకు.

అతడు అయిదు నిముషాలల్లోనే స్కూటర్ తీసుకు వచ్చి, ఆమె ముందు ఆపి, "ఎక్కు!" అన్నాడు.

"నేను ఆటోలో వస్తాను!" అన్నది బిడియపడుతున్నట్లుగా స్పందన.

"స్కూటరుండగా ఆటో దేనికి... అదో దండగ... ఎక్కెక్కు!" అన్నాడు హడావుడి చేస్తూ ప్రతాప్.

"నేనింతవరకూ ఎప్పుడూ స్కూటర్ ఎక్కలేదండి!" అన్నది చికాగ్గా.

"బీఈడీ చదివావ్... స్కూటర్ ఎక్కలేదంటే ఎలా?... అన్నీ నేర్చుకోవాలి!" అంటూ పెట్టె అందుకుని కాళ్ళ దగ్గర పెట్టుకున్నాడు.

ఆమె ఇక తప్పదన్నట్లుగా, అసహనంగా ఎక్కి కూర్చున్నది వెనుక సీటు మీద.

"జాగ్రత్త! హైద్రాబాద్ అంటే– జనాన్ని చీల్చుకుంటూ పోవాలి... నన్ను పట్టుకు కూర్చో... అసలే కొత్త అంటున్నావ్!" అన్నాడు నవ్వుతూ. "మా బావకు చెబుతునే ఉన్నా... జీవితాన్ని అనుభవించు... ఓ కారు కొన్నావంటే హాయిగా వుంటుంది అని... ఆయన భయం ఆయన్ది... కారంటూ వుంటే నేను ఆయనకు కనబడనని... డబ్బు తగలేస్తూ పెట్రోలంతా త్రాగేస్తానని... ఆయనకు నేను అర్థం కాను... ఆయన ఒక్కడే ఈ ప్రపంచంలో జాగ్రత్తమంతుడు అనుకుంటాడు... నాకూ డబ్బు విలువు తెలుసు... అనవసరంగా ఒక్క పైసా ఖర్చుపెట్టను... డబ్బు పెట్టుకొని సుఖపడకుండా మూటగట్టి, పోయేటప్పుడు వెంట తీసుకుపోతామా?"

రోడ్డు మీద కార్లను, స్కూటర్లను, ఆటోలను, రకరకాల వాహనాలనూ దాటుకుంటూ– నల్లగుంటలో వున్న ఇంటిముందు ఆగేటప్పటికి పావుగంట పట్టింది. అంతసేపూ ఆమె వెనుక వున్న స్టెప్నీని పట్టుకొని బిగదీసుకు కూర్చున్నది.

స్కూటర్ ఆగుతుండగానే దూకుతున్నట్లుగా దిగింది స్పందన.

లోపలనుంచి వసుంధర, జగన్నాథం, ఇంకో ముగ్గురు ఆడవాళ్ళు బయటకు వచ్చారు.

వసుంధర అయితే స్పందన భుజం మీద చేయివేసల్లా దగ్గరకు తీసుకున్నది.

జగన్నాథం కూతురు చేయిపట్టుకుని, "రా అమ్మా!" అన్నాడు ఆప్యాయంగా.

క్షణం ఆయన వంక చూస్తే, ఆనందంతో ఆయన కళ్ళు తడుస్తున్నట్లే అనిపించగా ఆమెకూ కళ్ళు చెమ్మగిల్లసాగినయ్.

"ప్రయాణం బాగా జరిగిందా అమ్మా?" జగన్నాథం అడిగాడు.

తలూపింది– బాగానే జరిగిందన్నట్లుగా.

లోపలకు వెళ్ళిం తరువాత, అక్కడున్న ఆడవాళ్ళకు, "మా అమ్మాయి! స్పందన!" అంటూ పరిచయం చేసింది వసుంధర.

నమస్కారం పెట్టింది స్పందన.

వాళ్ళను ఒక్కొక్కళ్ళనే పేరుపేరునా పరిచయంచేసింది...ఇద్దరు పక్కింటివాళ్ళు ... ఒకామె ఆ యింట్లోనే మేడ మీద అద్దెకున్నామె.

"పదమ్మా! నీ గదిలోకి వెళ్ళు... స్నానం చేస్తే హాయిగా వుంటుంది... ముందు కాఫీ కలుపుకు వస్తాను!"

అక్కడున్న ఆడవాళ్ళు వెళ్ళిపోయారు అయిదు నిముషాలు మాట్లాడి, "మళ్ళా వస్తాం!" అంటూ.

జగన్నాథం స్పందన ఎదురుగ్గా కూర్చున్నాడు.

"నా కూతురు ఈ ఇంట తిరుగుతుంటే ఇక నాకు కావాల్సిందేమున్నదమ్మా... అంతకు మించిన ఆనందం ఇంకొకటేమున్నది... మీ పిన్ని ఎంత సంబరపడిపోతున్నదో చూశావుగదా!"

ఇల్లు పెద్దది. రెండంతస్తుల మేడ... పెద్ద హాలు... లోపల ఇంకెన్ని గదులున్నయ్యో తెలియదు... అన్నీ విలువైన సామాన్లు... అందునా చిన్నపిల్లలు లేకపోవటంతో చాలా శుభ్రంగా వున్నది.

– అమ్మ ఎప్పుడూ అంటుంటుంది... ఇల్లు చూచి ఇల్లాలిని చూడాలని!

వసుంధర వంటయింట్లోకి వెళ్ళి కాఫీ తెచ్చి ఇచ్చింది.

ప్రతాప్ తన గదిలోకి వెళ్ళి, ముఖం కడుక్కుని, లాల్చీ పైజమా వేసుకుని, నీటుగా తయారయి వచ్చి వాళ్ళ ఎదురుగ్గా కూర్చున్నాడు.

"స్పందనా! ఈ వారం ప్రోగ్రాం అంతా నీది... బావగారికి, ఆయన వ్యాపారానికి, నేనీవారం కనబడనని చెప్పేశాను.... నువ్వు ఎక్కడకు వెళ్దామంటే అక్కడకు నేను రెడీ... స్కూటర్ ట్యాంక్‌నిండా పెట్రోలు నింపేశాను... స్కూటర్ ఇబ్బందీ అనుకుంటే టాక్సీ ఎంగేజ్ చేద్దాం!" అన్నాడు ప్రతాప్.

"అరేయ్ తమ్ముడూ!... ఇవ్వాళ ఎలాగూ అయిపోయింది... రేపు మనవాళ్ళందరినీ లంచ్‌కి రమ్మనమన్నాం... ఆయన స్నేహితులు కూడా కొంతమంది వస్తున్నారు... మధ్యాహ్నం భోజనాలయ్యేటంతవరకూ... వచ్చిన వాళ్ళకు మర్యాదలు చేయటం, వాళ్ళకు అమ్మాయిని పరిచయం చేయటం... నీదీ, మీబావగారి డ్యూటీ!" అన్నది నవ్వుతూ.

"సాయంత్రం ఖాళీయేగదా అక్కా!"

"అంతగా అయితే మొదటాట సినిమాకు వెళ్ళండి!" వసుంధర ఆమాట చెబుతూ వంటింట్లోకి వెళ్ళిపోయింది.

హాల్లో షోకేసులో వున్న వింతవింత విలువైన బొమ్మల్ని చూస్తున్న స్పందన ఆమె మాటలు వింటూనే ఉలిక్కిపడ్డట్లుగా తలెత్తి, ఇబ్బందిగా చూస్తూ, ఖాళీ కప్పును వంటింట్లో సింక్‌లో పడేసి, తన గదిలోకి వెళ్ళిపోయింది.

పెట్టెను మంచంమీద పెట్టి, మాక్సీని, టర్కీటవల్‌ని తీసుకుని ఆ గది తలుపుకు లోపల ఘడియవేసింది.

లోపల డ్రస్సింగ్ టేబుల్ అద్దం ముందు దువ్వెన, కాటుక, పౌడర్ డబ్బా... నాలుగు రకాల లిప్‌స్టిక్స్...

తల దువ్వుకొని, స్నానం చేసి వచ్చి, మాక్సీ వేసుకుని, అద్దంలో చూసుకుంటూ

పౌడర్ రాసుకున్నది.

– ప్రతాప్ అంటూ అక్కడ లేకపోతే తనకు ఆ ఇల్లు ఆనందించ దగ్గ ప్రదేశమే అనిపించింది. అతడు తీసుకుంటున్న అతి చొరవ ఆమెకు ఇబ్బంది కలిగిస్తోంది.

తను ఈ వారం రోజులూ అతడితో స్కూటర్ మీద తిరగాలని అతడి కోరిక– అతడేమనుకుంటున్నాడో తన గురించి... అడగగానే తను హుషారుగా ఎక్కడికిపడితే అక్కడికి ఆయనగారి చేతులు పట్టుకుని తిరుగుతానని అనుకుంటున్నాడా?... ఆడపిల్లలంటే అంత లోకువగా వున్నదా?

తను వుండే ఈ కొద్ది సమయంలోనే అతడు తన దగ్గర ఎలా మెలగాలో నేర్పాలి!

అతడిలో పిల్లచేష్టలు బాగా వున్నాయి.

తలుపు తీసుకుని బయటకు వచ్చేటప్పటికి, ఎదురుగా సోఫాలో కూర్చొని వున్న తండ్రి, "రా అమ్మా!" అన్నాడు.

స్పందన వెళ్ళి ఆయన ఎదురుగ్గా సోఫాలో కూర్చున్నది.

"అక్కడ కాదమ్మా, ఇక్కడ!" తన పక్కన చోటు చూపిస్తూ అన్నాడు ఆయన.

వెళ్ళి ఆయన కూర్చున్న సోఫాలోనే కాస్త దూరంగా కూర్చున్నది. ఎంత తండ్రయినా ఆయనకు దగ్గరగా కూర్చోలేకపోయింది. ఇరవైయేడు సంవత్సరాలు దూరంగా వున్న ఆయన ఒకటి రెండు రోజుల్లోనే దగ్గరవాడవుతాడని తను అనుకోలేదు.

"ఇదుగోనమ్మా! ఈ సెల్ దగ్గర ఉంచుకో... నువ్వు కర్నూలు బస్టాండులో ఫోను చేయటానికి దిగావంటేనే భయమేసింది... ఇది దగ్గరుంటే నువ్వెక్కడున్నా కదలకుండా ఎవ్వరితోనైనా మాట్లాడవచ్చు!"

"ఎందుకండీ... ఇంట్లో ఫోను వున్నది... స్కూల్లో వున్నది... నేనెవరికి చేస్తాను!"

"ఆ రెండు చోట్లా నువ్వు లేనప్పుడు... ఇది నీ చేతిలో వుంటే నీకు కావాల్సిన

వాళ్ళంతా నీ దగ్గర వున్నట్లే అనిపిస్తుంది!"

"డబ్బు దండగ! బయటకు వెళితే అడుగడుగునా రూపాయి ఫోను వుండనే వున్నది!"

"నేనిప్పుడు దీన్ని నీకోసరం కొనలేదమ్మా!... నా దగ్గర రెండున్నయి... అందుకే నీకొకటి ఇస్తున్నది! నువ్వు ఇక్కడకు వచ్చినప్పుడు నీకు ప్రత్యేకంగా కారే కొంటాను!" అన్నాడు ఆప్యాయంగా దాన్ని ఆమె చేతిలో పెడుతూ.

ఇబ్బందిగా తీసుకుని, దాని వంకే చూస్తూ కూర్చున్నది ఆయన మాటలను మననం చేసుకుంటూ స్పందన– ఆయన తన ఉద్దేశ్యాన్ని చాలా స్పష్టంగా చెబుతున్నాడు– తను శాశ్వతంగా ఇక్కడకు వచ్చేయాలని!

తనకు అమ్మలేదు... అమ్మకు ప్రియమైన ఆ స్కూలును కూడా దూరం చేయాలనా వీళ్ళ అందరి ఉద్దేశ్యం?

ఆయన మాటలను జీర్ణించుకోలేకపోతున్నది.

"మళ్ళా శనివారం దాకా శెలవలు ఉన్నాయి కదా?"

"అవునండీ... కానీ నేను రెండు మూడు రోజులకంటే ఎక్కువ ఉండలేను ఇక్కడ... నిన్నటితో ఆఫ్ ఇయర్లీ పరీక్షలు అయిపోయినయి... ఆన్సర్ పేపర్లన్నీ, స్కూలు తెరిచేటప్పటికి దిద్దటం అయ్యేలా చూడాలి... స్కూలు తెరిచిన రోజే పేపర్లు ఇవ్వటం మాకు అలవాటు... పిల్లలు గూడా వాటికోసరం ఆసక్తిగా ఎదురు చూస్తుంటారు!" అన్నది. ముందుగానే కాళ్ళకు బంధం వేయకపోతే– తను ఉన్నట్లుండి వెళ్తానని చెప్పటానికి గూడా ఇబ్బందిగానే వుంటుంది.

"అలా కాదమ్మా!... నీ ఇంటికి నువ్వు మొదటి సారిగా వచ్చావ్... ఈ వారం రోజులూ నా ఎదుట వుంటే నాకు తృప్తిగా వుంటుంది!" అన్నాడు అనునయంగా ఆయన కూతురు చేతిని పట్టుకుంటూ.

స్పందన, ఆయన అంత ఆప్యాయంగా అడుగుతుంటే, గతమంతా ఆమె

మదిలోనుంచి అదృశ్యమవ్వగా, తన్మయంగా ఆయన వంకే చూచింది.

"కులాసాగా జేరానని ఇంటికి ఫోను చెయ్యమ్మా!"

ఆమె మరో మాట మాట్లాడకుండా ఇంటికి ఫోను చేసింది. అక్కడ ఎత్తింది కల్యాణి.

"కల్యాణీ! అక్కనమ్మా... హైద్రాబాద్ కులాసాగా జేరాను... మాణిక్యానికి గూడా చెప్పు... మీకేమైనా అవసరముంటే మూర్తిగారు వచ్చినప్పుడు చెప్పండి... ఉంటాను మరి– జాగ్రత్త!" కావాలనే 'అక్క' అనే మాటను ఒత్తి పలుకుతూ అన్నది స్పందన.

"అలాగే అక్కా! నువ్వు తొందరగా వచ్చేస్తావు కదా!"

"అలాగేనమ్మా!"

ఫోన్ ఆఫ్ చేస్తూనే, "పిచ్చిపిల్ల... నేను లేకుండా అది ఒక్కరోజు కూడా వంటరిగా వుండలేదు!" అన్నది నవ్వుతూ స్పందన. "నన్ను త్వరగా వచ్చేయమంటోంది!"

* * *

ఎనిమిది గంటలయింది. ప్రతాప్ బయటకు వెళ్ళాడు.

వసుంధర వచ్చి స్పందన పక్కన కూర్చుంటూనే, మెళ్ళోనుంచి రెండు పేటల చంద్రహారం తీసి స్పందన మెళ్ళో వేయబోయింది.

"వద్దండీ... వద్దండీ!" అంటూ పక్కకు జరిగింది స్పందన.

"అలా అనగూడదు నేను ఇస్తున్నప్పుడు... ఈ క్షణంనుంచీ ఈ యింటికి నిన్ను చూచేటందుకు ఎంతోమంది వస్తుంటారు... వాళ్ళముందు మా అమ్మాయి, ఏమీ లేనిదానిలా, మెడలో ఓ సన్నటి వంటిపేట గొలుసుతో ఉండటం నాకు బాధ కలిగిస్తుంది... ఈ ఇంటికి అధికారిణివి నువ్వు... ఇవన్నీ నీవి కావా... అంతగా మీ ఊరుకు తీసుకు వెళ్ళటం నీకిష్టంలేకపోతే నీ గదిలో బీరువాలో పెట్టి వెళ్ళు... వచ్చిన

ప్రతిసారీ ఆ పెట్టెడు గుడ్డలూ వేసుకు రావద్దు... వాటిని ఇక్కడే వుండనీయ్... ఇంకా ఏమైనా కావాలనుకుంటే నాన్ననడిగి కొని తెప్పించుకో... చేతులు ఊపుకుంటూ రావటం... చేతులు ఊపుకుంటూ వెళ్ళటం... కనీసం నెలకు రెండు సార్లయినా నువ్వు ఈ ఇంట్లో మాతోపాటు గడపాలి!" అన్నది ఆమె స్పందనను దగ్గరకు తీసుకుంటూ, ఆ గొలుసును మెళ్ళో వేసి, ఆమె బారెడు జడనూ గొలుసు పైకి వేసి సర్దుతూ.

వాళ్ళ ఆదరానికి, ఆప్యాయతకీ ఒక్కొక్కసారి మనస్సు పులకరిస్తుంది... ఒక్కొక్కసారి ఇది ఎక్కడకు దారి తీస్తుందోనన్నట్లుగా భయం ఆవరించి శరీరాన్ని కుదిపి వేస్తుంది.

ప్రతాప్ వచ్చాడు. చేతిలో పెద్ద పూలపొట్లం పెట్టి వున్న కవరు... ఓ బుట్టనిండా పండ్లు...

వచ్చి ఎదురుగ్గా కూర్చుంటూ, "మోజంజాహీ మార్కెట్‌కు వెళితేనేగాని తాజా పండ్లు దొరకలేదు!" అన్నాడు. "ఇంతకీ అక్కా! రేపటి మేనూ ఏమిటో తేల్చావా... లేక వంటవాళ్ళు వచ్చిందాకా ఆలోచిస్తూ, అప్పుడు నన్ను మార్కెట్‌కు పరుగెత్తిస్తావా!" అన్నాడు నవ్వుతూ.

"నీకు ఇష్టమయిన కూరలేమిటో చెప్పమ్మా!" అడిగింది వసుంధర స్పందనను.

"నాకు అన్నీ ఇష్టమేనండి!" అన్నది మొహమాటంగా తలవంచుకుని వాళ్ళ హడావుడికి.

"అలా కాదు స్పందనా! పోనీయ్... నీకిష్టం లేనివేవో చెప్పు... అవి వదిలేసి మిగతావాటిల్లో సెలక్ట్‌చేస్తాం!"

"నాకు ఇష్టంలేనివి అంటూగూడా ఏమీ లేవు!" చిరునవ్వుతో అన్నది.

జగన్నాథం స్నానంచేసి అప్పుడే హాల్లోకి వస్తూ, "అంటే... అంతా నా పోలికేనన్నమాట... వసుంధరా! నేనెప్పుడైనా నువ్వు చేసింది ఎదైనా నాకు నచ్చలేదని

తినకుండా వదిలేశానా?" అన్నాడు గలగలా నవ్వుతూ.

* * *

తెల్లవారుజామున ఇంట్లో హడావుడి మొదలయింది.

అర్థరాత్రే మెళుకువ వచ్చింది స్పందనకు. తను కావాలనే గది తలుపుకు లోపల బోల్టు పెట్టి పడుకున్నది. గోడమీద జీరోవాల్ట్ నీలం బలుబు వెలుగుతోంది.

కళ్ళు తెరుచుకు పడుకున్న ఆమెకు తన ఊరు, తన స్కూలు, తన ఇల్లు, మాణిక్యం, కల్యాణి, మూర్తి మాస్టారు కనబడుతున్నారు.

బస్సెక్కుతుండగా, ఆయన చెప్పిన ధైర్యం, గుండెలనిండా ఊపిరిపోసుకుంటున్నది.

'నిజమే! తనకు ఇబ్బందికరంగా ఉంటే మరోసారి రాదు... దానికోసం లేనిపోని ఆదుర్దాను ఇప్పుడు నెత్తిన పులుముకోవటం దేనికి?'

ఇక్కడ తండ్రి, వసుంధరగారు కళ్ళముందు మెదులుతున్నారు.

ప్రతాప్ తనకు దగ్గరవ్వాలన్నట్లుగా ప్రయత్నిస్తున్నాడు. చూద్దాం, అతడు పిచ్చివేషాలు వేస్తే సరైన పాఠం చెప్పే శక్తి తనకున్నది...

తనకిచ్చిన గది చాలా బాగున్నది... ఇక తను ఎప్పుడు వచ్చినా ఆ గది తనకేనట... తను లేకపోతే తాళం వేసి అన్నా వుంచుతారుగాని, ఎవ్వరూ ఉపయోగించరట... అందుకే ఆమె చెప్పింది... ఇక్కడ ఉండగా వాడుకుండే గుడ్డలు ఇక్కడే వుంచేయమని!

మళ్ళా ఎప్పుడు నిద్ర పట్టిందో తెలియదు.

తెల్లవారుజామున సెల్ మ్రోగితే మెళుకువ వచ్చి, ఎవరా అంత పొద్దున ఫోను చేసింది అని చూస్తే, మ్రోగింది అలారం... ఆరుగంటలయింది...

వడివడిగా లేచి, అద్దంలో ఒకసారి చూసుకుని, ముఖాన పడుతున్న జుట్టును సరిచేసుకుంటూ, బ్రష్షూ పేస్టూ తీసుకుని, బాత్‌రూంలోకి వెళ్ళింది.

పదినిముషాలల్లోనే తలుపు తీసుకుని బయటకు వచ్చేటప్పటికి నవ్వుతూ వసుంధర ఎదురుపడింది.

"నేనే లేపుదామనుకుంటున్నాను... నీకూ, మీ నాన్నకు కాఫీ రెడీ!" అంటూ వంటయింట్లోకి వెళ్ళింది.

కాఫీ త్రాగుతుండగానే, "నీళ్ళు కాగినయ్... నువ్వు స్నానం చేసేయ్... షాంపో బాత్‌రూంలో వున్నది!" అన్నది ఆమె.

"ఇప్పుడు తలనిండా స్నానం దేనికండీ!"

"నీ ఒత్తయిన జుట్టు, తల స్నానం చేసింతరువాత, నూనె రాసుకోకుండా వుంటే మరింత ఒత్తుగా, మెరిసిపోతూ కనబడుతుంది.... చక్కగా వుంటుంది... అందునా నీ రాకతో ఈరోజు మాకు పండుగలాగానే వున్నది... నాన్న ఎనిమిదివేలు పెట్టి ఈ కొత్త చీర తెప్పించారు... అది కట్టుకోవాలి... మా యింటి మహాలక్ష్మి కళకళలాడుతూ నట్టింట తిరుగుతుంటే అంతకంటే మాకు కావాల్సిందేమున్నది!" అన్నది ఆమె ముసిముసి నవ్వులతో. ఆమె చేతిలో కనకాంబరపు రంగులో పెద్ద జరీఅంచు కంచి పట్టుచీర ఉన్న అట్టపెట్టె వున్నది.

ఇబ్బందిగా చూచింది ఆమె వంకా, ఆ చీర వంకా స్పందన.

జగన్నాథం లేచి స్పందన దగ్గరకు వచ్చి, "పెద్దది పిన్ని చెబుతున్నప్పుడు నువ్వు దేనికీ కాదూ అనగూడదు!" అన్నాడు.

స్పందన చటుక్కున లేచి నిలబడింది.

"వద్దండీ!... నేను తెచ్చుకున్న చీరల్లోనే నాకు బాగా నచ్చి, నలుగురిలో ఉన్నప్పుడు కట్టుకుంటే బాగుంటుంది అనుకున్న చీరను కట్టుకుంటాను... నాకు హాయిగానూ, తేలిగ్గానూ ఉంటుంది... ఈనాడు నేను వచ్చానని సరదాగా నలుగురినీ ఆహ్వానించారు... అప్పటికీ, మెళ్ళో మీరు వేసిన బంగారాపు గొలుసు ఉండనే వున్నది... పట్టు చీరలూ, జరీ చీరలూ నేను ఇంతవరకూ కట్టుకోలేదు... కట్టుకోవాలనీ లేదు!"

తనని వాళ్ళు అర్థంచేసుకోలేకపోతున్నందుకు ఆమెకు చాలా బాధగా వున్నది. "అది మీరు కట్టుకుంటే ఇంకా బాగుంటుంది... నేను చాలా ఆనందిస్తాను!"

"ఇలాంటివి నా అలమరనిండా చాలా వున్నయ్యమ్మా! నీకోసమని ప్రత్యేకంగా తెప్పించింది నేను కట్టుకోవటమేమిటి?" అన్నది ఆమె అసహనంగా. "పోనీయ్ కాసేపు కట్టుకొని, పూజ అయింతరువాత... మరీ బరువనిపిస్తే, విప్పేసి నువ్వు తెచ్చుకున్న చీరే కట్టుకుందువుగాని!"

చటుక్కున వంగి, ఆమె పాదాలకు నమస్కరిస్తూ, "ఇంత ఆదరంగా చూస్తున్న మిమ్మల్ని కష్టపెడుతున్నానని ఏమీ అనుకోవద్దు... దాన్ని అలావుంచండి... ఈసారి ఏదైనా పండక్కు వచ్చినప్పుడు తప్పకుండా కట్టుకుంటాను!" అన్నది.

ఆమె ఇంకేం మాట్లాడలేకపోయింది. "సరే అయితే! ఇది నీ బీరువాలోనే వుంచు!" అంటూ, ఆ పెట్టెను స్పందన చేతిలోపెట్టి అక్కడనుంచి వెళ్ళిపోయింది.

జగన్నాథమూ అప్రసన్నంగానే వెనక్కు తిరిగాడు.

స్పందనకు దుఃఖమొస్తోంది. తన గదిలోకి వెళ్ళి మంచం మీద పడుకునే, పదినిముషాల వరకూ, బయటకు శబ్దం రాకుండా కుళ్ళికుళ్ళి ఏడ్వసాగింది.

అరగంట తరువాత లేచి, తల దువ్వుకొని, జుట్టు ముడిపెట్టుకుని, తువ్వాలతీసుకొని బాత్‌రూంలోకి వెళ్ళింది. అలవాటుగా చన్నీళ్ళ స్నానమే చేసింది– ఆదోని కంటే ఇక్కడ చల్లగా వున్నా... గులాబీ రంగు చీరను కట్టుకున్నది. అదేరంగు జాకెట్టును తొడుక్కున్నది. తన పెట్టెలో వున్న ముదురు ఎరుపురంగు కుంకుమను తీసుకొని కాస్తంత పెద్దదిగా బొట్టు పెట్టుకున్నది. జుట్టు ముడివిప్పి, మరోసారి దువ్వుకుని, జడవేసుకున్నది. అంత పొడువు జడను ఒకసారి ముందుకు తీసుకు చూసుకొని, వెనక్కు వేసుకున్నది. చెంపలు దువ్వుకున్నది. పౌడర్ రాసుకున్నది. పక్కగా అట్టపెట్టలో వున్న లిప్‌స్టిక్స్ వంక ఒక్కసారి చూసి తల తిప్పుకున్నది– వాటితో తనకు పనిలేదన్నట్లుగా... తరువాత తన పెట్టె తెరిచి అవ్వ ఫొటోని డ్రెస్సింగ్ టేబుల్ మీద అద్దం క్రిందగా పెట్టి నమస్కరించి, గదిలోనుంచి బయటకు వచ్చింది.

అప్పటికే ఇంట్లో అందరూ తనకోసరమే ఎదురు చూస్తున్నట్లుగా అక్కడ సోఫాలల్లో తన గది వంకే చూస్తూ కూర్చుని ఉన్నారు.

పచ్చటి స్పందన గులాబీ రంగు చీరలో అందంగా మెరిసిపోతున్నది. ఆమెను చూస్తున్న వసుంధర కళ్ళూ తృప్తితో తళుక్కుమన్నాయి.

అందరూ లేచి డైనింగ్ టేబుల్ దగ్గరకు నడిచారు. "నాన్న తెప్పించిన చీర నీకెంతో నప్పుతుందనుకున్నాం... నువ్వు ఇప్పుడు కట్టుకున్న ఈ చీర ముందు అది అంత ఖరీదుదయినా తేలిపోయి వుండేదమ్మా... అందరూ అనే మాట నిజమే... చీర అందం కట్టుకున్న వాళ్ళను బట్టే వుంటుందని... నీ ఎన్నిక చాలా బాగున్నది!" అన్నది మెచ్చుకోలుగా.

టిఫెన్లు తిని లేస్తుండగానే పోర్టికోలో రెండో ఆటోలు వచ్చి ఆగినయి.

వసుంధర హడావుడిగా బయటకు వచ్చింది. అప్పుడు వచ్చింది ఆమె ఇద్దరు అక్కలూ, బావగార్లూ, పిల్లలు.

వాళ్ళు వస్తూనే స్పందనను చుట్టుముట్టారు.

"మా మరిది ఇంత చక్కని కూతుర్ని పెట్టుకుని ఇన్నాళ్ళూ ఎవ్వరూ తనకు లేరూ లేరూ అంటూ దిగులు పడిపోతున్నాడూ అంటే, నాకు చాలా ఆశ్చర్యంగా వున్నది!" అన్నది వసుంధర చిన్నక్క, వసుంధరలాగానే గలగలా నవ్వుతూ. స్పందన దగ్గరకు వచ్చి ఆమె చేయి పట్టుకొని దగ్గరకు తీసుకున్నది. "బంగారు బొమ్మలా వున్నావమ్మా... ఈ ఇంట్లో నువ్వు తిరుగుతుంటే వేరే దీపాలు పెట్టుకోనక్కరలేదు!"

ఆమెకు ఇద్దరు కొడుకులు. భర్తనూ, వాళ్ళిద్దరినీకూడా పరిచయం చేసింది.

పెద్దక్క ముభావంగా స్పందననే చూస్తూ వుండిపోయింది.

వసుంధర మీద ఆమె బాగా నలుపు. అరవైయ్యేళ్ళు పైనే వుంటయి. జుట్టు నెరిసింది. ఆమె భర్తగూడా  పెద్దవాడయ్యాడు. వాళ్ళకు ముగ్గురూ ఆడపిల్లలు. ఇంకా ఎవ్వరికీ పెళ్ళిళ్ళు కాలేదు.

వసుంధర ఆమెను స్పందనకు పరిచయం చేస్తే, చిరునవ్వుతో పెదవులు కదిలిస్తూ, ఎవ్వరికీ వినబడనంత చిన్నగా ఏదో గొణిగి ఊరుకున్నది.

వసుంధర గూడా ఆమెతో ఇంకేమీ మాట్లాడలేదు.

దొడ్లో షామియానా క్రింద వంటవాళ్ళు హడావుడి చేస్తున్నారు. గిన్నెల మ్రోతలు వినబడుతున్నయి... రెండు నిముషాలకొకసారి అది కావాలీ, ఇది కావాలీ అంటూ వసుంధరను పిలుస్తున్నారు.

"ఒసేయ్ శ్యామలా, వనజా! డైనింగ్ టేబుల్ మీద ఇడ్డెన్లూ, వడలూ ఉన్నయి... అందరికీ ప్లేట్లలో పెట్టి ఇచ్చి, మీరూ తినండి!" అంటూ వసుంధర ఆమె పెద్దక్క పిల్లలకు చెప్పి వంటవాళ్ళ దగ్గరకు వెళ్ళింది, పిలుస్తుంటే.

పెద్దక్క ఒకసారి చెల్లెలు వంక చూసి ముఖం తిప్పుకున్నది.

శ్యామల డైనింగ్ టేబుల్ దగ్గరకు వెళ్ళింది. "పిన్నీ సాంబారుగూడా చేయించావా?" అన్నది హుషారుగా.

"ఆఁ... మీ ఇష్టాలేమిటో నాకు తెలియదా... చేయించానమ్మా... కప్పులూ, స్పూన్లుకూడా అక్కడే ఉన్నయి చూడు!"

ప్రతాప్ వచ్చాడు. "శ్యామలా! టిఫెన్లు అందరికీ ఇవ్వటం నీ వంతు... మంచి నీళ్ళు ఇవ్వటం నా వంతు!"

అతడు సఫారీ సూట్ వేసుకున్నాడు. కళ్ళకు పెట్టుకున్న సన్నటి కళ్ళజోడు అతడి ముఖానికి మరింత అందాన్నిస్తున్నది. చేతిలో కెమేరా వున్నది.

"అది గూడా నువ్వేం చేయనక్కరలేదు... మా చెల్లెళ్ళు చూస్తారులే... వెళ్ళి మీ అక్కలనూ, బావలనూ పలకరించి మర్యాదలు చేయి... అసలు అందరినీ ఆహ్వానించిన బాబాయి ఎక్కడ... కనబడనే లేదు... ఎక్కడ దాక్కున్నాడు!" అన్నది పెద్దగా శ్యామల.

"వస్తున్నాను తల్లీ! ఇక్కడ మీ పిన్ని ఏదో ఆర్డర్ వేస్తే చేస్తున్నా... రెండు నిముషాలు!"

స్పందన అందరినీ గమనిస్తున్నది. శ్యామల చలాకీతనాన్ని చూస్తున్నది.

అందరికీ టిఫెన్లు వచ్చినయి...

శ్యామల టిఫెన్ తింటున్నదల్లా ఆగి, "మామయ్యా! ఒక్కసారి ఇలా రావాలి... నీకో రహస్యం చెప్పాలి!" అన్నది అటే వస్తున్న ప్రతాప్‌ను చూస్తూ.

"ఆగాలి... అర్జంటా... పది నిముషాలు!" అన్నాడు ఆ హాల్లో ఓ పక్కగా నిల్చొని స్పందన ఫొటో తీస్తూ.

నుదురు చిట్లించి, శ్యామల, "ఏం లేదులే... నీకు వీలున్నప్పుడే రా!" అంటూ వెళ్ళి తల్లి పక్కన కూర్చున్నది.

పదవుతుండగా ఇంటి పురోహితుడు, హరిప్రసాద్, స్కూటీ మీద వచ్చాడు. చేతిలో పెద్ద సంచీ. మెడలో వ్రేలాడుతున్న సెల్లు. వస్తూనే, "ఏంవిటి... ఏర్పాట్లు ఏం చేయకుండానే కూర్చున్నారు... కనీసం పీటకు పసుపురాసి, ఫొటో గూడా పెట్ట లేదు... నేను పన్నెండు గంటలకల్లా మరో చోటకు వెళ్ళాలని చెప్పాను గదా!" అన్నాడు హడావుడి చేస్తూ.

స్పందన వచ్చిన ఆయన వంక వింతగా చూస్తోంది– ఇప్పుడు ఈయనతో పనేమి వచ్చిందా అన్నట్లుగా.

వీళ్ళు కొన్ని సగం సగం చెబుతున్నారు... కొన్ని అసలు చెప్పటమేలేదు... తనకు అర్థం కావటంలేదు... తన రాకకేనా ఈ హడావుడంతా... లేకపోతే మనస్సులో ఇంకేదైనా ఉద్దేశ్యం పెట్టుకొని గుంభనగా కానిచ్చేస్తున్నారా?

ఆయన కంఠం వింటూనే, వసుంధర, జగన్నాథం వాళ్ళ గదిలోనుంచి బయటకు వచ్చారు. వసుంధర స్పందన దగ్గరకు వచ్చి, "ఒక్కసారి లోపలకు రా అమ్మా!" అంటూ స్పందనను తీసుకొని తన గదిలోకి వెళ్ళింది. వెనగ్గా జగన్నాథం వచ్చాడు.

"చూడమ్మా! మేం నువ్వొస్తున్నావనే ఆనందంతో ఈరోజు సత్యనారాయణ వ్రతం చేసుకుందాం అనుకున్నాం... మాతోపాటు పీటలమీద కూర్చోవటానికి నీకేం అభ్యంతరం

లేదుగదా!" అన్నది సంశయంగా స్పందన ముఖంలోకి చూస్తూ. "నేను ఎందుకు అడుగుతున్నానంటే... ఇందాక పట్టు చీర కట్టుకోమంటేనే– అంత బరువు ఎవరు మోస్తారన్నట్లుగా వద్దన్నావ్... ఇప్పుడు పూజకు కూర్చోమంటే– కనీసం రెండు గంటలన్నా కూర్చోవాలి... ఏమంటావో అని...!"

ఒక్క క్షణం కళ్లు మూసుకున్నది స్పందన. "వ్రతం అంటే నేను కాదూ అనగూడదు... అలా అనటం మంచిది కూడా కాదు... కానీ, రెండు నెలల క్రితమే అమ్మ పోయింది... అటువంటి నేను చేసుకోవచ్చా... అది తప్పుగాదా... అసలు వారు చేసుకోవచ్చా అని..." అన్నది తండ్రి వంక చూస్తూ. "బ్రహ్మగారు ఇక్కడే ఉన్నారు గదా... పిలిచి అడగండి– అలా చేయవచ్చో లేదో!" అన్నది కాస్తంత చికాగ్గా.

జగన్నాథం ముఖం కూతురు మాటలు వింటూనే తెల్లగా పాలిపోయింది. పెదవులు సన్నగా వణకటం మొదలు పెట్టినయి. శరీరంలోని నరాలన్నీ గుండెను పట్టుకు గుంజుతున్నట్లుగా కదులుతున్నయి.

"రెండు నెలల క్రితం పోయిన అమ్మ ఇంకా కళ్ళముందు మెదులుతునే వున్నది... నాకు పండగేమిటి... వ్రతాలేమిటి... పూజలేమిటి... మీరు కొత్త చీర కట్టుకోమన్నప్పుడు ఎందుకు వద్దన్నానో మీరు అర్థం చేసుకుని వుంటారనే అనుకున్నాను.... అసలు ఇప్పుడు ఇక్కడకు రావటమే నాకు ఇష్టంలేదు... పదేపదే పెద్దవాళ్ళు మీరు రమ్మనమంటుంటే కాదనలేక వచ్చాను... బాధపడతారనే ఉద్దేశ్యంతో నేనింత వరకూ ఆ విషయం నోరు తెరిచి చెప్పలేదు... చెబుదామన్నా, నేనొచ్చేటప్పటికే మీరు బంధుమిత్రులనందరినీ ఆహ్వానించి అన్ని ఏర్పాట్లూ చేసుకొని వుంటిరి...నా నోరూ, చేతులూ కట్టేస్తూ!" స్పందన చటుక్కున తన గదిలోకి వెళ్ళి మంచంమీద పడుకుండిపోయింది, మనస్సంతా కలతచెందగా.

జగన్నాథం వెళ్ళి పురోహితుడిని పిలుచుకు వచ్చాడు తన గదిలోకి. వసుంధర ఆ గది తలుపు మూసి వేసింది.

జగన్నాథానికి అప్పటిదాకా ఆ ఆలోచన రాలేదు. కూతురు తనింటికి వస్తున్నదీ, తన సమస్యలన్నీ తీరి ప్రశాంతత చేకూరుతుందనే ఆనందంలోనే ఉబ్బితబ్బిబ్బు అవుతున్నాడు గానీ, రాజేశ్వరి పోయి ఇంకా సంవత్సరం కాలేదు అనే విషయాన్ని అతడు అంతగా పట్టించుకోలేదు.

జగన్నాథం విషయం చెప్పగానే, పురోహితుడు మహా చికాకు పడిపోతూ, "పెద్దవారు మీకు తెలియదటండీ ఆ మాత్రం... నేను చెప్పాలా... వేరే నాకు పని వుండిగూడా, మీ మాట తీసేయలేక వచ్చాను... ఇప్పుడు మీరుగాని, అమ్మాయిగాని ఎలా చేసుకుంటారు?" అన్నాడు.

"సరే...సరే... ఒక పని చేద్దాం లేండి... మీరు ఎలాగూ వచ్చారు కాబట్టి పుణ్యాహవాచనం, విఘ్నేశ్వరపూజ చేసి, భోజనం చేసి వెళ్ళండి. మాకూ తృప్తిగా వుంటుంది!" అన్నాడు జగన్నాథం ఆయన్ను అనునయిస్తూ.

వ్రతం అని ఆహ్వానించారు బంధువులని, మిత్రులని. అందరూ వస్తున్నారు. అందరిముందూ అభాసు అవుతున్నదని బాధ పడుతున్నాడు ఆయన. వసుంధరకూ ఇబ్బందిగానే వున్నది.

స్పందనకు గుండెలోతుల్లోనుంది దుఃఖం వెళ్ళుకొస్తోంది. తండ్రిమీదకూడా చికాకు వేస్తోంది. 'తను తాళికట్టిన భార్య మరణించిందనే జ్ఞానమే లేదా ఆ పెద్దమనిషికి... తను చెప్పాలా... నీభార్య చచ్చి ఇంకా సంవత్సరం కాలేదయ్యా అని!'

తరువాత పావుగంటకు, జగన్నాథం, వసుంధర ఆమె గదిలోకి వచ్చారు. జగన్నాథం ఆమె తలమీద చేయివేసి, "నిజమేనమ్మా! మా ఇంటి మహాలక్ష్మి మాకు దొరికిందనే సంబరంలో, ఆ విషయమేకాదు, నేను సర్వం మర్చిపోయాను ... మాది తప్పేనమ్మా! కానీ చేసిన తప్పును సరిదిద్దుకునేటందుకు సమయం మించిపోయింది ... పిలిచినవాళ్ళంతా వస్తున్నారు... ఇప్పుడు నువ్వు గతాన్ని తలుచుకుని దుఃఖిస్తూ ఈ గదిలో కూర్చుంటే నలుగురిలో మాకు చాలా ఇబ్బందిగా వుంటుంది... లేచి కాస్త నవ్వుతూ తిరుగు... పూజలూ, వ్రతాలు తరువాత ఎప్పుడో మంచిరోజు చూసి

చేసుకుందాం... వాటికి హడావుడేం లేదు!" అన్నాడు అనునయంగా.

ఆ మాటలు చెబుతూనే ఇక అక్కడ వుండకుండా బయటకు వచ్చేశారు ఇద్దరు.

స్పందన కాస్త కోలుకొని బయటకు వచ్చేటప్పటికి పది నిముషాలు పట్టింది.

అప్పటికి జగన్నాథం అన్నా, తమ్ముళ్ళు కుటుంబాలతో సహా వచ్చేశారు. ఆయనకు తెలిసిన మిత్రులు వచ్చారు.

పురోహితుడు హాల్లో పూజ మొదలుపెట్టాడు.

వచ్చిన అందరికీ శ్యామల, వనజ టిఫెన్లు పెడుతుంటే ప్రతాప్ నవ్వుతూ ఫొటోలు తీస్తున్నాడు.

ప్రతాప్ గదిలోనుంచి బయటకు వస్తున్న స్పందనను చూస్తూనే, పరుగెడుతూ వచ్చి, "కాస్త ఆగాలి... ప్లీజ్... స్మైల్..." అంటూ ఆమెకు ఫొటోలు తీశాడు.

అప్పుడు వచ్చిన అందరి దృష్టీ స్పందనమీదే వున్నది.

జగన్నాథం పెద్దన్నయ్య ముందుకు వచ్చి, "నేను మీ పెదనాన్ననమ్మా!" అంటూ చేయిపట్టుకున్నాడు. అయనకు డెభై ఏళ్ళుంటాయి. ఆయనే భార్యను, పిల్లల్ని పరిచయం చేశాడు. తన ఇంకో తమ్ముడిని, "ఈయన మీ చిన్నాన్న!" అంటూ ఆయన కుటుంబాన్నీ పరిచయం చేశాడు.

"మొత్తానికి మా జగన్నాథం అదృష్టవంతుడు... అనుకోకుండా తన మనస్సులోని కోరికను ఇట్టే తీర్చేసుకున్నాడు... అందరి నోళ్ళూ మూయిస్తూ!" అన్నాడు. ఆయన ఆ మాటను నవ్వుతూ అన్నా, అందులో ఏదో శ్లేష ఉన్నట్టే గమనించింది స్పందన. ముభావంగా వుండిపోయింది.

అందరూ భోజనాలకు కూర్చుండేటప్పటికి పన్నెండు దాటి అరగంటయింది.

"అదేంవిటి... ఇంకా వ్రతం కాలేదుగదా" అని ఒకళ్ళిద్దరన్నా, వసుంధరే ఏదో సర్దిచెప్పింది..."ముందు ఇవ్వాళ వ్రతం అనుకున్నాం... కానీ బ్రహ్మగారేమో ఇవ్వాళ

తిథి బాగోలేదు అన్నారు... సరే అమ్మాయి వచ్చింది గదా అని విఘ్నేశ్వరపూజ చేయించి ఊరుకున్నాం... మరోసారి మంచిరోజు చూసి వ్రతం చేసుకుందామనుకుంటున్నాం" అన్నది నవ్వుతూ. "మళ్ళా మీరంతా మరోసారి మా ఇంటికి విందుకు రావాలి!"

పెద్దవాళ్ళకు డైనింగ్ టేబుల్ మీద ఏర్పాటు చేశారు. మిగతా అందరూ హాల్లో వరసగా క్రింద కూర్చున్నారు.

స్పందన, శ్యామలా పక్కనపక్కన కూర్చున్నారు.

ప్రతాప్‌కు స్పందన పక్కన కూర్చొని భోజనం చేయాలని వున్నది. కెమేరా పట్టుకుని వాళ్ళ దగ్గరకు వచ్చి, "శ్యామూ! నువ్వు ఫొటోలు తియ్యరాదుటే... నేను భోజనం చేస్తాను! ఆకలి మండిపోతోంది!" అన్నాడు.

"నీకో దణ్ణం మామయ్యా! ఫొటోలు తీసింతరువాత నీ నసుగుడు నేను భరించలేను... అలా ఎందుకు తీశావ్... ఇలా ఎందుకు తీయలేదు అంటూ సతాయించేస్తావ్... కావాలంటే నువ్విక్కడ కూర్చో నేను వడ్డనచేస్తాను!" అన్నది నవ్వుతూ.

"నీ వడ్డన అక్ఖర్లేదులే... అందుకు చాలా మంది వున్నారు!" అన్నాడు ముఖం ముడుచుకుంటూ.

"మీరు కూర్చోండి...నేను ఫొటోలుతీస్తాను...నాకు చాలా ఇంటరెస్ట్‌గూడా!" అన్నది కించత్ కొంటెగా స్పందన.

"అమ్మోవ్! నిన్ను ఆ ఇస్తరిముందినుంచి లేపితే మా అక్క నా గొంతుపిసికి గోడవతల పారేస్తుంది!" అన్నాడు భయపడుతున్నట్లుగా ముఖంపెట్టి, జారిపోతున్న కళ్ళజోడును ముక్కు మీదకు నెట్టుకుంటూ.

"నువ్వు కూర్చో అక్కా! ఆయనగారికి అంత మహా ఆకలి అయితే అదుగో డైనింగ్ టేబుల్ మీద ముసలాళ్ళ కోసరం విస్తళ్ళు వేసారు గదా... అందులో ఒకటి ఖాళీగానే వున్నదిలే... అక్కడ కూర్చొని తింటాడు!" అన్నది.

ప్రతాప్ శ్యామల ముఖంలోకి కొరకొరా చూశాడు.

శ్యామల పకపకా నవ్వేసింది. "నీ సంగతి నాకు బాగా అర్థమయిందిలేగాని మామయ్యా!... అక్కడ పిన్ని ఎవరిమీదో కేకలేస్తున్నది... వెళ్ళి చూడు!"

భోజనాలయ్యేటప్పటికి తరువాత గంటపట్టింది.

చేతులు కడుక్కుంటూనే, స్పందనతో పాటు శ్యామలా ఆమె గదిలోకి వెళ్ళింది.

నవ్వుతూ, "వారం రోజులబట్టీ నన్ను పట్టుకొని వేధిస్తున్న ఓ చిక్కు ప్రశ్నకు సమాధానం ఈ రోజు దొరికింది, అక్కా!" అన్నది.

స్పందన కుతూహలంగా ఆ అమ్మాయి వంక చూసింది 'ఏఁవిటది?' అన్నట్లుగా.

"చాలాకాలంనుంచి నా వెంటబడి తిరుగుతూ నన్ను సతాయిస్తున్న మా మామయ్య, ఈ వారం రోజుల్లో నా ఊసే పట్టించుకోలేదూ అంటే- కారణం తెలుసుకున్నాను!" అన్నది మరోసారి ఫక్కున నవ్వి.

వింతగా చూసింది ఆ అమ్మాయి వంక స్పందన.

"ఇంత అందంగా వుండి, ఆస్తి వున్న మిమ్మల్ని చూసింతరువాత... ఈ నల్లపిల్ల శ్యామల ఆయన గారి కళ్ళకు ఆనకపోవటం నా అదృష్టం... నాకు మొదటినుంచీ మామయ్య అంటే ఇష్టంలేదు... నా ధ్యేయం వేరు, నా ఆలోచనలు వేరు... మధ్యలో మా పిన్ని, అమ్మల పోర్లు తప్ప... ఎమ్సిఏ పూర్తి చేశానని చెప్పాను గదా... ఛాన్స్ దొరికితే అమెరికా వెళ్ళిపోవాలని... అటువంటప్పుడు బికాం తప్పిన ఈయనగారిని నా మెడకో డోలులా నేనెక్కడ తగిలించుకుండేది...!"

"అదేఁవిటి ఆయన గ్రాడ్యుయేషన్ గూడా పూర్తి చేయలేదా?"

"మీరు గమనించనేలేదా... బికాం చదివానంటాడేగాని... పాసయినానని ఎప్పుడూ అనడు!" పకపకా నవ్వుతూ అన్నది శ్యామల.

* * *

భోజనాలయింతరువాత వచ్చిన వాళ్ళంతా వెళ్ళిపోయారు. వసుంధర అక్కయ్యలు పిల్లలు మాత్రమే ఉన్నారు. ఆయన అన్నదమ్ములూ వెళ్ళిపోయారు.

"నీ గదిలోకి వెళ్ళి కాస్త విశ్రాంతి తీసుకో అమ్మా! పొద్దుననగా లేచావ్!" అన్నది వసుంధర, జగన్నాథం తమ్ముడి కుటుంబానికి వీడ్కోలు చెప్పిన తరువాత స్పందనతో.

స్పందనకూ కాసేపు వెళ్ళి పడుకోవాలనే ఉన్నది. పొద్దుటినుంచీ వాళ్ళూ, వీళ్ళూ పలకరించటం, తన గురించి, తన తల్లి గురించి ఆరాలు తీయటంతో కాస్త చికాగ్గానే వున్నది. వాళ్ళు అడిగిన వాటిలో ఎన్నో అర్థంలేని ప్రశ్నలు... అయినా సంయమనంతో సమాధానాలు చెప్పింది.

వసుంధర ఆమాట అనటంతో వెంటనే వెళ్ళి తన గదిలో పడుకున్నది. తలుపుకు బోల్టుపెట్టేద్దామా అనుకున్నది గాని, ఇంట్లో అంతమంది బంధువులు ఉండగా, అలా చేయటం సభ్యతగా వుండదేమోననిపించి దగ్గరకు వేసి మంచంమీద వాలిపోయింది.

ఇంతమంది నడుమ వున్నా, తన తల్లే ప్రతి క్షణం గుర్తుకు వస్తున్నది. ఆమెతో తనది ఇరవై ఏడు సంవత్సరాల అనుబంధం. పసి వయస్సులో జరిగింది తెలియక పోవచ్చుగాని, కాస్త వయస్సు వచ్చేటప్పటికి అర్థమయింది తనకు ఆమె అమ్మే కాదు, నాన్నగూడా అని...అలా తెలుసుకున్న తరువాత ఎన్నడూ తండ్రిని గురించి ఆలోచించలేదు... తనకు ముఖ్యమయిన వ్యక్తులు అమ్మ, అమ్మమ్మ, తాతయ్య మాత్రమే అనుకున్నది.

తలుపు తెరుచుకుంటున్న శబ్దమయింది. తల తిప్పితే ప్రతాప్ లోపలకు వస్తూ కనబడ్డాడు. తలుపు వేసుకుని ఒంటరిగా పడుకున్న తన గదిలోకి అతడు రావటం ఆమెకు చికాకు వేయటమేకాదు, చర్రున కోపమూ వచ్చింది.

విసురుగా లేచి కూర్చున్నది.

అదేమీ పట్టించుకోకుండానే, అతడు నవ్వుతూ వచ్చి ఆమె మంచానికి దగ్గరగా,

కుర్చీని లాక్కొని కూర్చున్నాడు.

"సాయంత్రం సినిమాకు వెళ్దామని చెప్పటానికి వచ్చాను.... పొద్దుటినుంచీ, మా అక్క నా ప్రాణంతీసి ఇంటెడు చాకిరీ చేయించింది... రిలాక్స్ అవ్వందే నా మైండ్ మామూలు స్థితికి రాదు!" అన్నాడు కాళ్ళూపుతూ, చేతులు తిప్పుతూ.

"సినిమాకు దేనికి?" కోపాన్ని నిగ్రహించుకుంటూ అన్నది. అతడికి పాఠం చెప్పటానికి సమయం ఆసన్నమయింది అనుకున్నది మనస్సులోనే.

"సినిమాకు దేనికేమిటి?... చూడటానికి... ఎంజాయ్ చేయటానికి... పడ్డ శ్రమను మర్చిపోవటానికి!" అన్నాడు హుషారుగా.

స్పందన లేచి, అతడు తీసివచ్చిన తలుపును తిరిగి దగ్గరకు వేసి వచ్చి మంచం మీద కూర్చున్నది.

ఆమె చర్యకు అతడిలో మరింత ఉత్సాహం వచ్చింది.

"మీరన్నట్లుగా అది ఎంజాయ్ చేయటానికి మనమిద్దరమే వెళ్ళాలా?... మీరొక్కరూ వెళితే సరిపోదా?" అన్నది అతడివంక తెచ్చిపెట్టుకున్న ప్రసన్నతతో చూస్తూ.

"ఎలా సరిపోతుంది... పక్కన నువ్వుంటే అదొక సరదా!"

"నేనే ఉండాలా... ఏ ఆడపిల్లయినా ఫరవాలేదా?"

ఆమె మాటల్లోని భావం అర్థమయినట్లనిపించగా, "అంటే- నీ ఉద్దేశ్యంలో నేను అమ్మాయిల వెంటబడి తిరిగే మనిషిలా కనబడుతున్నానా?" అన్నాడు ముఖం చిట్లించి.

"ఇప్పుడు నన్ను సినిమాకు రమ్మనమనటంలో అర్థం అదేకదా!... నాతో మీకెంత పరిచయముందని నన్ను సినిమాకు ఆహ్వానిస్తున్నారు... దంపతులు వెళ్ళవచ్చు... ఇద్దరు ఆత్మీయులు వెళ్ళవచ్చు... ఇద్దరు సన్నిహిత మిత్రులు వెళ్ళవచ్చు... అంతేగాని,

మన పరిచయం ఎన్నాళ్ళని?... అసలు మనం ఒకళ్ళకొకళ్ళం ఏమౌతాం... సినిమాలకు, పార్కుల్లో షికార్లకు కలిసి తిరిగేటంత చనువు మన మధ్య వున్నదా?" అన్నది సీరియస్‌గా.

అతడు ముఖానికి గంటుపెట్టుకుంటూ, ''అలా తిరిగితేనే చనువు ఏర్పడేది...ఒకళ్ళనొకళ్ళు అర్థం చేసుకోగలిగేది... దగ్గరవ్వగలిగేది... ఆత్మీయులవ్వగలిగేది... ఫారిన్ కంట్రీస్‌లో- నీకు తెలుసో తెలియదో- వివాహానికి ముందు డేటింగ్ అనే పద్ధతి ఒకటి వున్నది... కాబోయే భార్యాభర్తలు ఒకళ్ళ నొకళ్ళు తెలుసుకునేటందుకు ఏర్పరుచుకున్న ఓ ప్రక్రియ అది!"

"అంటే మనమిద్దరం ఇప్పుడు డేటింగ్ చేయాలనా?" స్పందన పకపకా నవ్వింది. గోదాలోకి దిగనేకూడదు. దిగింతరువాత భయపడాల్సిన అవసరమే లేదు. అతడు అసలు విషయంలోకి వచ్చాడు కాబట్టి తన మనస్సుకూడా అతడికి తెలిసివచ్చేలా చెప్పక తప్పదు.

"నా ఉద్దేశ్యం అదికాదు... ఉదాహరణకు చెప్పాను... నా మేనగోడలిగా నిన్ను ఆహ్వానించాను... మా యింటి మనిషిగా నిన్ను సినిమాకు రమ్మనమన్నాను.... నాకు నచ్చిన మనిషిగా నీతో సరదాగా వుండాలని అనుకున్నాను... నాకూ గౌరవ మర్యాదలంటే ఏమిటో తెలుసు! ఎవరితో ఎలా ప్రవర్తించాలో తెలుసు!"

"నేననుకోను... తెలిసినవాడివైతే... నేను ఒంటరిగా ఈ గదిలో పడుకుని ఉన్నప్పుడు తలుపు తోసుకుంటూ లోపలకు వచ్చేవాడివే కాదు... తలుపు చప్పుడు చేసి, నేను తీస్తే వచ్చేవాడివి... నేను రమ్మనమంటే వచ్చేవాడివి!" ఆమె కళ్ళు ఎర్రబడటం మొదలుపెట్టినయి.

ఆమె మాటలకు అతడి ముఖమూ కందింది. "నా మేనగోడలు గదిలోకి రావటానికి నాకు అనుమతి కావాల్సి వస్తుందని నేను అనుకోలేదు!" అన్నాడు రోషంగా.

"ఖచ్చితంగా... నా గదిలోకే గాదు... మీ అక్కయ్య గదిలోకి వెళ్ళాలన్నా... తలుపులు వేసివున్నప్పుడు అనుమతి తీసుకోవటం మీ విధి!" దృఢంగా వున్నదా కంఠం.

"మా అక్క నీలాగా పోజుకొట్టదు!"

"ఇందులో పోజుకొడుతున్నదేమున్నది... నేను ఓ మంచిపద్ధతి గురించి చెబుతున్నాను! అలాగే నన్ను మాటమాటకీ బయటకు వస్తావా, సినిమాకు వెళ్దామా, స్కూటరెక్కుతావా అంటూ అడగవద్దు... నాకు అలాంటివి నచ్చవు... నేను ఓ నిబద్ధతతో పెరిగిన దాన్ని!"

"అంటే నేను జులాయి వెధవననా నీ ఉద్దేశ్యం!" చర్రున అతడికీ కోపం వచ్చింది ఆమె మాటలకు. కుర్చీలోనుంచి విసురుగా లేచాడు.

"నేను అనలేదామాట... ఇతరులతో మర్యాదగానూ, హుందాగానూ ప్రవర్తించటం నేర్చుకోమని చెబుతున్నాను!"

"అవునలే... బీఈడీ చదివావు గదా... పిల్లలకేకాదు పెద్దలకూ క్లాసులు తీసుకోవటం అలవాటన్నమాట... సారీ... ఈసారి లోపలకు వచ్చేటప్పుడు ఒక్కసారికాదు పదిసార్లు నీ అనుమతి తీసుకునే వస్తాను!"

"మీరు బి.కాం చదివి అన్నిటికీ లెక్కలూ... లాభనష్టాలు వేయటంలేదా? అలాగే!..." అన్నది గుండెలు మండిపోతుండగా, విసురుగా.

ఆమాట వింటూనే లేచి చరచరా ఆ గదిలోనుంచి వెళ్ళిపోయాడు ప్రతాప్.

* * *

రాత్రి పది గంటలయింది.

పగలంతా ఉక్కిరిబిక్కిరి అయినట్లున్నది అంతమంది కొత్తవాళ్ళ నడుమ. అందునా ప్రతాప్ తన గదిలోకి వచ్చి వెళ్ళిన తరువాత మనస్సంతా పూర్తిగా కలుషితమయిపోయింది. ఎవరి ఆలోచనలు వాళ్ళ పరిధిలోనే ఉంటే తనకే ఇబ్బంది లేదు... లేదూ ఆ గీతలు దాటి, తనని ఆక్రమించటానికి ప్రయత్నిస్తే వాటిని కత్తిరించక తప్పదు. వాళ్ళ కోసరం తన జీవిత విధానాన్ని, తన తల్లి నేర్పిన విలువలనీ నాశనం చేసుకోవాల్సిన అవసరం లేదు. తనకు ఈ ఇల్లు ఓ బంగారు పంజరంలా కనిపిస్తున్నది.

తన ఇష్టా ఇష్టాలకు విలువ ఉండదనిపిస్తోంది. తన తల్లి తనకేర్పరిచిన దారికే భంగం కలిగేలా వున్నది. ఆమెకు చాలా అసహనంగా వున్నది.

లేచి వెళ్ళి తలుపు లోపల బోల్టుపెట్టింది.

తిరిగి మంచం మీద పడుకొని, సెల్ తీసి ఇంటికి ఫోను చేసింది.

మాణిక్యం కంఠం గుర్తు పడుతూనే, "నువ్వు వెంటనే మూర్తిగారింటికి వెళ్ళి, మా నాన్నకు ఫోను చేయమన్నానని చెప్పు!" అన్నది త్వరత్వరగా.

"ఏమనమ్మా?" అన్నది ఆత్రంగా మాణిక్యం.

"ఆయనకు తెలుసులే!" అని సెల్ ఆఫ్ చేస్తుంటే ఆమె మనస్సు ఎంతో తేలికయినట్లనిపించింది.

దిండుమీద వున్న దుప్పటిని తీసుకొని కప్పుకుంటూ ఒక్కసారి అమ్మను, అవ్వను తలచుకున్నది.

* * *

ఉదయం ఏడు గంటలకు జగన్నాథంకు ఫోను వచ్చింది.

"నమస్కారమండీ! నేను మూర్తినండీ... ఆదోనినుంచి మాట్లాడుతున్నాను... ఒక్కసారి స్పందనగారిని పిలుస్తారా?"

''ఒక్క నిముషం... అమ్మా! స్పందనా ఆదోనినుంచి మూర్తిగారు మాట్లాడుతున్నారు!"

సోఫాలో కూర్చుని వున్నదల్లా లేచి హడావుడిగా ఫోను దగ్గరకు వచ్చింది స్పందన. ఆమె అనుకున్నదే ఆ కాల్ వస్తుందని... అయినా ముఖంలో ఆతురతను వ్యక్తం చేసింది తండ్రి ఆ మాట చెప్పగానే.

"హలో! స్పందనను... చెప్పండి... అంతా కులాసానేగదా!"

"రేపు డీయీవో ఆఫీసునుంచి, మన అకౌంట్స్ చెక్ చేయాటానికి ఆడిట్ పార్టీ

వస్తున్నది... మీరుంటే బాగుంటుందనుకుంటున్నాను!" అన్నాడు.

"అలాగా! తప్పకుండా వస్తాను... నేను లేకపోతే వాళ్ళను అవమానించినట్లుగా వుంటుందేమో. కొన్ని ఎకౌంట్స్ పుస్తకాలు గూడా మా ఇంట్లో బీరువాలో వున్నయి... మొన్న చెక్ చేద్దామని తెచ్చి అక్కడే పెట్టాను!" అన్నది త్వరత్వరగా. "రేపు ఎన్నింటికి వస్తున్నారు వాళ్ళు?"

"టైం ఇదని చెప్పలేదుగాని... పది తరువాత, పన్నెండు లోపు వస్తారని నేను అనుకుంటున్నాను... ఈలోగా మిగతా ఏర్పాట్లు నేను చూస్తాను గాని మీరు కంగారు పడబోకండి!"

"అలాగే... థాంక్యూ.... మన ఎకౌంటెంట్‌గారికి గూడా ఈ విషయం తెలియబరచండి!... ఉంటాను మరి... వీలయినంత వరకూ రాత్రికే వచ్చేస్తాను!" అన్నది స్పందన హడావుడి పడుతున్నట్లుగా.

* * *

స్పందన హైద్రాబాద్‌నుంచి వచ్చిన పదిహేను రోజులకు...

శనివారం ఉదయం అయిదున్నర గంటల వేళ... వాకిటి గేటు చప్పుడవుతుంటే మాణిక్యం లేచి వెళ్ళి తాళం తీసింది.

వచ్చింది జగన్నాథం.

స్పందనకు ఆయన అకస్మాత్ రాక కాస్తంత వింతగానే తోచింది. తను హైద్రాబాద్‌నుంచి వచ్చినప్పటినుండీ దాదాపు రెండురోజుల కొకసారైనా సెల్‌కు ఫోను చేస్తూనే వున్నాడు. మొన్న ఫోను చేసినప్పుడుగూడా ఆయన వస్తున్నట్లుగా చెప్పలేదు.

రెండు నిముషాలు కళ్ళుమూసుకుని తన్మయంగా కూతురు వంకే చూశాడు జగన్నాథం.

"ఎందుకో నిన్ను చూడాలనిపించింది... నీకు దూరంగా వున్న నాకు మనస్సు

ప్రశాంతంగా వుండటంలేదు... అందుకే వెంటనే బయల్దేరాను!" అన్నాడు బాధాతప్త కంఠంతో.

విచిత్రంగా చూచింది తండ్రివంక. తనను చూడకుండా ఉండలేనంత ఆత్మీయతను ఈ కొద్దిరోజులలోనే ఆయన తనమీద పెంచుకున్నాడా?

"మొహం కడుక్కోండి... కాఫీ కలుపుతాను... కాస్త హాయిగా వుంటుంది!" అన్నది వెనక్కు తిరుగుతూ.

"తొందరలేదమ్మా... కాసేపు నా ఎదురుగ్గా కూర్చో...!" అన్నాడు తడుస్తున్న కంఠంతో.

అక్కడ ఇంట్లో ఏదైనా గొడవ జరిగిందేమోననిపించింది స్పందనకు క్షణంపాటు.

"క్రితం సారి మొట్టమొదటిసారిగా వచ్చినప్పుడు లక్ష్మమ్మ అవ్వ నాకు చేసిన మేలును జీవితంలో మర్చిపోలేను... అందుకు కృతజ్ఞతగా మరోసారి ఆమెను దర్శించుకుందామని వచ్చాను... ఈసారి ఓ పాతిక వేలు తెచ్చానమ్మా... మొన్న అన్నదానానికి ఇచ్చిన మొత్తానికే దీన్నీ కలపాలని... చిన్నగా దానిని రెండు లక్షల వరకూ చేయాలని. ఆమె నాకు చేసిన సహాయానికి నేను ఎంతిచ్చినా ఋణం తీరదేమో!" అన్నాడు ఆయన కళ్ళు మూసుకుని అవ్వను తలుచుకుంటూ.

స్పందనా తృప్తిగా ఆయన వంక చూసింది.

"వారిని కూడా మీతోపాటు తీసుకు రావాల్సింది!" అన్నది మర్యాద సూచకంగా. ఆవిడ అంటూ వస్తే, ఆ కోతి గూడా వస్తుంది, తనను చికాకు పరుస్తూ అని మనస్సులో ఉన్నా.

ఆయన చిన్నగా నవ్వాడు. "అసలు సంక్రాంతికి నిన్నే అక్కడకు రమ్మనమందామని అనుకున్నాం... మొన్న వచ్చినప్పుడు చెప్పావుగదా... ఈ సంవత్సరమంతా ఏ పండగలూ ఉండవని.. అందుకనే ఆ ఆలోచనను మానుకున్నాం... ఇంతలో అనుకోకుండా వాళ్ళ పెద్దక్కయే మమ్మలనందరినీ వాళ్ళింటికి రమ్మనమని పిలిచింది... నేను మా

అమ్మాయి దగ్గరకు వెళతాను, నువ్వూ, నీ తమ్ముడూ మీ అక్కయ్యగారింటికి వెళ్ళండి అని చెప్పి నేను ఇటు వచ్చాను... నన్ను మొదటిసారి ఇక్కడకు పంపిన మిత్రుడే నాకు చెప్పాడు... ఇక్కడ ఇంకా శక్తి వంతమైన ఎన్నో దేవాలయాలు ఉన్నయ్యని... వాటిని గూడా చూసి రమ్మనమని!... సరే! నీ దగ్గరకు వచ్చినట్లూ వుంటుంది... వాటిని చూచినట్లూ ఉంటుందని బయల్దేరానమ్మా!"

స్పందన మనస్సు తేలికపడింది– ఆయన మాటలతో!

"ఈ రోజు శనివారం... పన్నెండు గంటలకల్లా స్కూలు అయిపోతుంది గదా... రేపు ఆదివారం... ఎల్లుండి సంక్రాంతి శెలవు... మంగళవారం కనుమ... బుధవారం రాత్రికి నన్ను మళ్ళీ బస్సెక్కించాలి!"

"ముందు మీరు మొహం కడుక్కోండి... కాఫీ త్రాగుతూ మాట్లాడుకుందాం!" అంటూ స్పందన లేచింది.

ఆయనా మనస్సు తేలికపడ్డవాడిలా లేచినిలబడ్డాడు.

"ఒక పని చేయమ్మా! ఈ మూడు రోజులూ మన ఆధీనంలో ఉండేలా ఓ కారును అద్దెకుతీసుకో... ఎంతయినా ఫరవాలేదు... నేనిస్తాను!" అన్నాడు తరువాత పావుగంటకు కాఫీ త్రాగుతూ జగన్నాథం.

"మీరిచ్చినా నేనిచ్చినా ఒకటేగాని... అలాగే ఏర్పాటు చేస్తాను... స్కూలుకు వెళ్ళింతరువాత మూర్తిగారిని పంపి కనుక్కోమని చెబుతాను!"

"మంచిదమ్మా!"

"మొన్న నువ్వు వచ్చినప్పుడు... ప్రతాప్‌తో గొడవేమైనా జరిగిందా అమ్మా!" అన్నాడు కూతురునే చూస్తూ.

ఉలిక్కి పడ్డట్లుగా తండ్రి వంక చూసింది స్పందన.

"మీతో ఏమైనా అలా జరిగిందని చెప్పాడా?"

‘‘లేదు... నువ్వెళ్ళింతరువాత రెండు రోజులు వాడు కోపంగా చిర్రుబుర్రులాడుతుంటేను... ఆపైన నువ్వేమో అర్థాంతరంగా వచ్చేశావ్... అందుకే అనుమానమొచ్చి అడుగుతున్నాను!” అన్నాడు ఆయనా ఇబ్బందిగానే కూతురు ముఖంలోకి చూస్తూ.

కోలుకున్నది స్పందన. “అదేం లేదండి...!” ఒక్కక్షణం జరిగింది చెబుదామా వద్దా అన్నట్లుగా ఆలోచిస్తూ వుండిపోయి, తరువాత చెప్పటానికే నిర్ణయించుకుని, “తలుపులు వేసుకు పడుకున్న నా గదిలోకి, తలుపులు నెట్టుకుంటూ వచ్చాడు... అలా రావటం తప్పు, చెప్పి రావాలీ అని అన్నాను... అందుకు కోపమొచ్చిందేమో మరి... తరువాత నాతో బాగానే మాట్లాడాడే!” అన్నది ఆ విషయాన్ని చాలా తేలికపరుస్తూ.

ఆయన పెద్దగా నవ్వేశాడు. “బాగా చెప్పావ్... వాడు చేసిందీ, వాడికి తోచిందే మంచిదనుకుంటే ఎలా?... కాస్త అప్పుడప్పుడూ నీలాగా వాతలు పెట్టేవాళ్ళు లేకనే వాడు సభ్యతలను మరిచిపోతున్నాడు!”

“మీ అక్కయ్య గదిలోకి అయినా, ఆమె తలుపులు వేసుకున్నప్పుడు, ఆమె అనుమతి లేకుండా వెళ్ళటం తప్పనే చెప్పాను!”

“నువ్వు చెప్పింది అక్షరాలా నిజం! ఏం ఫరవాలేదు... నువ్వు దానికోసరం బాధపడాల్సిన అవసరం లేదు!” అన్నాడు ఆయన తేలిగ్గా శ్వాసపీల్చుకుంటూ.

ఆమె స్నానం చేసి ధ్యానంలో కూర్చున్నా, మనస్సును నిలకడగా తన ఆధీనంలో ఉంచుకోలేకపోయింది... ప్రతాపే కళ్ళముందు మెదులుతున్నాడు. అతడి మాటలే చెవుల్లో గింగుర్లుమంటున్నాయి.

స్కూలుకు వెళతూనే మూర్తికి కారు సంగతి చెప్పి, “మధ్యాహ్నం మంత్రాలయం వెళ్దాం రండి... అమ్మను గూడా తీసుకురండి... ఎలాగూ కారులో వెళుతున్నాం కదా!” అన్నది.

"నాన్నగారు వచ్చినప్పుడు, మీ ఇద్దరే వెళ్ళటం బాగుంటుంది!" అన్నాడు మూర్తి.

"మీకంటే ఆయన నాకు ఎక్కువ కాదు!" చటుక్కున అని, మరుక్షణంలోనే, తను తొందరబడి నోరు జారానా, అన్నట్లుగా బిగుసుకుపోయింది. కనురెప్పలార్పటం మరిచిపోయి అతడినే చూస్తూ వుండిపోయింది. అలా ఎందుకన్నదో గూడా తెలియనంత అయోమయంలో పడిపోయింది.

మూర్తి విచిత్రంగా ఆమె ముఖంలోకి చూశాడు ఆ మాట వింటూనే.

తరువాత కొద్ది క్షణాలల్లోనే, "మీ క్రికెట్ మ్యాచ్‌ల విషయంలో ఏదో ప్రోగ్రాం మారిందన్నారు మొన్న... ఏమిటది?" అన్నది తడబడుతూ, మాటమార్చి.

మూర్తి ఇబ్బందిగా ఆమె మొహంలోకి చూశాడు. "జిల్లా కేంద్రంలో అన్ని స్కూళ్ళకూ పోటీలు నిర్వహించటం కష్టమని, ముఖ్యమైన మండల కేంద్రాలలో ప్రిలిమనరీస్ నాకౌట్ పద్ధతిన నిర్వహించి... ఆఖరుగా, ఓ ఎనిమిది టీంలను కర్నూలులో ఆడమంటారట... వాటిని గూడా రెండు బ్యాచ్‌లగా చేసి... రెండింటినుంచీ రెండు టీములు ఫైనల్‌కు, సెమీ ఫైనల్‌కు వచ్చేలా చూస్తారు... ఆ తరువాత మరో శుభవార్త ఏమిటంటే... అక్కడకు వచ్చిన ఎనిమిది టీంలలోనుంచీ పదిహేనుమంది మంచి ఆటగాళ్ళను ఎన్నుకొని... దాన్ని జిల్లా టీంగా నిర్ణయిస్తారు... వాళ్ళు ఇతర జిల్లా టీంలతో ఆడాలి... ఆ పదిహేనుమందిలో మనవాళ్ళు కనీసం ముగ్గురు నలుగురయినా వుండాలని నా కోరిక... మన స్కూలు పేరు దాంతో జిల్లా అంతా మారుమ్రోగుతుంది!"

అతడి మాటలకు ఆమె కళ్ళూ ఆనందంతో మెరిసినయ్.

"బహుశః త్వరలోనే... ప్రతి ఆదివారం ఇక్కడ ఒక స్కూలు టీంతో ఆడేలా షెడ్యూల్ రావచ్చు... ఇక్కడ స్కూళ్ళ నన్నిటినీ జయిస్తేనే మనం జిల్లా కేంద్రంలో కాలు పెట్టగలిగేది!"

* * *

రాత్రి ఏడుగంటల ముప్ఫయి నిముషాలయింది. రథోత్సవం ప్రారంభం కావటానికి ఇంకా అరగంట సమయమున్నది.

రాఘవేంద్రస్వామి మఠంలో ఎటు చూచినా జనమే. శనివారం, ఆదివారం ఎప్పుడూ ఎక్కువే ఉంటారు. తను ఇంతకు ముందు చాలా సార్లు వచ్చింది. సామాన్యంగా శెలవు రోజుల్లో తను ఏ గుడికీ వెళ్ళదు. అంతమంది జనంలో ప్రశాంతత లభించదని, దైవదర్శనం సరిగ్గా జరగదని ఆమె భయం. కానీ, తన తండ్రి రావటంతో ఇప్పుడు రాక తప్పలేదు.

మూర్తి రానన్నాడు అతడి తల్లికి ఆయాసంగా వుండటంతో. సాయంత్రం, మంత్రాలయం బయల్దేరేముందు స్పందన వాళ్ళింటికి వెళ్ళి ఆమెను చూసివచ్చింది. ఆయాసం అంత ఉధృతంగా లేదుగాని, కాస్త ఇబ్బంది పడుతూనే వున్నది ఆమె.

"పోనీయ్... మాణిక్యాన్ని ఉంచేదా?" అడిగింది స్పందన.

"ఎందుకండీ... పెందరాళే డాక్టరుగారి దగ్గరకు వెళ్ళి ఇంజక్షన్ చేయించుకు వస్తాను... తగ్గిపోతుంది... కంగారేం లేదు... మీరు వెళ్ళిరండి!" అన్నాడు మూర్తి. ఆమె సమస్యకు అతడు బాగా అలవాటు పడివుండటంతో.

స్పందన తండ్రితోపాటు, మాణిక్యాన్నీ, కల్యాణిని గూడా తీసుకొని కారులో నాలుగు గంటలకు మంత్రాలయం బయల్దేరింది. అయిదున్నరకల్లా వచ్చారు అక్కడకి.

తండ్రికి ఇంటిదగ్గరే చెప్పింది తెల్లధోవతి కట్టుకు రమ్మనమని. రథోత్సవం అవ్వగానే తిరిగి వచ్చేయాలనేది వాళ్ళ ఆలోచన.

బృందావన దర్శనం అయిన తరువాత, తండ్రీ కూతుళ్ళిద్దరూ, ఓ పక్కగా ఖాళీగా వున్న చోట కూర్చున్నారు.

క్రచ్ చంకన పెట్టుకుని కల్యాణి చిన్నగా ఇంకా ప్రదక్షిణాలు చేస్తునే వున్నది. మాణిక్యం ఆ అమ్మాయికి తోడుగా వున్నది.

"నాకు ఇప్పుడు ప్రశాంతంగా వున్నదమ్మా... ఎంతో మనస్తాపం కలిగిస్తూ

ఇంట్లో చిన్నచిన్న సంఘటనలు జరుగుతున్నయి... వాటిని మర్చిపోవటానికే, వాళ్ళను అటు పంపించి నేను నీ దగ్గరకు వచ్చింది!"

తండ్రి ముఖంలోకి కన్నార్పకుండా చూస్తూ ఉండిపోయింది– అవి తన మూలకంగా జరగటంలేదుగదా అనే అనుమానం మనస్సును పీకుతున్నా. "ఏ విషయంలో?" కొద్ది సేపు తరువాత నోరు తెరిచి అడిగింది.

"మామూలే... కొత్త విషయమేమీ లేదు... ఎప్పుడూ జరుగుతున్న రామాయణమే!"

"అదే ఏ విషయంలోనని?" రెట్టించింది.

"వసుంధర పెద్దక్కయ్య ఒక రోజు వచ్చి, చెల్లెలుతో గొడవపడింది!"

"దేనికిట?"

"ఆమెకు శ్యామలను ప్రతాప్‌కిచ్చి పెళ్ళి చేయాలనేది కోరిక... మొన్నమొన్నటి దాకా సుముఖంగా వున్న ప్రతాప్ ఇప్పుడు అందుకు అంగీకరించటం లేదు?"

"కారణం?" శ్యామల మాటల ద్వారా తనకు కొంత తెలిసినా తెలియనట్లే అన్నది. ఆ వివాదానికి తను మూలబిందువు అవుతున్నానేమో అనే భయం మరింతగా బలపడుతున్నది.

"వాడికి దాన్ని చేసుకోవటం ఇష్టంలేదు!" అన్నాడు డొంక తిరుగుడుగా. అతడు స్పందనను చూసినప్పటినుంచీ అలా మారాడని, ఆమెకు చెప్పటానికి జంకాడు.

స్పందన తటపటాయింపుగా కొద్దిసేపు ఆగింది. తరువాత ఇలాంటి విషయాలల్లో నాన్నుడు పనికిరాదన్నట్లుగా, "అసలు శ్యామలకు అతడిని చేసుకోవటం ఇష్టమేనా?... ఎవరైనా, ఎప్పుడయినా అడిగారా ఆ అమ్మాయిని?" అన్నది.

జగన్నాథానికి ఏం మాట్లాడాలో తెలియలేదు. మారుతున్న లోకంతీరును ఆయన వంటపట్టించుకున్నట్లు లేదు.

"శ్యామలకు మీ బావమరిదిని చేసుకోవటం ఇష్టంలేదు!" అన్నది సూటిగా.

"శ్యామల ఎమ్‌సీఏ చేసింది... ఆ అమ్మాయికి ఎన్నో ఆలోచనలు ఉన్నాయి పైపైకి వెళ్ళేటందుకు... మీ బావమరిదేమో బీకాం తప్పి కూర్చున్నాడు... ఉద్యోగం సద్యోగం లేదు!"

జగన్నాథం బిగుసుకుపోయాడు కూతురు మాటలు వింటూనే.

"సరే అది పోనీయండి... మొన్నటిదాకా ఆ అమ్మాయిని చేసుకోవటానికి అంగీకరించిన మీ బావమరిది... ఇప్పుడు ఎందుకు కాదంటున్నాడు?" కారణం తెలిసినా తెలియనట్లే అడిగింది, అవ్వను తలుచుకుంటూ.

"తెలియదు!" ఆయన అసలు విషయాన్ని దాస్తున్నాడని స్పష్టంగా అర్థమయింది.

ఆయన పరిస్థితీ అలాగే వున్నది... ఏం చెప్పాలో తెలియని అయోమయం... 'నిన్ను చూచింతరువాత ఆ అక్కా తమ్ముళ్ళిద్దరికీ శ్యామల ఆనటంలేదు' అని అంటే అది ఎటుకు దారితీస్తుందో అనేది ఆయన భయం.

స్పందన రెట్టించ దలుచుకోలేదు– ఆయన నోటిద్వారానే ఎప్పటికైనా ఆవిషయాన్ని బయట పెట్టించాలన్నట్లుగా మౌనంగా ఉండిపోయింది.

కల్యాణి, మాణిక్యం వాళ్ళ దగ్గరకు వచ్చారు ప్రదక్షిణాలు పూర్తి అవ్వటంతో.

"పదండి... రథోత్సవం మొదలయ్యేలా వున్నది... ముందు ఏనుగుమీద స్వామి వారిని ఊరేగిస్తారు... తరువాత, చెక్క రథం మీద, వెండి రథం మీద, ఆఖరుకు బంగారు రథం మీదా... కనుల పండుగగా ఉంటుంది... వచ్చే సంవత్సరం మనమూ చేయిద్దాం!" అన్నది.

వాళ్ళు మఠంలోనుంచి బయటకు వచ్చేటప్పటికి తొమ్మిది గంటలయింది.

మరునాడు ఉదయం తెల్లవారకముందే లక్ష్మమ్మ అవ్వ గుడికి వెళ్ళింది తండ్రిని తీసుకుని. అప్పుడే ఆయన పాతికవేలు అక్కడ ఇచ్చేటందుకు తీసుకు వచ్చాడు.

వెళ్ళగానే అవ్వను దర్శించుకుని, మెట్లుదిగి క్రిందకు వెళ్ళి సమాధి ఎదురుగా

కూర్చున్నారు.

స్పందన తన్మయంగా అవ్వ విగ్రహాన్నే చూస్తున్నది. అరగంటవరకూ ఇద్దరూ మాట్లాడలేదు.

"ఇక వెళ్దామా అండీ?" అన్నది తృప్తిగా ధ్యానం చేసుకుని లేవబోతూ.

"కూర్చో అమ్మా! నీనుండి ఏదీ దాచాలన్నా కష్టంగానే వున్నది... నాకు చికాకు కలిగిస్తున్న మరో విషయమూ ఇక్కడే చెబుతాను... లక్ష్మమ్మ తల్లి ఈ సమస్యలనుండి నన్ను బయటకు లాగుతుందనే ఆశతో!"

ఆయన ముఖంలోకే ఏం చెబుతాడా అన్నట్లుగా చూస్తూ వుండిపోయింది స్పందన.

"నువ్వు హడావుడిగా అక్కడనుంచి వచ్చేసిన రెండు రోజులకు అన్నయ్య వచ్చి చాలా నిష్ఠూరంగా మాట్లాడాడు!"

"దేనికట?"

"ఆయనకు ముగ్గురూ మొగపిల్లలే గదా... ఎవ్వరూ ఇంకా స్థిరమైన ఉద్యోగాలల్లో కుదురుకోలేదు... ఆర్థికంగా వాళ్ళు అంతగా నిలదొక్కుకున్న వాళ్ళూ కాదు... అందుకే వాళ్ళ పిల్లలలో నాకిష్టమొచ్చిన ఒకడిని దత్తు తీసుకోమని ఆయన చాలా రోజులబట్టీ అడుగుతున్నాడు!"

కాస్త ఆలోచిస్తున్నట్లుగా ఆగింది.

"దానికి అభ్యంతరమేమున్నది... అది మంచిదేగదా!"

"కానీ అది మీ పిన్నికి ఇష్టంలేదు!"

"ఎందుకని?"

"ఆమెకు శ్యామలను తెచ్చుకొని తమ్ముడికిచ్చి పెళ్ళిచేసి మా దగ్గరే ఉంచుకోవాలని... అది నిన్న లక్ష్మమ్మ అవ్వ నాకు ఇవ్వకముందు సంగతి అనుకో!"

"నేను మీ ఇంటికి వచ్చినా అంతకుముందు అనుకున్నట్లుగా జరపటంలో

అభ్యంతరమేమున్నది!"

"మొదటినుంచీ నాకు శ్యామలను తెచ్చుకోవటం ఇష్టం లేదు... ఇప్పటికే మీ పిన్నితోనూ, దాని తమ్ముడితోనూ,  చాలా వరకు స్వాతంత్ర్యాన్ని కోల్పోయాను... ఇక ఆ యింటి ఆ పిల్ల వస్తే వాళ్ళంతా ఒకటే... నాకు యింట్లో నా స్థాయి ఇంకా దిగజారుతుందనేదే నా భయం... నా కయితే మా అన్నయ్య కొడుకును తెచ్చుకోవాలని మనస్సులో ఉండేది గాని, ఇప్పుడు ఇక ఆ అవసరంలేదు!"

"ఎలా అంటారు అలా అని...?"

"నా స్వంత కూతురు నాకుండగా మరొకరిని దత్తు తీసుకోవాల్సిన అవసరం ఏమున్నది?" అన్నాడు ఆయన దృఢంగా.

"నేను వచ్చినంత మాత్రాన మీకు ఒరిగేదేమిటి... నాకు పెళ్ళి చేస్తారు అత్తగారింటికి పంపుతారు... అప్పుడు నేను మళ్ళా మీకు పరాయిదాన్నే అవుతాను గదా... మీ అన్నయ్యగారి అబ్బాయిని దత్తు తీసుకుంటే మీకు అన్ని విధాలా చేదోడు వాదోడుగా ఉంటాడు!" అన్నది స్పష్టంగా స్పందన.

"నా స్వంతకూతురు నాకుండగా ఇంకా వాళ్ళంతా నాకెందుకమ్మా... వాళ్ళ ఆలోచనలన్నీ మా డబ్బు చుట్టూ తిరిగేవేగాని, మా మీద ఆత్మీయతతో కాదు.... రేపు మేము మంచాన పడితే సేవ చేసేటందుకుకాదు!" అన్నాడు ఆయన నిర్లిప్తంగా.

తన భార్య ఇప్పటి ఉద్దేశ్యాన్ని చెబుదామా అని నోటిదాకా వచ్చిందికాని, ప్రతాప్‌ను వివాహం చేసుకోవటం స్పందనకు ఇష్టమో, లేదో తెలియదు. కూతురు మనస్సు తెలుసుకోకుండా తను బయటపడటం ఆయనకిష్టంలేదు.

అసలు ఆయన అంతగా మనస్తాపం చెందటానికి కారణం వేరే ఉన్నది...

తన అన్నయ్య రెండు రోజుల క్రితం మరోసారి వచ్చి అన్నమాటలే ఆయనను పూర్తిగా కలిచివేసినయి...

"నువ్వు నీ కూతురు దొరికిందనే సంతోషపడుతున్నావు గాని... ఆ అమ్మాయి

నిజంగా నీ కూతురు అవునో కాదో నీకు తెలుసా?"

బిత్తర పోయాడు తను ఆయన ప్రశ్నకు.

"ఆ యింట్లో చనిపోయిన రాజేశ్వరి ఫొటో చూసే నేను స్పందనను నా కూతురుగా నిర్ధారించుకున్నాను... రాజేశ్వరి తన తల్లి అని స్పందనే చెబుతున్నది... అసలు ఆ అమ్మాయి వెంట నేను వాళ్ళింటికి వెళ్ళటానికి కారణం నన్ను ఏదో తెలియని బలీయమైన శక్తి లాగటమే...!" నిగ్రహించుకుంటూ అన్నాడు తను.

ఆయన ఫక్కున నవ్వాడు: "రాజేశ్వరి నిన్ను ఎందుకు కాదని విడిపోయిందో నీకు పూర్తిగా తెలియదు... నువ్వు డబ్బు తెమ్మన్నావని కాపురానికి రాలేదని నువ్వు అనుకుంటున్నావ్... ఆ అమ్మాయి తల్లిదండ్రులకు ఒక్కతే కూతురు... తరువాత ఎలాగైనా ఆ డబ్బంతా మీకు వచ్చేదా?... ఆ కారణంతో ఆమె భర్తకు దూరమయి సంసారజీవితాన్ని నాశనం చేసుకుంటుందని నేను అనుకోను... దానికి మరేదో బలమయిన కారణం ఉండివుండవచ్చు!"

"ఏముంటుంది అలా?"

"నువ్వంటే అయిష్టత ఉండవచ్చు... మరొకరంటే యిష్టత ఉండవచ్చు!" ఆయన కళ్ళు మూసుకుని ఆలోచిస్తున్నట్లుగా అన్నాడు.

ఆయన అలా మాట్లాడుతుంటే చాలా బాధవేసింది తనకు. గిలగిలలాడాడు. కోపమొచ్చింది. 'తను స్పందన బారసాలకు వెళ్ళాడు... రాజేశ్వరి తనకు దూరమవ్వటానికి తన తప్పిదమేకానీ, ఆమె తప్పులేదు!'

"సరే! స్పందన నీకూతురే అంటున్నావ్... ఆ అమ్మాయి చెప్పింది కాబట్టి నువ్వు నమ్ముతున్నావ్ ... దేవుడి మీద భారమేసి అందరం నమ్ముదాం... మరి నువ్వు చెప్పిన ఆ కుంటి అమ్మాయి సంగతేమిటి... నీ భార్యను ఆ అమ్మాయీ అమ్మా అని పిలిచేది గదా... నీ స్వంత కూతురు అనుకుంటున్న స్పందనను అక్కా అని పిలుస్తున్నది ... నువ్వు ఆ కుంటిపిల్లకు తండ్రివి కాకపోవచ్చు... కానీ ఆమె తల్లి కాగూడదనేమున్నది!"

ఆయనమాటలు నెత్తిన పడుతున్న పిడుగుల్లాగానే ఉన్నయి.

అన్నయ్య మాటలు వింటుంటే గుండెలు బరువెక్కిపోయినయి. భరించలేకపోయాడు. విసురుగా లేచాడు. "అన్నయ్యా! నువ్వు పెద్దవాడివి... నువ్వెన్ని అన్నా నేను ఏమీ అనను... కానీ నా నమ్మకాలు నాకున్నయి... ఆ అనుమానాలతో స్పందనను నా కూతురు కాదనుకొని, నేను మరొకరిని దత్తు తీసుకుంటానని, మరో పిల్లవాడిని నా దరి జేర్చుకుంటానని నువ్వెప్పుడూ అనుకోబోకు!"

"నేను నా పిల్లవాడిని నువ్వు పెంచుకోవటంలేదనే కోపంతో అనటం లేదురా... నా అనుమానాలు చెప్పాను... ఆ అమ్మాయిని దగ్గరకు తీసేముందు, ఆ అమ్మాయి మాటలను గుడ్డిగా నమ్మకుండా, అన్ని ఆరాలూ తీసి, నిజానిజాలు తెలుసుకోమంటున్నాను... అనామకులూ, అనర్హుల చేతుల్లో నా తమ్ముడు కీలుబొమ్మ అవ్వగూడదనే నా తాపత్రయం!" ఆయన తన మనస్సును పూర్తిగా కలుషితం చేసి, వెళ్ళిపోయాడు. తరువాత తనకు నిద్రే కరువయింది.

తన మనస్సు ఎంత బలహీనపడిందో అప్పుడే అర్థమయింది.

– ఇక ఒక్కక్షణం స్పందనను చూడకుండా వుండలేక వెంటనే బయల్దేరాడు.

డబ్బు ఎంతపాపిష్టిది... దాని కోసరం నీ నా అనే కాదు... ఎవ్వరైనా, ఎవ్వరి మీదైనా ఎన్నయినా అభాండాలు వేస్తారు... ఎంతటికైనా తెగిస్తారు...

ఆయన తనకు స్వంత అన్నయ్యే అవ్వవచ్చు... కానీ చాలా జుగుప్సాకరంగా మాట్లాడి తన మనస్సుకు తూట్లు పొడిచాడు!

తను క్షమించలేడు... ఇక వాళ్ళను తను దగ్గరకు రానీయలేడు...

తెల్లవారుతూనే కసాపురం బయల్దేరారు నలుగురూ. తొమ్మిదింటికల్లా అక్కడకు వెళ్ళారు.

అంతెత్తు నెట్టికంటి ఆంజనేయస్వామిని కన్నార్పకుండా చూస్తూ వుండిపోయింది స్పందన. అంతకు ముందు రెండు మూడు సార్లు తల్లితో కలిసి వచ్చింది. చాలా పెద్ద

దేవాలయం. దేవాలయ ఆవరణంతా కోతులతో నిండి భక్తులు ఇచ్చిన అరటిపళ్ళనూ, కొబ్బరి చిప్పలనూ తింటున్నయి. ఆ గుడిని ఎన్నో దశాబ్దాల క్రితం కృష్ణదేవరాయల కాలంలో వ్యాసరాయలు కట్టించారు...

గుడి వెనుక పక్కగా ఓ గదిలో, గాజు పెట్టెలో వుంచిన రాతిని చూశారు. అది నీళ్ళల్లో తేలుతున్నది. ఆలాంటి రాళ్ళతోటే, సుగ్రీవసేన, రాములవారు సీతామ్మవారిని తీసుకురావటానికి, లంకకు వెళ్ళేటందుకు గాను సముద్రం మీద వారథి నిర్మించిందట.

జగన్నాథం సర్వం మరిచిపోయి ఆ దేవాలయాన్నే చూస్తున్నాడు. బయటకు రాబోతూ, “మళ్ళా ఇటు పక్కకు వస్తానో రానో, ఇంకోసారి స్వామివారిని దర్శించుకు వస్తానమ్మా!” అన్నాడు.

“పదండి... నేనూ వస్తాను!” అంటూ స్పందన ఆయన్ను అనుసరించింది.

బయటకు వచ్చేటప్పటికి పదకొండుగంటలయింది. దగ్గరలోనేవున్న గుంతకల్లుకు వెళ్ళి వెంకటేశ్వరస్వామిని దర్శించుకుని, హోటల్లో భోజనాలు చేసి పత్తికొండ వచ్చేటప్పటికి నాలుగు గంటలయింది. అయిదింటికిగానీ అక్కడ దేవాలయాలు తెరవరు. గుడికి వెనుకభాగంలో పార్కులో అటూ ఇటూ తిరుగుతూ కాలక్షేపం చేశారు.

అక్కడ జీవకళతో వున్న బొమ్మల్ని చూస్తూ, కాఫీ త్రాగుతుండగా జగన్నాథం కూతుర్ని, “నేను హైద్రాబాద్‌లో అంతమంది నా వాళ్ళ మధ్య వున్నా ప్రశాంతంగా గడపలేకపోతున్నాను... నువ్వు ఆదోనిలో, నీ వాళ్ళంటూ ఒక్కరూలేని ప్రదేశంలో ఒంటరిగా ఎలా ఉండగలుగుతున్నావమ్మా?” అని అడిగాడు కూతురి ముఖంలోకే ఆప్యాయంగా చూస్తూ.

స్పందన కళ్ళుమూసుకుని ఉండిపోయింది రెండు నిముషాలవరకూ.

“అందరూ నా వాళ్ళే అనుకుంటే ఒంటరితనం ఎక్కడ ఉంటుంది. అమ్మ భౌతికంగా నా పక్కన లేకపోవచ్చు, కానీ ఆమె నా పక్కన ఉన్నదనే భావనే నన్ను ఉత్తేజితురాల్ని చేస్తుంది... అలాగే లక్ష్మమ్మ అవ్వ నాకు ధైర్యాన్ని ఇచ్చి ముందుకు

అడుగు వేసేలా చేస్తుంటుంది... ఇక అన్నిటికీ మించి ఓంకారనాదం నాచుట్టూ కవచంలా ఎప్పుడూ నన్ను అంటిపెట్టుకునే ఉంటుంది... సమస్యలు మనిషన్న ప్రతివాడికీ వస్తయి... వాటిని తట్టుకునే శక్తే మనకు కావాల్సింది... ఆ శక్తికోసరమే మనం భగవంతుని ప్రార్థించటం... ఎప్పుడూ మనం దేఁవుడిని, మనస్సునిండా కోరికలు నింపుకొని, వాటిని తీర్చమంటూ ప్రార్థించ గూడదు... ఆయనకు మనం విన్నవించుకోవాల్సింది మన మనస్సుకు ప్రశాంతత చేకూర్చమనే... ఎటువంటి ఆటుపోట్లనయినా అధిగమంచే శక్తిని ప్రసాదించమనే... అప్పుడు మనకు దేనికీ దిగుల్లేదు!"

కూతురు వంకే తన్మయంగా చూస్తూ ఉండిపోయాడు జగన్నాథం.

దేవాలయాలు తెరిచిన తరువాత దర్శనం చేసుకొని ఇంటికి వచ్చేటప్పటికి ఎనిమిదిగంటలయింది.

ఇంట్లోకి వస్తూనే స్పందన చెప్పింది. "రేపు మనకిక కారు అవసరంలేదు... రావద్దని చెప్పాను... దగ్గరలోనే మంగరాయ ఆంజనేయస్వామి గుడి వున్నది... దాన్ని ఆటోలో వెళ్ళి చూద్దాం... రణమండల ఆంజనేయస్వామి గుడి గూడా ప్రసిద్ధి చెందిందే గానీ అది కొండమీద... అయిదొందలపైగా మెట్లెక్కాలి... మీరు ఎక్కలేరు!"

మరునాడు రాత్రి ఆయన్ను అనుకున్నట్లుగానే హైద్రాబాద్‌కు హైటెక్ బస్సు ఎక్కించింది స్పందన.

* * *

శనివారం ఉదయం స్కూలుకు వస్తూనే, మూర్తిని పిలిచి, "రేపు మీ ప్రోగ్రాం ఏమిటి?" అని అడిగింది స్పందన.

అప్పటికి స్పందన తండ్రి జగన్నాథం ఆదోని వచ్చి వెళ్ళి పదిరోజులు దాటింది.

"పై ఆదివారమే మన క్రికట్ టీంకు, ఇక్కడ గవర్నమెంట్ హైస్కూల్ టీంకు మ్యాచ్ వున్నది... అదే మొదటిది... రేపు మనవాళ్ళ చేత బాగా ప్రాక్టీస్ చేయించాలి...!"

అన్నాడు.

"డ్రిల్లు మాస్టారిని ఉదయం పదింటికల్లా వచ్చి మొదలు పెట్టించమనండి ప్రాక్టీస్.... మీరు, పది తరువాత వారితో కలుద్దురుగాని... చీకటితో బయల్దేరి మనం బుడుములదొడ్డి వెళ్ళివద్దాం!" అన్నది చిన్నగా తలవంచుకుని.

"ఇప్పుడు అక్కడకు వెళ్ళటం అంత అవసరమా?"

"మనకు సమస్యలు వచ్చినప్పుడే గదా దేంవుడు గుర్తుకు వచ్చేది!" అన్నది నవ్వుతూ తలెత్తి అతడినే చూస్తూ.

"మీ సమస్యలన్నీ లక్ష్మమ్మ అవ్వ తీరుస్తుండగా మధ్యలో ఆంజనేయస్వామి ఎందుకొచ్చాడు!" అన్నాడు మూర్తి నవ్వుతూ.

"నా సమస్యలేవీ నేను అవ్వకు చెప్పుకోను... వాటిని ఆమే కనిపెట్టి తీరుస్తుంటుంది... కానీ ఇప్పుడు నాకో చిక్కు ప్రశ్నకు సమాధానం కావాల్సి వచ్చింది... నేను అక్కడికి కోరికలతో వెళ్ళటంలేదు... నేను చేయబోయే పని అవుతుందా, కాదా అని తెలుసుకోవటానికే వెళుతున్నాను! ఆయనిచ్చే సమాధానాన్ని బట్టి తరువాత నేను ఏం చేయాలో నిర్ణయించుకుంటాను!" అన్నది స్పందన, కళ్ళు కాంతితో వెలుగుతుండగా.

– బుడుములదొడ్డి ఆంజనేయస్వామికి దండవేసి, మన సమస్య చెప్పుకుంటే అయ్యేది, లేంది చెప్పేస్తాడు. ఆ దండ కుడివైపుకు పడితే అనుకున్నది అయిపోతుంది. ఎడమవైపుకు పడితే కాదు... అందుకే ఆయన్ను అక్కడంతా పలికే దేంవుడు అంటారు!

మూర్తి గూడలెగరేసి, "ఓకే! మీరు ఎలా అంటే అలా!" అంటూ వెనక్కు తిరిగాడు.

"నాన్న వచ్చినప్పుడు కారు ఏర్పాటు చేశారు గదా... అతడిని ఉదయం ఆరుగంటలకల్లా రమ్మనమని చెప్పండి... మీరూ ఆ సమయానికి తయారుగా వుండండి!"

ఓ నిముషం పాటు అక్కడే నిల్చుండిపోయాడు ఆమెనే చూస్తూ.

స్పందన తలెత్తలేదు అతడు అక్కడనుంచి వెళ్ళేటంతవరకూ.

అనుకున్నట్లుగానే మరునాడు ఉదయం ఆరుగంటలకు బయల్దేరారు ఇద్దరూ.

"మాణిక్యాన్ని, కల్యాణిని రమ్మనకపోయారా... కారులో చోటు ఉన్నదిగదా!"

"వాళ్ళు మరోసారి వస్తారులేండి... ఈరోజు మనమే వెళ్ళివద్దాం!" అన్నది ముఖం పక్కకు తిప్పుకుని కారు వెనుక డోరు తెరిచి కూర్చుంటూ. మూర్తి ముందు సీట్లో కూర్చున్నాడు.

బుడుమలదొడ్డి అక్కడకు సుమారుగా నలభై కిలోమీటర్ల దూరంలో వున్నది.

అక్కడ ఉదయంపూటే జనం ఎక్కువగా వస్తారు. ఆదోనినుంచి మాధవాపురం వెళ్ళేదారిలో ఓ పక్కగా లోపలకు ఉన్నది.

వెళుతూనే తమలపాకుల దండ కొన్నది స్పందన. ఆమె కొంటుండగానే మూర్తి ఒకటి తీసుకున్నాడు.

"మీ కోరికేమిటి?" అన్నది నవ్వుతూ.

"నాకూ కోరికలేం లేవు... భవిష్యత్తు ఏమిటో తెలుసుకోవాలని!"

స్పందన పకపకా నవ్వింది. ఆమె ఎప్పుడూ అలా నవ్వదు. ఈ రోజు చాలా ఆనందంగా ఉన్నదన్నమాట.

"ఎందుకు నవ్వుతున్నారు?" అన్నాడు ఆసక్తిగా ఆమెనే చూస్తూ.

"మీరు స్వామిని అడగబోయే ప్రశ్న ఏమిటో నాకు తెలిసిపోయింది!"

"ఏమిటి?" అన్నాడు ఉత్సుకతతో.

"మన క్రికెట్ టీం ఫైనల్స్‌దాకా జేరి, అందులోనూ గెలుస్తుందా లేదా అనేది మీ సమస్య!"

మూర్తి చాలా తేలిగ్గా నవ్వేశాడు.

"ప్రస్థుతం నా టెన్షన్ అదే!"

"దానికి అంజనేయస్వామే అక్కరలేదు... నేనైనా చెబుతాను... మూర్తిగారి ఆధ్వర్యంలో ఎవ్వరికీ ఓటమి ఉండదు!"

అతడు ఆత్మీయంగా చూశాడు ఆమె వంక. "మీ నమ్మకానికి నా కృతజ్ఞతలు!"

ఇద్దరూ లోపలకు వెళ్ళారు. గర్భగుడి దగ్గర ఓ అయిదారుగురు దండలు పట్టుకుని వరుసగా నిలుచొని ఉన్నారు.

"ముందు ప్రదక్షిణాలు చేసి దర్శనానికి వెళ్దాం!" అన్నది ధ్వజస్తంభం పక్కనే నిలబడి స్పందన.

ఇద్దరూ మూడుసార్లు ప్రదక్షిణాలు చేసి, గుళ్ళోకి వెళ్ళారు. అప్పుడు ఇంకా అక్కడ ఇద్దరు ఉన్నారు.

వాళ్ళు వెళ్ళిపోయిందాకా ఆగి, ముందు మూర్తినే ఇవ్వమన్నది దండను పూజారికి.

ఇద్దరూ ఎదురెదురుగ్గా నిల్చొని వున్నారు. ఆంజనేయస్వామికి ఎవరూ అభిముఖంగా నిలుచోగూడదట... ఆయన ఎప్పుడూ రాములవారినే చూస్తుంటారు... ఎదురుగ్గా నిలుచున్నామూ అంటే మనం వాళ్ళిద్దరినడుమా అడ్డంగా నిలుచున్నట్లే.

ఆయన తీసుకొని దాన్ని స్వామివారికి వేస్తుండగా రెండు చేతులూ జోడించి నమస్కరించాడు మూర్తి.

దండ కుడివైపుకే పడింది. సంతోషంతో మూర్తి ముఖం విశాలమైంది. మెరుస్తున్న కళ్ళతోనే అభినందనలు చెప్పింది మూర్తికి స్పందన.

"మీరివ్వండి!" అన్నాడు ఆనందంగా మూర్తి. "మీ సమస్యకూ సానుకూలమైన సమాధానమే వస్తుంది!"

స్పందన మాట్లాడలేదు. కళ్ళు తెరిచే స్వామివారిని చూస్తున్నది.

పూజారి చేయిజాచాడు. ఆమె చేయెత్తి దండ ఇస్తుంటే వేళ్ళు వణకసాగినయి.

గుండె దడదడలాడుతోంది. శరీరమూ కంపించసాగింది.

కళ్ళు తెరుచుకునే స్వామిని చూస్తూ తన చుట్టూ ఓంకారనాదాన్ని దడిగా కట్టుకోసాగింది. శరీరంలోని ప్రకంపనలకే ఒళ్ళు జలదరిస్తున్నదా అనిపించింది ఆమెకు.

పూజారి వెనక్కు తిరిగి విగ్రహం దగ్గరకు వెళ్ళి, స్పందన వంక ఒక్కసారి చూచి, దండను స్వామివారికి వేశాడు.

ఆమెకు, ఆయన స్వామికి దండవేస్తుంటే ప్రపంచమంతా శబ్దరహితమయిందా అన్నంత నిశ్శబ్దమేర్పడింది. బిగుసుకుపోయి దాన్నే చూస్తున్నది.

కొద్ది క్షణాల వరకూ ఆ దండ ఎటూ పడలేదు ఆమెలో మరింత ఉత్కంఠ కలిగిస్తూ.

ఎవరో భక్తులు గుడిముందున్న గంటను పెద్దగా మ్రోగించసాగారు.

ఉలిక్కిపడి స్పందన చైతన్యంలోకి వచ్చింది.

ఆంజనేయస్వామికి వేసిన దండ కుడివైపుకే పడింది. ఆమె ఆహ్లాదంతో ఉప్పొంగిపోయింది. చటుక్కున స్వామికి నమస్కరించి, ముందుగా మూర్తి ముఖంలోకి చూసింది.

ఆయన స్పందన ఆనందాన్ని చూస్తూ ఉత్సాహంతో స్పందించాడు. "అభినందనలు!" అన్నాడు.

ఒక్కసారి కనురెప్పలార్పి, తలవాల్చి కృతజ్ఞతలు చెప్పింది ముందు స్వామికి, తరువాత మూర్తికి.

తీర్థం తీసుకొని, శఠారి పెట్టించుకొని బయటకు వస్తుంటే, "పక్కన ప్రసాదం పెడుతున్నారు... తీసుకుని వెళ్ళండి!" అన్నాడు పూజారి.

ఇద్దరూ బయటకు వచ్చేశారు.

"ఇప్పుడు నేను తొమ్మిదిసార్లు స్వామికి ప్రదక్షిణాలు చేయాలనుకుంటున్నాను."

"మీ కోరిక నెరవేరుతున్నందుకా?"

"నాది కోరిక కాదని ముందే చెప్పాను... నేను నాలుగు రోడ్ల కూడలిలో, దారి తెలియక నిల్చొని ఉన్నాను... ఆయన నన్ను ఏదారిలో వెళ్ళమంటారో అడగటానికే వచ్చింది...!" అన్నది మెరుస్తున్న కళ్ళతో.

"చూపించాడా?"

"మీరూ చూశారుగదా!"

ప్రదక్షిణాలు మొదలుపెడుతూ, "నాతోపాటు మీరూ చేస్తే నేను సంతోషిస్తాను!" అన్నది అతడినే చూస్తూ.

"తప్పకుండా... నా కోరికా నెరవేరిందిగదా... నేనూ కృతజ్ఞతలు చెప్పుకుంటాను!"

ఇద్దరూ గుడి చుట్టూ తిరుగుతున్నారు... ఒకసారి అయింది... రెండు సార్లు అయింది... మూడుసార్లు అయింది... నాలుగుసార్లు అయింది... స్పందన శరీరమంతా చెమటలు పడుతోంది... కాళ్ళు తడబడుతున్నాయి... ఆమె అలాగే నడుస్తున్నది... రెండు చేతులూ జోడించి 'ఓం ఓం' అంటూనే వున్నది... చాలా లోగొంతుకతో ప్రారంభించిన ఆ స్మరణ, క్షణక్షణానికీ, ఉచ్ఛస్వరంలోకి వెళ్ళిపోతున్నది... ఆరోసారి వచ్చేటప్పటికి ఆమె తనని తానే మరిచిపోయింది... అసంకల్పితంగానే అడుగులు వేస్తోంది... ఓంకారనాదపు శబ్దతరంగాలు ఆ ఆవరణనంతా చుట్టుముడుతున్నయ్యా అన్నంతగా ఆమె నోటినుండి వెలువడుతున్నాయి.

మూర్తి విచిత్రంగా ఆమెనే చూస్తున్నాడు. ఆమె ఎందుకు అలా అయిపోతున్నదో అతడికి అర్థంకావటంలేదు. కంగారు పడుతున్నాడు... ఆమె బాహ్యస్మృతిని కోల్పోతున్నట్లే ఉన్నది.

వాళ్ళు ఏడోసారి ప్రదక్షిణం చేస్తున్నారు. స్పందన తన స్థితిని గుర్తించేలా లేదనిపించగా మూర్తే ప్రదక్షిణాలను లెక్కిస్తున్నాడు.

ఎనిమిదోసారి తిరుగుతున్నారు...

"ఓం... ఓం... ఓం..." ఆ ఆవరణంతా ఆమె కంచు కంఠం వినబడుతున్నది. ఆమె ఊగిపోతున్నది.

ఎవరో పరుగెత్తుకుంటూ వచ్చి గ్లాసుతో మంచినీళ్ళు అందించారు మూర్తికి. "ఆమె చేత త్రాగించండి!"

మూర్తీ తడబడుతున్నాడు... ఆదుర్దా పడుతున్నాడు... ఏమీ అర్థంకాని స్థితిలోకి జారిపోతున్నాడు.

తొమ్మిదోది గూడా అలాగే అతికష్టం మీద ఆమె పూర్తి చేసింది.

"తొమ్మిదీ అయినయి... ఇక కూర్చుందామా?" అడిగాడు ఆమెకు అతిదగ్గరిగా వచ్చి మూర్తి.

"ఊс..." పెద్దగా గర్జిస్తున్నట్లుగా అని ముందుకే అడుగులు వేయసాగింది.

అక్కడ ఉన్న జనమంతా అమెనే చూస్తున్నారు. కొందరయితే ఆమె వెనకాలే "ఓం... ఓం..." అంటూ నడుస్తున్నారు.

పది పూర్తయింది. ఆమె బాగా తూలిపోతున్నది.

ఆమె ఆగలేదు. ముందుకే వెళ్ళిపోతున్నది. అటూయిటూ వాలిపోతున్నది... నేలమీద కుప్పలా ఏ క్షణాననైనా పడిపోవచ్చు అన్నట్లుగా ఉన్నది.

చేతిలో మంచినీళ్ళగ్లాసుతో ఆమెకు అతి దగ్గరగా నడుస్తున్నాడు మూర్తి.

ఎవరో అన్నారు. "ఆమెను పట్టుకు నడిపించగూడదూ!" అంటూ.

మూర్తి క్షణం తటపటాయించినా, తన చేతిలోని మంచినీళ్ళగ్లాసును, పక్కనున్న వారికి ఇచ్చి, చటుక్కున ఆమెను రెండు చేతులతో పట్టుకున్నాడు... ఒక్కక్షణం ఆలస్యం చేసినా ఆమె ఆ రాతి బండలమీద తూలి  పడిపోయేదే...

మూర్తి ఆమె చెవిదగ్గరా నోరు జేర్చి, "చాలండి... కూర్చుందాం మనం!"

అన్నాడు అనునయంగా.

అతడు పట్టుకోవటంతో ఆమెలో ఏదో విద్యుత్‌ప్రసరించనట్లయి, ఉలిక్కిపడింది.

బరువుగా మూసుకుపోతున్న తన కను రెప్పలను తెరవ ప్రయత్నించింది. మెడ ఎత్తి మూర్తినే చూస్తూ అతడి చేతిని గట్టిగా పట్టుకుని అడుగులు వేయసాగింది. ఆమె శరీరమంతా స్వేదంతో తడిసిముద్దయింది. స్మృతినే పూర్తిగా కోల్పోయిన ఆమె, బాహ్య ప్రపంచంలోకి చిన్నగా రాసాగింది.

పదకొండో ప్రదక్షిణం పూర్తయ్యేటప్పటికి ఆమె పూర్తిగా కోలుకున్నది. ఆమె నోటినుండి పెద్దగా వెలువడుతున్న ఓంకారనాదం... ఎవ్వరికీ వినబడనంత చిన్నదయి మనస్సులోనే గింగిరాలు తిరుగుతున్నది.

మంచినీళ్ళ గ్లాసు అందుకొని, “కాసిని త్రాగండి!” అన్నాడు ఆమెకిస్తూ.

అప్పుడు తలెత్తి అన్ని వైపులా చూచింది. తనని చూస్తున్న జనాన్ని చూసింది. గర్భగుడిలోనుంచి బయటకు వచ్చి తననే వింతగా చూస్తున్న పూజారిని చూసింది.

ఆమె కళ్ళు వాలిపోయినయి. ఆమె ముఖం సిగ్గుతో ఎర్రబడింది.

ఆమె చటుక్కున, అంతవరకూ పట్టుకున్న మూర్తి చేతిని వదిలేసి, దూరంగా జరిగింది. ఆమెకు చాలా నీరసంగా వున్నది. శరీరంలోని శక్తినంతా ఎవరో గుంజివేసినట్లుగా గిలగిలలాడుతోంది. కళ్ళు తిరుగుతున్నట్లు అనిపించగా చేయిజాచి తిరిగి మూర్తి చేతిని ఆసరాగా తీసుకున్నది

పూజారి ముందుకు వచ్చి, “రామ్మా! మాకెవ్వరికీ దొరకని అదృష్టం నీకు లభించిందమ్మా... స్వామి సాక్షాత్కారాన్ని పొందగలిగావు...!” అన్నారు ఆయన వెనక్కు తిరుగుతూ.

తిరిగి ఇద్దరూ గుడిలోకి నడిచారు. అక్కడున్న అందరూ పక్కకు తప్పుకొని దారి ఇచ్చారు.

పూజారిగారు వాళ్ళిద్దరి నుదుటను సిందూరం పెట్టి, స్వామికి హారతిచ్చారు.

ఇద్దరికీ పూలదండలిచ్చి, కొబ్బరి చిప్పల ప్రసాదమిచ్చారు.

బయటకు వస్తుంటే, కొందరు స్పందన కాళ్ళకు నమస్కరించబోగా, నివారించింది పక్కకు తప్పుకుంటూ.

“దేవాలయప్రాంగణంలో ఎవరూ ఎవరికీ దణ్ణం పెట్టకూడదు... ఒక్క ఆ స్వామికి తప్ప!” చాలా చిన్నగానే అయినా స్పష్టంగా అన్నది.

ఇద్దరూ ఎదురుగ్గా వున్న మంటపంలో కూర్చున్నారు. ఆమె పూర్తిగా కోలుకున్నది.

మూర్తి వెళ్ళి రెండు ఆకుల్లో ప్రసాదం తీసుకురాగా, ఇద్దరూ చెరో ఆకు ముందు పెట్టుకున్నారు.

“మూర్తిగారూ! మీరెప్పుడైనా ఈ వేప చెట్టు ఆకులు తిన్నారా? ఎడం వైపు ఆకు చప్పగా వుంటుంది... కుడివైపు ఆకు కటిక చేదుగా వుంటుంది... మరి ఒకే చెట్టు... ఎలా అయిందంటారు అది!” అన్నది ఆ చెట్టు వంకే చూస్తూ.

“అదీ జీవమున్నదే... మనిషిలో వివిధ గుణాలున్నట్లే దానిలో కూడా... దేఁవుడి లీలల్లో ఇదొకటి!” అన్నాడు మూర్తి.

తరువాత పావుగంటకు ఇద్దరూ కారు దగ్గరకు వచ్చారు.

స్పందన వెనుక తలుపు తెరిచి ఉంచి, “ఎక్కండి!” అన్నది.

ఇబ్బందిగా ఆమె వంక చూచాడు మూర్తి. “ముందు హాయిగానే వున్నదిగదా... అక్కడ కూర్చుంటాలేండి!”

“ఫర్వాలేదు... ఎక్కండి... మాట్లాడుకుంటూ కూర్చోవచ్చు!”

మొహమాట పడుతూనే ఎక్కి, దూరంగా జరిగి తలుపు వారగా కూర్చున్నాడు మూర్తి. అతడికెందుకో ఈరోజు స్పందన ప్రవర్తన చాలా వింతగా తోస్తున్నది. తన ఇన్ని సంవత్సరాల పరిచయంలో ఆమె ఇవాళ్టిలా ఎన్నడూ ప్రవర్తించలేదు. ఆమె

ఎక్కి కూర్చొని తలుపు మూయగానే కారు బయల్దేరింది.

అయిదు నిముషాలదాకా ఎవరూ మాట్లాడలేదు.

ఆమె సమస్య ఎలా పరిష్కారమయిందో తెలుసుకోవాలని అతడికున్నా, సభ్యత కాదని ఊరుకున్నాడు. అవసరమున్నప్పుడే మాట్లాడాలనేది అతడి నైజం.

"మన ఆలోచనలను బట్టే మన భవిష్యత్తు ఉంటుందని మీరు అంగీకరిస్తారా?" ఉన్నట్లుండి అడిగింది స్పందన.

అటూ యిటూ చెట్లు... ఎక్కడా ఇళ్ళు కనబడటంలేదు... అంతా రాతినేల... అక్కడక్కడా వేసిన మెట్టపైర్లు...

"చీకటి తరువాత తూర్పునుంచి విచ్చుకుంటూ వస్తున్న కాంతి రేఖల్లా ... వేడి కొలిమిలో భగభగ మండే మంటల తరువాత ఏర్పడే చల్లదనంలా... అన్నార్తుడికి గంజిగిన్నె ఒళ్ళో వచ్చి వాలినట్లుగా... ఎండిపోతున్న చెట్టుకు చిగుర్లు వేసినట్లుగా... ఎంతో ఆత్మీయుడు కొన్ని సంవత్సరాల ఎడబాటు తరువాత అకస్మాత్తుగా కనబడి ఆశ్చర్యపరిచినట్లుగా... కదిలీ కదలని చెట్ల అకుల చల్లటిగాలి మేను పులకరింప జేస్తున్నట్లుగా ఉన్నది నాకీ రోజు... వాటినన్నిటినీ నేను శాశ్వతంగా అనుభవించగలనా లేదా అనేది, ఈ చేయిగాని చెప్పలేదు..." ఆమె చటుక్కున అతడి చేతిని పట్టుకొని తన వైపుకు లాక్కుంటూ అతడి దరికి జేరింది తలవంచుకునే.

బిత్తరపోయాడు మూర్తి. అతడి శరీరమంతా బిగుసుకుపోయింది.

"మీ నీడలో నడిస్తే నాకు ఆనందంగా వుంటుందీ అనుకున్నాను... ఆంజనేయస్వామిని అడిగాను నన్ను అలా నడవమంటారా వద్దా అని... ఆయన అంగీకరించటం మీరు చూడనే చూశారు... మీరు అంగీకరిస్తే మీ ఈ చేయి ఎప్పుడూ నా చేతిలోనే వుంటుంది... ఉఁహూఁ... అలా అనను... అంత అహం నాకు పనికిరాదు... ఎప్పుడూ నా చేయి మీచేతిలోనే ఉంటుంది!" ఆమె కళ్ళుమూసుకున్నది– ఈ ప్రపంచంలో తనకింకేమీ అక్కర్లేదన్నట్లుగా. "నేనెంతో ఆత్మ విశ్వాసంతో ఈ

అడుగు వేస్తున్నాను... నన్ను విజయం వరిస్తుందనే నమ్మకం నాకున్నది!"

మూర్తికి నోరు పెగలటంలేదు. ఆమె తనదయితే ఎంతో ఆనందమనేది అతడి అంతరంగ భావనే అయినా, ఇన్నాళ్ళూ ఆమె తనని అంగీకరిస్తుందా లేదా అనే ద్వైదీభావనతో కొట్టుమిట్టాడుతూ ముభావంగా ఉండిపోయాడు.

ఈనాడు నిజంగా అదృష్టం స్పందన రూపంలో తన ఒళ్ళో వాలుతున్నది.

"రొటీన్ మాటలు వద్దు... ఇష్టమా, లేదా అనేదే చెప్పండి... మీకు అంగీకారం కాకపోయినా మన స్నేహానికి అది అడ్డంకి కాదు... మీ మీద నాకు గౌరవం ఏ మాత్రం తరగదు... ఈ క్షణాననే నా ఆలోచనలను, ఆశలను కాల్చి బూడిదచేసి, నేను ఎప్పటిలాగానే మామూలుగా మీతో ప్రవర్తిస్తాను... ఇక్కడ అదృష్టం దురదృష్టం అనేవి రెండు లేవు... అవి మన అభిప్రాయాలే... దేవుడి చూపిన బాటలోనే మనం నడవాలి... మన బాటను మనం నిర్మించుకుంటాం అనేది మిథ్య!" స్పందనే అన్నది. ఆమె చాలా ఆవేశంలో ఉన్నది. ఇంకా మూర్తి చేయి అమె చేతిలోనే, ఆమె ఒళ్ళోనే ఉన్నది... ఆమె శరీరమంతా సన్నగా ఒణుకుతున్నది.

అతడు నోరు విప్పలేకపోతున్నాడు.

"మీకు ఆలోచించుకోవటానికి సమయంకావాలీ అంటే తీసుకోండి... త్వరపడి ఎవరూ ఏ నిర్ణయమూ తీసుకోగూడదు!"

"మీరే అన్నారు గదా... దారి దేవుడే ఏర్పరుస్తాడని... ఇక ఆలోచించేదేమున్నది ... దేవుడి నిర్ణయాన్ని కాదని నేనెలా అనగలను!" మొట్టమొదటి సారిగా నోరు తెరిచాడు మూర్తి. మాటలు ఆనందంతో తడిసి ముద్దముద్దగా వెలువడుతున్నాయి అతడి నోటినుండి.

"నాకు డొంకతిరుగుడు సమాధానాలు వద్దు... ఇష్టమా, లేదా?"

"మీ నాన్నగారి ఉద్దేశ్యం ఇది కాకపోవచ్చు!"

"మన మధ్యకు ఎవ్వరినీ తీసుకురావద్దు... నేను నాలుగురోడ్ల కూడలిలో

ఉన్నాను అని చెప్పాను... ఏ దారిలో వెళ్ళమంటాడో కనుక్కోవటానికే ఇప్పుడు ఇక్కడికి వచ్చింది... మీ వెంట నా భవిష్యత్తు బాగుంటుందనేది ఆయన చెప్పిన జవాబు... నా నిర్ణయానికి ఎవరి అండదండలూ అక్కర్లేదు... మీకు కావాలీ అనుకుంటే మీరు ఎవరినైనా సంప్రదించుకోండి.... మీరు సమాధానం చెప్పిందాకా నేను ఆగుతాను!" అంటూనే చటుక్కున ముందుకు వంగి, డ్రైవర్‌తో, "మనమిప్పుడు ఉరుకుంద ఈరన్నస్వామి గుడికి వెళ్ళాలి... ఎటువెళ్ళాలో చూసుకొని వెళ్ళు!" అన్నది.

నరసింహస్వామి గుడిముందు ఇద్దరూ దిగారు. వారి మధ్య మాటలే కరువైనట్లుగా మౌనంగా ఉండిపోయారు.

"జనం చాలా మంది ఉన్నారు... ఆలస్యమవుతుందేమో... ప్రత్యేక దర్శనానికి టిక్కెట్లు తీసుకోండి!"

ఇద్దరూ లోపలకు వెళ్ళారు.

"మనమిద్దరం చేతులు పట్టుకుని మూడుసార్లు ప్రదక్షిణం చేస్తే బాగుంటుందనుకుంటున్నాను!" అన్నాడు తలవంచుకొని మూర్తి.

ఆమె ఆనందంతో ఎగిరిపడుతూ ఆతడి చేతిని చాలాగట్టిగా, ఎర్రటి ఆ చేయి కంది మరింత ఎర్రబడుతుందేమో అన్నంత గట్టిగా, పట్టుకున్నది స్పందన.

పదిగంటలకు గుడినుంచి బయటకు వచ్చి ఇంటి ముఖం పట్టారు.

తరువాత తిరిగి ఇద్దరూ మాట్లాడుకోలేదు. ఇద్దరి ముఖాలు కాంతితో వెలిగిపోతున్నయి. తృప్తితో తడిసిపోతున్నాయి.

కారు ఆదోనిలోకి వస్తుండగా, "మీరు మన ఈ నిర్ణయాన్ని మీ అమ్మగారికి ఇప్పుడప్పుడే చెప్పవద్దు... మన వివాహం ఇంకా ఎనిమిదినెలల తరువాతగానీ కాదు... అప్పటికి అమ్మ పోయి సంవత్సరమవుతుంది... ఎనిమిది నెలలు అంటే చాలా ఎక్కువ కాలమే... అనుకోని పరిస్థితులలో మన చేతులు కలిపిన ఆ దేవుడే విడదీస్తే, అనారోగ్యంతో ఉన్న ఆమె మరింతగా కృంగిపోవచ్చు... అలాంటి పరిస్థితి ఆమెకు

కలిగించటం నాకిష్టంలేదు!" అన్నది స్పందన.

కారు వచ్చి ఇంటిముందు ఆగింది.

"కాఫీ త్రాగి స్కూలుకు వెళుదురుగాని రండి... బహుశః మాణిక్యం టిఫెన్‌గూడా చేసి వుండవచ్చు!"

కారులోనుంచి చెరో వైపూ తలుపూ తీసుకుని దిగారు.

గేటు తీసుకొని లోపలకు వస్తూ వరండాలోకి చూస్తూనే ఇద్దరూ ఉలిక్కిపడ్డారు.

– అక్కడ ప్రతాప్ కుర్చీ వేసుకుని కూర్చొని ఉన్నాడు. అతడి ముఖం ఎర్రగా కంది ఉన్నది!

* * *

వాళ్ళను చూస్తూనే లేచి నిలబడ్డాడు ప్రతాప్. తన అసహనాన్ని అదుపులో పెట్టుకుంటూ.

"మీరు అప్పుడే వెళ్ళారట...ఒక్క పావుగంట ముందు నేను వచ్చి వున్నట్లయితే, మీతోపాటు నేనూ వచ్చి ఉండేవాడిని... అదృష్టం లేదు!" అన్నాడు మూర్తి చేతిని పట్టుకుంటూ.

'మా అదృష్టం' అనుకుంటూ అతడి పక్కగా లోపలకు వెళ్ళిపోయింది స్పందన.

"నెలరోజులయింది మా మేనగోడల్ని చూసి... అక్కయ్య ఒకటే గోల... అమ్మాయి అక్కడ ఒక్కతే ఎలా ఉందోనని... సరే నేను చూసివస్తాలే అంటూ పనులన్నీ వదిలేసుకొని రాత్రి బయల్దేరాను... మా అక్క తంతు చూస్తుంటే ప్రతి శనివారం రాత్రీ నన్ను ఆదోని బస్సు ఎక్కించేలా వున్నది... తిరిగి సోమవారం ఉదయం గనుక అక్కడ ఉండకపోతే మా బావ చెమ్డాలొలుస్తాడు... ఇదీ నా పరిస్థితి!" పెద్దగా అంటూ పకపకా నవ్వాడు.

బుడుములదొడ్డి ఆంజనేయస్వామి దగ్గరకు వెళ్ళివచ్చిన ఆనందమంతా ఆవిరయిపోయింది, అతడి మాటలు వింటుంటే స్పందనకు.

ఇద్దరినీ లోపలకు రమ్మనమని, టిఫెన్ తెచ్చిపెట్టింది.

"స్పందనా! నా టిఫెన్ అయిపోయింది... మీ ఇద్దరే తినాల్సింది... ఏమిటి మీ పిన్నికి నువ్వు ఫోనే చేయటం లేదట... ఆమె ఒకటే ఇదయిపోతున్నది... ముందొచ్చిన తోకకంటే వెనకొచ్చిన కొమ్ములు వాడని... ఇప్పుడు ఆవిడగారికి నేను కనబడటంలేదు... అంతా నీ నామస్మరణే!"

ఆ ఇంట్లో ఎవరికీ నిజాలు మాట్లాడే అలవాటు లేదా అనిపిస్తుంది అతడి మాటలు వింటుంటే స్పందనకు. మొన్న తండ్రి ఇక్కడకు వచ్చినప్పుడు, ఆయన మాటల్నిబట్టి అక్కడ పరిస్థితి ఏమిటో తను అర్థం చేసుకున్నది కనుక, అతడి మాటలు నమ్మాలనిపించటం లేదు.

ఆమెకు తెలియని మరో విషయం గూడా ఉన్నది...

ఆయన ఇక్కడనుంచి వెళ్ళి, ఇంట్లో కాలు పెట్టిన గంటలోనే అక్కడ ఓ రామరావణ యుద్ధం జరిగిందనేది.

"ఇంతకీ మీ కూతుర్ని అసలు విషయం అడిగారా?" అన్నది వసుంధర.

"అసలు విషయమంటే?" అమాయకంగా ముఖం పెట్టి అన్నాడు జగన్నాథం ఆమె ప్రశ్న అర్థమయినా.

ఆమె గయ్యిన లేచింది. "ఆవిడగారు మా తమ్ముడిని చేసుకుంటుందటనా, లేదా? అదే నేను అడగమన్నది!"

"నేను అడగలేదు!"

"మరి ఎందుకు వెళ్ళినట్టు... వెళ్ళేముందు నేను చిలక్కి చెప్పినట్లు చెప్పి పంపించాను! అసలే ఆవిడగారికి టెక్కు జాస్తీ... ఎనిమిదివేలు దండగబెట్టి కొన్న చీరె కట్టుకోవటానికే నీలిగింది!" అన్నది ఈసడింపుగా వసుంధర.

"అసహ్యంగా మాట్లాడబోకు... ఎందుకు కట్టుకోలేదో చెప్పిందిగదా... ఇంకా

దాన్ని పీకుతావెందుకు... ఆమాత్రం అర్థం చేసుకోలేకపోతే ఎలా?"

"అనండి... అనండి... నా మాటలు అసహ్యంగానే ఉంటయి... నా మట్టిబుర్రకు ఏదీ అర్థం కాదు... మీ అంత, మీ కూతురంతా తెలివిగలదాన్నయితే ఇలా ఏడుస్తూ ఎందుకుంటాను, వాళ్ళమీదా వీళ్ళ మీదా ఆధారపడి!" ఆమె కంటివెంట నీరు కారుస్తూ అన్నది.

"వసూ! నేనేం చెప్పాను... ఆ అమ్మాయికి, మనమూ, మనిల్లూ కొత్త... ఇప్పుడప్పుడే పెళ్ళి పెళ్ళంటూ సతాయించవద్దన్నాను... తల్లి పోయి సంవత్సరం దాటితేనేగాని ఎలాగూ పెళ్ళి చేయటానికి వీల్లేదు... ఈలోగా చిన్నగా మాలిమి చేసుకొని ఆ అమ్మాయికి నచ్చజెప్పి, దాని ఉద్దేశ్యాలు ఎలా ఉన్నా మన దారికి తెచ్చుకోవాలి... అంతేగాని, తొందర పడితే పనులు అవుతాయా?"

"నిజమేనయ్యా! ఆవిడ చచ్చిన సంవత్సరంలోగా ఈవిడను చేసుకోమని బుద్ధున్న వాడెవ్వడూ చెప్పడు... నేను అడిగేది అది కాదు... అసలు వీడిని చేసుకుంటుందో లేదో కనుక్కోమన్నాను... సరేనంటే సంవత్సరం కాకపోతే రెండు సంవత్సరాలు ఆగుతాడు... కాదంటే మాత్రం ఆవిడ నా ఇంట కాలుపెట్టటానికి వీల్లేదు... ముందే చెబుతున్నాను... వాడు అంతగా ఇష్టపడుతున్నాడు కాబట్టే నేను ఇంతగా ఏడుస్తున్నది... మన మాట వినని దానికి, మన ఆస్తంతా ఎందుకు ఇవ్వాలిట... మొన్న వచ్చినప్పుడు మీరు చెప్పారని, మూడు వరసల చంద్రహారం మెళ్ళో వేశాను... స్వంత తల్లయినా ఇవ్వదు అలా... మా శ్యామలకు అలాంటి ఆశలేం చూపకపోయినా, మా అక్క దాన్ని వీడికివ్వాలని ఎంతగానో ఉవ్విళ్ళూరుతున్నది!"

"మీ అక్క ఉవ్విళ్ళూరుతుండవచ్చు... కానీ, ఆ శ్యామల ఏమనుకుంటున్నదో కనుక్కున్నావా?"

"మా అక్క పిల్లలు నీ కూతురులాంటి పిల్లలు కాదు... మా అక్క పెంపకమే వేరు... వాళ్ళు పెద్దవాళ్ళు గీచిన గీటు దాటరు!" అన్నది విసురుగా.

"మంచిదే అలాగే చేయి! దానికి సంవత్సరం దాకా ఆగటం దేనికి... ఇప్పుడే

చేసేయవచ్చు... ఎలాగూ నువ్వు నా కూతుర్ని ఇక్కడకు రానీయనంటున్నావు గదా... మా అన్నయ్య కొడుకును దత్తు తెచ్చుకుందాం... దాంతో నీ కోరికా, నా కోరికా తీరతయి... వాళ్ళూ సంతోషపడతారు... దానికేం... అక్కడ దర్జాగా వున్నది... మన బోడిఆస్తి కోసరం అదేం నోరుతెరుచుకు చూడటం లేదు!" అన్నాడు ఆయనా గొంతుపెంచి.

ప్రతాప్ వాళ్ళిద్దరి నడుమకూ విసురుగా వచ్చాడు. "ముసలాళ్ళిద్దరూ నోరు మూసుకు పడివుంటే మంచిది... స్పందనను ఎలాగైనా సరే నేను పెళ్ళి చేసుకుంటాను... అదెవతె కాదనేటందుకు... కాదంటే నాలుగుతన్నయినా మెళ్ళో తాళిగట్టి తీసుకు వచ్చి ఇక్కడ పడేస్తాను... శ్యామలనేం బ్రతిమలాడనక్కర్లేదు... ఎమ్‌సీఏ చేశానని మహా పొగరు... ఆయనగారు తన అన్న కొడుకునూ ఈ కొంపకు తీసుకు రానక్కర్లేదు... స్వంత కూతురును పెట్టుకొని ఊళ్ళో వాళ్ళను పట్టుకు వేలాడటం దేనికి.... మీరు అనవసరంగా పిచ్చి పిచ్చి వేషాలు వేస్తే మాత్రం.... ఈ ఇల్లూ ఉండదు, మీరూ ఉండరు... నయానో, భయానో దాన్ని పెళ్ళి చేసుకుండేదాకా నేను ప్రతి శనివారం ఆదోని వెళుతునే వుంటాను... దాన్ని నాదారిలోకి ఎలా తెచ్చుకోవాలో నాకు బాగా తెలుసు... ఒక్కటి గుర్తుంచుకోండి... అది నా పెళ్ళాం కాకపోతే మాత్రం ఎవ్వరికీ పెళ్ళాం కాలేదు... ఊరికినే మీరు హైరానపడి, ఇల్లును రొచ్చుగుంటలా చేయబోకండి!" అన్నాడు అక్కా, బావలమీద ఎగిరెగిరిపడుతూ.

దాని ప్రభావమే అతడు ఆదివారం పొద్దున్నే ఇక్కడకు రావటం...

మూర్తి లేచాడు.

"మీ స్టూడెంట్స్ క్రికెట్ ఆడుతున్నట్లున్నారు గదా... పదండి, నేనూ వస్తాను!" అంటూ అతని వెంటనడిచాడు ప్రతాప్.

స్పందనకు అతడి రాకే చికాకు కలిగిస్తోంది. ఆపైన మూర్తితో గ్రౌండ్‌కు వెళుతున్నాడూ అంటే అక్కడ పిచ్చిగా ఏం వాగుతాడోనని భయపడింది.

పన్నెండు గంటలవుతుండగా గుప్తాగారు వచ్చారు. ఆయన్ను చూస్తూనే

సంతోషంగా ఆహ్వానించింది స్పందన.

"పెద్దవారు మీరు రావాలా... కబురు చేస్తే నేనే వచ్చేదాన్ని కదా!" అన్నది మర్యాదగా.

"ఎవరొచ్చినా ఒకటేనమ్మా... పనికావాలి... ఇవ్వాళ ఆదివారం కదా!" అన్నాడు ఆయన సోఫాలో కూర్చుంటూ. "ప్లాను గీయించాను... నీకు ఒక్కసారి చూపించి, బాగుందనుకుంటే అప్రువల్‌కు ఇద్దామని!"

"అవన్నీ తరువాత... మీరు మాయింటికి రావటం ఇదే ప్రథమం... టిఫెన్ చేస్తాను... తింటూ మాట్లాడుకోవచ్చు!" అన్నది హడావుడి పడుతూ.

ఆయన నవ్వుతూ, "డాక్టర్లు నాకు లక్ష నిషేధాలు విధించారు... నేను మంచి నీళ్ళు తప్ప ఏమీ పుచ్చుకోను... అవిగూడా ఇదుగో నా చేతిలో ఉన్న ఈ సీసాలోవే త్రాగుతాను... నువ్వు అలా కూర్చో!"

మాణిక్యాన్ని పిలిచి మూర్తిగారి కోసరం కబురు చేసింది స్పందన. తరువాత అయిదునిముషాలల్లోనే మూర్తి వచ్చాడు. ఆయన వెనగ్గా వున్న ప్రతాప్‌ను చూస్తూనే ముఖం చిట్లించింది స్పందన.

గుప్తాగారు కళావేదికకు గీయించిన ప్లానును టీపాయ్ మీద పరిచి, దాంట్లో ఒక్కొక్క భాగం చూపిస్తూ వివరించాడు. స్పందన కోరినట్లుగా తల్లి పేరుమీద నిర్మించబోయే ధ్యానమందిరం ఆమెకెంతో తృప్తినిచ్చింది. అదీ విశాలంగానే ఉన్నది, ఆ మినీహాల్లో వందమంది దాకా కూర్చోవచ్చు. దాన్ని చూస్తుంటే ఆమెకు మరో ఆలోచనగూడా వచ్చింది. అందులో ఓ పక్కగా నాలుగు బీరువాలు పెట్టి, భక్తిప్రధానమైన పుస్తకాలు వుంచితే, ఆసక్తి గలవారు వచ్చి చదువుకుంటారు.

"చాలా బాగున్నదండీ!" అన్నారు స్పందనా, మూర్తీ ఒకేసారి.

"మొత్తం ఎంత యేరియా వుంటుంది?" అడిగాడు ప్రతాప్.

"హాలు వరండాతో కలిపి పదిహేను వేల అడుగులు వుంటుంది... అందులో

ధ్యానమందిరం ఫస్ట్ ఫ్లోర్‌లో రెండు వేల అడుగులు!” అన్నాడు గుప్తాగారు.

“ప్లాను ప్రకారం ఎస్టిమేట్ ఎంతవుతుంది!”

“ఇంకా ఫర్నిచరూ, డెకరేషనూ ఆలోచించలేదు... కనస్ట్రక్షన్‌కే యాభై లక్షలు దాటుతుందనుకుంటున్నాను... మెటీరియల్ కాస్ట్ రోజు రోజుకూ విపరీతంగా పెరిగిపోతోంది... ఇప్పుడే ఖచ్చితంగా ఇంతవుతుందని చెప్పలేం!”

“అంటే సైట్ కాస్ట్‌తో కలిపా?” అన్నాడు ప్రతాప్ కాస్త ముందుకు వంగి ఆసక్తిగా.

అతడి ప్రశ్నకు అక్కడున్న అందరూ ఒక్కసారిగా ఉలిక్కిపడ్డట్లుగా అతడి వంక చూశారు.

స్పందనయితే తడబడుతూ, “అదేం లేదు... అదేం లేదు... స్థలానికి ఖరీదంటూ ఏమీలేదు... నలుగురుకీ ఉపయోగపడేది, మన స్కూలు ఆవరణలో వుంటే మనకూ కీర్తే!” అన్నది చికాగ్గా ప్రతాప్ వైపుకు చూస్తూ.

గుప్తాగారు లేచారు. “మిగతా పేపర్సన్నీ తయారు చేయిస్తాను... మీరు సంతకాలు పెట్టవలసి వుంటుంది... మున్సిపాలిటీకి సబ్‌మిట్ చేసేముందు!” అన్నారు ఆయన.

“తప్పకుండా... రెడీకాగానే ఫోను చేయండి... నేనూ, మూర్తిగారూ వస్తాం... సంతకాలు పెట్టి వెళతాను!” కావాలనే మూర్తిగారిని గూడా తీసుకు వస్తానన్నట్లుగా అన్నది.

ప్రతాప్‌కు ఆ మాట వింటూనే చిర్రెత్తుకొచ్చింది. ‘మూర్తిని కత్తిరించకపోతే తనకిక్కడ ప్రాధాన్యత లభించేలా లేదు’ అనుకున్నాడు కసిగా మనస్సులోనే.

గుప్తాగారు వెళ్ళిపోయిం తరువాత మూర్తి స్కూలుకు వెళ్ళాడు.

వాళ్ళను పంపి, స్పందన లోపలకు వస్తుండగానే, ప్రతాప్ గొంతు పెంచి, “పదిహేను వేల అడుగులు అంటే షుమారుగా పదిహేడు వందల గజాలు... అంత స్థలం ఊరికినే వస్తుందా... ముప్ఫయి లక్షల పైనే ఉంటుంది... దానం ఇచ్చేయటమేనా,

తెలివి తక్కువగా... అసలు నాన్నకు చెప్పావా ఆ విషయం?" అడిగాడు ఆమెను చూస్తూనే.

విచిత్రంగా అతడి వంక చూసింది. "చూడండి ప్రతాప్‌గారూ! మొదటిగా మనం నేర్చుకోవాల్సింది మనకు కాని విషయాలల్లో కల్పించుకోకపోవటం... మనను అడగందే, ఎవ్వరికీ ఉచిత సలహాలివ్వకపోవటం!" అన్నది చాలా సౌమ్యంగా.

"అంటే నీ ఉద్దేశ్యమేమిటి?... నేను తప్పుగా మాట్లాడాననా?"

"ఖచ్చితంగా!"

"నాకు ఇన్ని చెబుతున్నావు... నువ్వు చేస్తున్న పనేమిటి... పెద్దవాడు నాన్నకు చెప్పకుండా ఏదైనా చేసేయటమేనా... ఆపైన, ఆయన కాగితాలు తయారు చేస్తాను, సంతకాలు పెట్టమంటుంటే, లాయరు సలహా తీసుకోనక్కరలేదా?... రేపు ముందు ముందు ఎన్ని ఇబ్బందులు వస్తయ్యో నీకేమైనా తెలుసా!"

స్పందన నిశితంగా అతడినే చూస్తూ, "ఒక్క మాట చెప్పండి.... ఈ విషయంలో నాన్నను సంప్రదించవలసిన అవసరమేమున్నది... నేను ఆయనిచ్చిన ఆస్తినేమీ ఎవరికీ ధారాదత్తం చేయటంలేదే... ఇది మా అమ్మ సంపాదన... ఆమె బ్రతికి వుండగా దీన్ని ఆమోదించింది... అంతకు మించిన అనుమతి ఎవ్వరి దగ్గరా తీసుకోవల్సిన అవసరం నాకు లేదు!" అన్నది నిక్కచ్చిగా.

"అంటే తండ్రన్నా గౌరవం లేదన్నమాట!"

"నేనా మాట అనలేదు... ఊరికినే ఊహించి ప్రతిదాన్నీ చిలువలు పలువలు చేయబోకండి... బాగుండదు!" ఈసడింపుగా అని, లోపలకు వెళ్ళిపోయింది.

అక్కడే పళ్ళు నూరుతూ చాలా సేపు నిలుచున్నాడు ప్రతాప్.

తిరిగి రాత్రి హైద్రాబాద్ వెళ్ళే బస్సు ఎక్కేటంతవరకూ అతడు మాట్లాడలేదు ఆమెతో, మనస్సు ఆమె మీద కోపంతో కుతకుతలాడుతున్నా.

సంచీ పట్టుకుని బయల్దేరుతూ, "మీ పిన్ని నువ్వు ఎప్పుడు హైద్రాబాద్ వస్తావో కనుక్కోమన్నది!" అన్నాడు.

"స్కూలుకు ఎండాకాలం శెలవలిచ్చిందాకా ఎక్కడికీ వెళ్ళే ప్రసక్తే లేదు!"

"అయితే ఆమే రావాలన్నమాట, నిన్ను చూడాలంటే!"

"నన్ను చూడాలనుకుంటే, మరి తప్పదు!"

అతడు రోడ్డు మీదకు వెళ్ళిపోయాడు విసురుగా.

* * *

తరువాత శనివారం రాత్రినుంచే స్పందనకు భయం పట్టుకున్నది– తెల్లవారేటప్పటికి ప్రతాప్ ఎక్కడ తయారవుతాడోనని.

ఆ ఆలోచనలతోటే తెల్లవారుజామునే మామూలుగా మెళుకువ వచ్చినా మంచం మీదనుంచి లేవటానికి బద్ధకించింది. ఆరవుతున్నా అతడు ఇంకా రాకపోవటంతో లేచి తన పనులను ప్రారంభించింది.

ఎనిమిది అవుతుండగా మూర్తి వచ్చాడు. "ఈరోజు మ్యాచ్‌కి మీరు రావాలి!" అంటూ.

"వీలు చూచుకొని వస్తాను... మన టీంకు మధ్యాహ్నం లంచ్‌కి హోటల్‌నుంచి ఏమైనా తెప్పించండి... ఓ వెయ్యి రూపాయలు ఇస్తాను... క్రికెట్ ఎకౌంట్ క్రింద ఉంచండి!" అంటూ డబ్బు తీసి ఇచ్చింది.

"ఈరోజు ఎమ్ ఎల్ ఏ గారు వచ్చి ప్రారంభిస్తారు... ఆ టైంలో మీరుంటే బాగుంటుంది... అమ్మకు పరిచయమైన ఆయనే... అలాంటి వాళ్ళతో మీరూ ఇక పరిచయాలు పెంచుకోవాలి... ఎప్పుడూ ఏవో అవసరాలు వస్తూనే ఉంటయి... మీరు తొమ్మిదిన్నరకల్లా ఆర్ట్స్ కాలేజి గ్రౌండ్స్‌కు వచ్చేయండి... అంతగా అయితే ఆట ప్రారంభం కాగానే వచ్చేద్దురుగాని!"

అటూ యిటూ చూసింది. కల్యాణిగాని, మాణిక్యంగాని అక్కడలేరు.

మూర్తికి కొద్దిగా దగ్గరకు జరిగి, "నన్ను మీరు ఆత్మీయంగా పిలవలేరా?" అన్నది కళ్ళు సగం వాల్చి.

మూర్తి తడబడ్డాడు. "దేనికైనా సమయం రావాలిగదా... మీరన్నట్లు ఇంకో ఎనిమిది నెలలు ఆ పిలుపుకు ఆగితే మన గౌరవాల్ని మనం కాపాడుకున్నట్లుగా ఉంటుంది!" అంటూనే, ఒక్క క్షణం గూడా అక్కడ ఉండకుండా వెనక్కు తిరిగాడు మూర్తి.

ఆరోజు ఆడిన మ్యాచ్‌లో వాళ్ళ స్కూలు చాలా తేలిగ్గా విజయాన్ని సాధించగలిగింది. అంతేగాదు తరువాత రెండు వారాల్లో గూడా ఆ స్కూలే గెలిచింది. ఇంకా రెండు స్కూళ్ళమీద గెలిస్తే కర్నూలులో జండాపాతవచ్చు.

* * *

రెండో వారం గూడా ప్రతాప్ రాలేదు. మామూలుగానే తండ్రి రెండు రోజులకొకసారి సెల్‌కు ఫోను చేసి మాట్లాడుతున్నాడు.

"నిన్ను చూడాలని ఉన్నది... రావాలన్నా చికాకులు నన్ను కదలనీయటంలేదు!"

'ప్రతాప్ వల్లనా?' అని అడుగుదామని నోటిదాకా వచ్చింది కానీ, నిగ్రహించుకున్నది.

''అవ్వకు లక్షా ఇరవై అయిదువేలు బాకీ వున్నాను... అది ఎలా సమకూర్చుకోవాలా అని ఆలోచిస్తున్నాను!"

"ఏమైనా ఇబ్బందిగా వున్నదా?"

"నేను ఇంతకు ముందు ఇచ్చిన సొమ్మునే దుర్వినియోగం చేశానేమోనన్నట్లుగా మీ పిన్ని భావిస్తున్నది!" అన్నాడు నసుగుతున్నట్లుగా. "దాచి మనస్సు కలుషితం చేసుకోవటం ఇష్టంలేక ఆమెకు నేను చేసింది చెప్పాను!"

"లక్ష్మమ్మ అవ్వ మన్ని ఇబ్బందిపడి ఆమెకు డబ్బు సమకూర్చమని ఎప్పుడూ అడగదు... అంతగా అయితే మిగతా సొమ్మును నేనే ఎప్పుడో సర్దుతాలేండి... తొందరేం లేదు... మీరు దానికోసరం బాధ పడవద్దు!"

"జీవితంలో ఇంతమంది నా వాళ్ళు అంటూ ఉన్నా... నా మనస్సుకు దగ్గరయింది నువ్వొక్కదానివేనమ్మా... నాకు ఇంకెవ్వరూ లేరన్నట్లే అనిపిస్తోంది... నువ్వా నన్ను వచ్చి చూస్తావేమో అనుకుంటే ఆ స్కూలును వదిలి పెట్టి రాలేకపోతున్నావు... నీతో మాట్లాడాల్సిన విషయాలు చాలా ఉన్నయి!" ఆ మాటలు బరువుగా ఉండి ఆయన కంఠం తడుస్తున్నదా అనిపించింది.

కొద్ది క్షణాలు మాట్లాడలేకపోయింది.

"మీరెక్కడనుంచి మాట్లాడుతున్నారు?"

అప్పుడు సమయం ఉదయం పదకొండు గంటలయింది. స్పందన స్కూల్లో తన గదిలో ఒంటరిగా కూర్చుని వున్నది.

"నేను ఆఫీసులో ఉన్నానమ్మా... ప్రతాప్ బయటకు వెళ్ళాడు!"

ఆమె ఆలస్యం చేయకుండా, "మీరు ఇక్కడకు వచ్చేయగూడదూ... కొన్నాళ్ళు ప్రశాంతంగా గడపవచ్చు!" అన్నది.

"దేనిమీదా మమకారం చంపుకోలేనప్పుడే ఈలాంటి పరిస్థితి ఏర్పడేది... నోరు కాలుతుందని వేడివేడి కాఫీ త్రాగకుండా ఉండలేను కదా!" ఆయన నవ్వాడు. ఆ నవ్వు చాలా పేలవంగా ఉన్నట్లనిపించింది.

"నేనూ మీతో కొన్ని విషయాలు ముఖాముఖీ మాట్లాడవలసి ఉన్నది... అవి ఫోన్లమీద కాదు... మనస్సు విప్పి మాట్లాడాలీ అంటే ఆత్మీయులు ఎదురుగా ఉంటేనే వీలవుతుంది... ఒక్కటి గుర్తుంచుకోండి మన జీవితాన్ని మరొకరికి ఉపయోగపడేటట్లుగా మలుచుకోగలిగితేనే మనకు మనశ్శాంతి లభిస్తుంది... 'నేను...నాది' అనే గిరిగీసుకు కూర్చోగూడదు!" ఇక వాళ్ళాడే దాగుడుమూతలకు స్వస్తివాచకం పలకాలన్నట్లుగా

అన్నది. "ఈ విషయంలో ఆలస్యంకూడా అనర్థదాయకమేనేమో!"

"నేను త్వరలోనే వస్తానమ్మా... ముందు ప్రతాప్‌ను అదుపు చేయాలి... అదే నన్ను ఎక్కువగా కృంగదీస్తోంది!" అన్నాడు ఆయన దిగులుగా. బావమరిది ఆలోచనలు ఆయనకు అవగతమయినయి...

– స్పందన మాటలూ, ఆమె ప్రతిదానికీ చెప్పే రూల్సూ వింటుంటే ప్రతాప్‌కు ఆమె తమ వివాహానికి అంత సుముఖంగా ఉన్నట్లు తోచటంలేదు. అదే నిజమయి, తన మాట వినకపోతే బలవంతంగానైనా శారీరకంగా  అనుభవించితే అప్పుడు తను తప్ప మరొకరు దానికి భర్తగా దిక్కుండరు అనే ఒక వికృతమైన కుత్సితపు ఆలోచన అతడిలో ఏర్పడింది.  అంతేకాదు, అందమైన స్పందన తన భార్య అవుతుందనే దానికన్నా, ఆమె  వెనుక ఉన్న ఎంతో విలువైన ఆస్తి తనకు దక్కుతుందనేది అతడి అంతరంగంలోని ప్రధానమైన ఆశ!

అందుకే ఆయన అంతగా బాధ పడుతున్నది– ఇన్ని సంవత్సరాలు ఎక్కడో అక్కడ సుఖంగా ఉన్న తన కూతురు గూడా, రాజేశ్వరిలాగానే తనవలన జీవిత మాధుర్యాన్ని కోల్పోతుందా అని!

* * *

మూడు వారాల తరువాత ఓ శనివారం రాత్రి ఏడుగంటలప్పుడు ప్రతాప్ ఆదోనిలో స్పందన ఇంటికి వచ్చాడు.

గేటు తీసుకుని లోపలకు వస్తున్న అతడిని చూస్తూనే, వరండాలో కూర్చుని చదువుకుంటున్న కల్యాణి క్రచ్ తీసుకుని లేచినిలబడింది. "రండి!" అంటూ లోపలకు నడిచింది. "మంచినీళ్ళు ఇవ్వమంటారా?"

"ఇవ్వు!" అన్నాడు భుజాన ఉన్న సంచీని సోఫా పక్కన పడేసి కూర్చుంటూ.

కల్యాణి వంట ఇంట్లోనుంచి గ్లాసుతో మంచినీళ్ళు తెచ్చి అతడికెదురుగా టీపాయ్ మీద పెట్టింది.

"స్పందన లేదా?"

"అక్క బయటకు వెళ్ళిందండి!"

"ఎక్కడకు వెళ్ళింది?"

"తెలియదు... మూర్తి మాష్టారు వస్తే ఇద్దరూ కలిసి వెళ్ళారు!"

ప్రతాప్‌కు చర్రున కోపమొచ్చింది.

ఈలోగా దొడ్లో పని చేసుకుంటున్న మాణిక్యం లోపలకు వచ్చి, ప్రతాప్‌ను చూస్తూనే, "బాగున్నారా బాబూ! బాబుగారు ఎలా ఉన్నారు?" అని అడిగింది.

"అందరూ బాగానే ఉన్నారుగాని, స్పందన ఎక్కడికి వెళ్ళింది... బాగా చీకటిపడింది!" విసురుగా అన్నాడు.

"తెలియదండి... ఒక్కతే వెళ్ళలేదు లేండి!"

"అదే నేనడుగుతున్నది... రాత్రిపూట పరాయివాళ్ళతో తిరిగితే ఏం బాగుంటుందని!" పెద్దగా అరుస్తున్నట్లే వున్నది ఆ కంఠం.

"పరాయివాళ్ళు ఎవరున్నారండీ ఇక్కడ... మూర్తి మాస్టారు తెలిసినవారే గదా... బహుశః వాళ్ళింటికే వెళ్ళిందేమో... ఆలస్యంగా వస్తానని చెప్పి మరీ వెళ్ళింది!" కసిగా అన్నది కల్యాణి. అక్కను ఎవరన్నా చిన్న మాటన్నా కల్యాణి సహించలేదు.

కల్యాణకి అతడన్నా, అతడి మాటన్నా మంట. ఇంతకు ముందు వచ్చినప్పుడు ఒకటి రెండు సార్లు మాటల్లో తనని కుంటిది, కుంటిది అనటం గుర్తున్నది. అక్కకు గూడా అతడంటే ఏవగింపేనని తెలుసు.

మాణిక్యం వంటయింట్లోకి వెళ్ళిపోయింది.

స్పందన మూర్తితోటి వెళ్ళిందీ అనే విషయం అతడికి బాగా కోపం తెప్పించింది.

– అయినా రాత్రిపూట వాళ్ళిద్దరూ అలా తిరుగుతుంటే నలుగురూ చూసి ఏమనుకుంటారు? అక్కయ్య చెబుతునే వున్నది వాళ్ళని ఒక కంటి కనిపెట్టి

ఉండమంటూ. తనని స్పందన నిర్లక్ష్యం చేయటానికి కారణం మూర్తే అయి వుండవచ్చు. ఇక ఆలస్యం చేయగూడదు. అతడి స్థానమేదో అతడికి చూపించాలి!

ఆపైన తనను ఆవిడగారు పెళ్ళి చేసుకునేటందుకు ఇష్టపడుతున్నదో లేదో తేల్చుకోవాలి వెంటనే. కాదంటే ఏం చేయాలో తనకు తెలుసు. ముసలాయనదేమున్నది, ముణగదీసుకు కూర్చున్నాడు– తొందరపడవద్దంటూ... ఆయనకు తెలిసి చావటంలేదు ఇక్కడ జరుగుతున్న భాగోతం.

తనను కాదన్న తరువాత గూడా ఆయనగారు ఆస్తినంతా ఆమెకే విల్లురాశాడంటే తనూ, తన అక్కయ్యే ఇబ్బందుల్లో పడవలసి వస్తుంది. అందుకే మొక్కగా ఉన్నప్పుడే త్రుంచేస్తే రేపు ఏ ఇబ్బందీ వుండదు.

ఇక్కడ ఈవిడేమో, ఈ కుంటిదాన్నొకదాన్ని నెత్తిన పెట్టుకు పోషిస్తున్నది. లక్షలకు లక్షలు విలువచేసే స్థలాన్ని ఆ గుప్తాకి దానం చేసింది... ఇవన్నీ తెలిసి చేస్తున్నదో తెలియకచేస్తున్నదో అర్థం కావటంలేదు. లేక ఇలా చేయమని మూర్తే సలహా ఇస్తున్నాడో... ఈవిడగారు, ప్రతిదానికీ అతడిమీదే ఆధారపడుతున్నది!

మాణిక్యం కాఫీ తెచ్చి ఇచ్చింది.

"రోజూ ఇట్లాగే రాత్రిళ్ళు ఆయనతోపడి రోడ్ల మీద తిరుగుతుంటందా?" అన్నాడు ప్రతాప్ కోపంగా కల్యాణి వంక చూస్తూ.

అతడి మాట తీరుకు కల్యాణి కోపాన్ని ఆపుకోలేకపోయింది. "తిరిగినా తప్పేమున్నది... చిన్నప్పటినుంచీ తెలిసిన మనిషి... కలసి చదువుకున్నారు...!" అన్నది విసురుగా.

ఇది అతడికి కొత్త విషయం.

"వాళ్ళిద్దరిదీ అంత స్నేహమా?"

"ఎంత స్నేహమో తెలియదుగానీ, స్నేహంగానే ఉంటారు!"

మాణిక్యం కల్యాణిని లోపలకు పిలిచింది– అతడితో అనవసర సంభాషణ పెట్టుకోవద్దని చెప్పటానికి.

కల్యాణి గోడవారగా, క్రచ్‌ని చంకకింద పెట్టుకు నడుస్తూ వంటయింటి వైపుకు వెళ్ళబోయింది.

"ఆగు!" అన్నాడు అరుస్తున్నట్లుగా ప్రతాప్. "మాణిక్యం! నువ్వెళ్ళి ముందు అమ్మగారిని, నేనొచ్చానని చెప్పి పిలుచుకురా!"

మాణిక్యం మాట్లాడలేదు. కల్యాణి వంటింట్లోకి వెళ్ళిపోయింది.

"నీకే చెప్పేది!"

"ఎక్కడికని వెళ్ళి పిలుచుకు రమ్మనమంటారు? వాళ్ళు గుడికి వెళ్ళారో, బజారుకు వెళ్ళారో తెలియదు!" మాణిక్యం సౌమ్యంగానే అన్నది.

"మూర్తింటికి వెళ్ళి అడుగు తెలుస్తుంది!" అన్నాడు విసురుగా– "ఉన్నాడుగా, తైనాతిలా ప్రతిదానికీ తయారవుతాడు!"

కల్యాణి ఆ మాటకు కోపాన్ని నిగ్రహించుకోలేకపోయింది. విసురుగా క్రచ్‌ని టకటకా మ్రోగించుకుంటూ హాల్లోకి వచ్చింది– వెనుక మాణిక్యం వారిస్తున్నా వినకుండా.

"ఏఁవిటి అంటున్నారు... ఆయన తైనాతా... మా తెలుగు మాస్టారంటే గుళ్ళో దేఁవుణ్ణి పూజించినట్లు పూజిస్తారు స్కూల్లో పిల్లలంతా... మీరన్నమాట మరెవరన్నా విన్నారంటే మీరు ఒక్క క్షణం ఇక్కడ ఉండలేరు!" అన్నది కఠినంగా.

"ఏంటే వాగుతున్నావ్ కుంటి ముండా! ఇంట్లో పడి మేస్తున్నది కాక... మాకే ఎదురుతిరుగుతావా... రెండు పీకానంటే వెళ్ళి రోడ్డు మీద పడతావ్!"

మాణిక్యం తలుపు దగ్గర నిల్చొని అతడినే నోరు తెరుచుకు చూస్తున్నది.

"ఏదీ పీకు చూద్దాం... నీ సంగతంతా ప్రభాకర్ చెప్పాడులే నాకు!" అన్నది

కసిగా.

"వాడెవడు... వాడు నీ తైనాతా?" విసురుగా లేచి నిలబడ్డాడు... జారిపోతున్న కళ్ళజోడును ముక్కు మీదకు నెట్టుకుంటూ. "ఏం చెప్పాడే... ఏం చెప్పాడు...ఒళ్ళు కొవ్వెక్కి బలిసి పోతున్నావ్... ఇద్దర్నీ కలిపి పాతేస్తాను!"

"ప్రభాకర్‌ని అప్పుడే మర్చిపోయినావా... మా స్కూలు క్రికెట్ టీం కెప్టెన్.... ఓడిపొమ్మని డబ్బులిచ్చావటగదా మొన్న వచ్చినప్పుడు... వాడు నా క్లాస్‌మేట్... నువ్వు చేసిన ఆ వెధవపని రహస్యంగా నాకు చెప్పాడు... మా స్కూలు పిల్లలకు తెలిసిందంటే నిన్ను పట్టుకొని, నీ జుట్టు తలా గుప్పెడు పీకి నీ చేతిలో పెడతారు... జాగ్రత్త!"

"ఏఁవన్నావ్... మళ్ళా అను... నిన్ను ఇప్పుడే చంపేస్తాను ఎవరడ్డొస్తారో చూస్తాను... బ్రష్టుముండా... ఎవరో కనిపారేస్తే మా యింట్లో పడి కుక్కలా తింటూ నన్నే అంటావా..." అతడు రంకెలేస్తూ ముందుకు వచ్చాడు కల్యాణి గొంతు పట్టుకొని పిసికేయాలన్నంత కోపంగా.

అతడు ఆవేశంతో ఒణికిపోతున్నాడు. కళ్ళు చింతనిప్పుల్లా ఎర్రబడిపోయి వున్నాయి– తన రహస్యం బయట పడిందని తెలియటంతో.

ఇంకో అడుగు వేస్తే చేతి దూరంలోకి వస్తుందనగా, గోడను ఆనుకు నిల్చున్న కల్యాణి మెరుపులా పక్కకు జరిగి, క్రచ్‌ని ఎత్తి అతడి మోకాలు విరిగేలా ఫట్‌మని కొట్టింది.

ఒకే దెబ్బకు అతడు, నరాలన్నీ జివ్వున లాగగా, కుప్పలా నేలమీద పడిపోయాడు "అమ్మా" అని పెద్దగా అరుస్తూ.

సరిగ్గా అతడి వెనకాల మాణిక్యం నిలబడి వున్నది. ఆమె చేతిలో వంటయింట్లో చిన్న రోలులో పచ్చడి నూరుకుండే బండ వున్నది. కల్యాణి ఒక్క క్షణం ఆలస్యం చేసినా ఆ రోకలి బండ అతడి గూడను జార్చివేసేది.

కల్యాణి కొట్టిన దెబ్బకు అతడి కళ్ళు తిరగసాగినయి. అంతా మసకమసకగా కనబడుతున్నది.

అప్పుడే గేటు చప్పుడవుతుండటంతో, వంటయింట్లోకి వెళ్ళి, చేతిలోని బండను రోటి దగ్గర పెట్టి, వెనక్కు వచ్చింది మాణిక్యం.

కల్యాణి ఇంకా గోడకు ఆనుకునే నిల్చొని వున్నది బిగుసుకుపోయి.

స్పందన, మూర్తి వరండా మెట్లెక్కుతుండగానే, మాణిక్యం త్వరత్వరగా ముందుకు వచ్చి, "రండమ్మా తొందరగా... సమయానికి వచ్చారు... చిన్నబాబుగారు వచ్చారు... మెట్లెక్కుతూ జారిపడ్డారు... ఇప్పుడే నీళ్ళు చల్లి ముగ్గేశాను... కాలు జారిందల్లే వున్నది... మోకాలి దగ్గర విరిగిందేమోనని భయంగా వున్నది... లేవలేక పోతున్నారు... నేనే లోపలకు ఎత్తుకొచ్చి కూర్చోపెట్టాను!" అన్నది కంగారు పడుతున్నట్లుగా.

వాళ్ళను చూస్తూనే కల్యాణీ కోలుకున్నది.

వాళ్ళిద్దరూ పరుగెడుతున్నట్లుగా లోపలకు వచ్చారు.

ప్రతాప్ బాధతో కాలుపట్టుకొని మెలికలు తిరిగిపోతూ నేలమీద దొర్లుతున్నాడు. అతడి కంటివెంట, ఆ బాధను భరించలేనట్లుగా, నీళ్ళు కారుతున్నయి. పెద్దగా మూలుగుతూ కేకలు పెడుతున్నాడు.

"ఆటో తీసుకు వస్తారా... ఎవరైనా డాక్టర్ దగ్గరకు తీసుకు వెళ్దాం!" అన్నది స్పందన హడావుడిగా.

"కాలు విరిగుంటుందేమోనమ్మా... ఎక్స్‌రే తీయిస్తే మంచిది!" అన్నది మాణిక్యం పెద్దగానే. "వాకిట్లో లైటు వేసే వుంది... గడప అంచున కాలేసినట్లున్నారు ముందుకు తూలి పడ్డారు... పైమెట్టు అంచుమీదే మోకాలు పడటంతో విరిగి నరాలన్నీ లాగుతున్నట్లున్నయి... పాపం బాధ భరించలేకుండా వున్నారు!" అన్నది సానుభూతిగా.

మాణిక్యాన్ని కల్యాణిని ఉరిమి ఉరిమి చూస్తున్నాడు అంత బాధలోనూ ప్రతాప్.

నిజం చెప్పలేడు... నిజం చెబితే మరిన్ని విషయాలు బయటకొస్తాయి... టీంని ఓడిస్తే మూర్తి ఊపు తగ్గుతుందని ఆశతో ఆ ప్రభాకర్ గాడిని ఒప్పించి డబ్బిచ్చాడు... ఆ దరిద్రుడు ఈ ముండకే చెప్పాలా ఆ విషయం...

మూర్తి హడావుడిగా బయటకు వెళ్ళి పదినిముషాలల్లో ఆటోని తీసుకు వచ్చాడు.

ఆటో అతన్ని లోపలకు పిలిచి, ఒక వైపు అతనూ, మరోవైపు మూర్తీ పట్టుకొని ప్రతాప్‌ను లేపి నిలుచోపెట్టారు.

"డాక్టరు దగ్గరకు వెళ్ళి చూపించుకు రండి!" అన్నది స్పందన.

విసురుగా ఆమె వైపుకు ముఖం తిప్పాడు గాని, ముందుకయితే అడుగు వేయలేకపోయాడు. కాలెత్తినవాడు, 'అమ్మా' అంటూ మళ్ళీ నేలమీదకు జారిపోయాడు బాధతో.

"అక్కా! దెబ్బ తగిలినవైపు చంకకింద నా క్రచ్ పెట్టుకుంటారేమో అడుగు!" అన్నది కసిగా.

పెదవులు బిగించి, కళ్ళు నిప్పులు కురిపిస్తూ ఆ అమ్మాయి వంక చూశాడు ప్రతాప్.

"నేనిప్పుడు ఏ డాక్టరు దగ్గరకూ వెళ్ళను.... ఓ టాక్సీ మాట్లాడండి... దాంట్లో పడుకొని హైద్రాబాద్ వెళ్ళిపోతాను!" అన్నాడు చిరాగ్గా.

"ముందెళ్ళి డాక్టరుకు చూపించుకోండి... ఫ్రాక్చర్‌లేదంటే అలాగే వెళ్ళిపోదురుగాని, పెయిన్ కిల్లర్ ఇంజక్షన్ చేయించుకొని!" అన్నది స్పందన అనునయంగా.

"ఇంజక్షన్ చేయించుకొని అటునుంచి అటే టాక్సీలో వెళ్ళిపోతాను!"

"మీ ఇష్టం... మూర్తిగారూ... ఆయన ఎలా అంటే అలా చేయండి...!" అంటూనే బీరువా తెరిచి, డబ్బు తెచ్చి మూర్తికి ఇస్తూ, "ఇది ఐదు వేలు... ప్రతాప్‌దే....

ప్రభాకర్‌కు ఇచ్చాడటగదా మన టీం ఓడిపోయేలా చూడమని ... అతడు ఆ డబ్బులు తెచ్చి నాకిచ్చాడు... ఇప్పుడు ఇలా మందులకూ, టాక్సీకి ఉపయోగపడుతుందిలేండి!" సౌమ్యంగా అన్నా ఆ మాటల్లో ఎగతాళే ఎక్కువగా ఉన్నది.

ప్రతాప్ ఆమె మాటలు వింటూనే బిగుసుకుపోయాడు. అతడి తల పూర్తిగా వాలిపోయింది. ఇక అక్కడ కూర్చోలేకపోయాడు. వాళ్ళు అతడిని ఎత్తుతుంటే, ఎంత నొప్పిగా వున్నా, సహకరిస్తూ లేచి నిలబడ్డాడు.

అతడు ఆటోలో కూర్చున్న తరువాత స్పందనే అన్నది. "ప్రతాప్ గారూ! మీరు వచ్చి రెండు రోజులుండి నెప్పి తగ్గింతరువాత వెళితేనే బాగుంటుంది! లేకపోతే చాలా దూరం ప్రయాణం చేయాలి... దారిలో ఇబ్బంది పడతారు! ఆలోచించుకోండి."

ప్రతాప్‌కి ఆమె మాటలు కారం పూస్తున్నట్లే వున్నాయి. ఆ పైన కల్యాణి అన్న మాటలూ గుర్తుకు వచ్చినయి– మా స్కూలు పిల్లలకు ఈ విషయం తెలిసిందంటే అందరూ కలిసి జుట్టుపీకి చేతిలో పెడతారని.

అతడికి భయంతో ఒళ్ళు గగుర్పొడిచింది.

"లేదు... నేను వెళ్ళిపోతాను!" అన్నాడు బిక్కమొహమేసుకొని.

మాణిక్యం సోఫా పక్కన ఉన్న అతడి సంచీతెచ్చి ఆటోలో పెట్టింది.

ఆటో వెళ్ళగానే, స్పందనా, మాణిక్యం లోపలకు వచ్చారు.

ఆ హాల్లో కల్యాణి ఒంటరిగా, గోడవార కూర్చుని ఎక్కుపుట్టేలా ఏడుస్తున్నది.

"ఏమైందే?" అన్నది ఆదుర్దాగా స్పందన కల్యాణి దగ్గరకు వెళుతూ.

మాణిక్యం నవ్వింది. "ఏం కాలేదమ్మా..." అంటూ అతడు వచ్చిన దగ్గరనుంచీ జరిగిందంతా పూసగుచ్చినట్లుగా చెప్పింది.

స్పందన పకపకా నవ్వింది. "మంచి పనిచేశావ్... నేను గనుక వాడి మాటలు విని వుంటే... ఒక్క కాలు కాదే... రెండు కాళ్ళూ విరగ్గొట్టేదాన్ని... వెధవన్నర

వెధవ... మన టీం ఓడిపోవాలని చూసేవాడు, మనకెంత శత్రువో, మనకెంత హానిచేసేవాడో అర్థం చేసుకోండి... బాగా అయింది... నువ్వేం భయపడకు... మంచి పనే చేశావులే!" అన్నది ఆ అమ్మాయి పక్కనే కూర్చొని రెండు చేతులతో దగ్గరకు తీసుకుంటూ అనునయంగా.

* * *

రాత్రి పదకొండు గంటలయినా స్పందనకు నిద్రపట్టలేదు.

పదిగంటలకు పడుకోబోతుంటే ప్రతాప్ గుర్తుకు వచ్చాడు. వారం రోజుల క్రితం అతడు వచ్చినప్పుడు, కల్యాణి చేసిన పని గుర్తుకు రాగా నవ్వు వచ్చింది. తరువాత అతడి అప్పటి స్థితి చూసి జాలివేసింది. అతడు కల్యాణిని, తనని, మూర్తిని అన్నమాటలు మాణిక్యం చెప్పినప్పుడు మనస్సంతా అతడి మీద అసహ్యంతో నిండిపోయింది.

తరువాత టాక్సీ మాట్లాడి, అతడిని ఎక్కించి హైద్రాబాద్ పంపి, పది గంటలప్పుడు వచ్చి చెప్పాడు మూర్తి.

"ఫ్రాక్చరయితే లేదు... దెబ్బ మోకాలి నరాల మీద తగలటంతో బాగా నొప్పిగా వున్నది. రెండు మూడు రోజుల్లో ఆ నెప్పి తగ్గిపోతుంది అన్నాడు- మందులు రాసిచ్చాడు... ఆయన కూడా కొద్ది రోజులు ఇక్కడే విశ్రాంతి తీసుకుని వెళ్ళమన్నాడు కాని- అతడెందుకనో మొండిగా వెళ్ళిపోయాడు!"

అప్పుడు చెప్పింది స్పందన మూర్తికి, తాము లేనప్పుడు ఇంట్లో జరిగిన ఆ సంఘటన గురించి విపులంగా.

అతడూ అవాక్కయ్యాడు ఆ మాటలు వింటూనే.

"నా మూలకంగా జరిగిందన్నమాట...!" అన్నాడు విచారంగా. "నిజమే! పెళ్ళిచేసుకోకుండా మనం ఇలా తిరగటం భావ్యం కాదు... అతడు ఆపుకోలేక బయటపడ్డాడు... చాలా మంది, ఏమీ మాట్లాడలేక మౌనంగా మనల్ని చూసి, వెనగ్గా నవ్వుకుంటూ ఉండి ఉండాలి!" అన్నాడు.

స్పందన చెప్పటంతో, అప్పటికే కల్యాణి తన గదిలోకి వెళ్ళి, దీపమార్పి పడుకున్నది. మాణిక్యం, కల్యాణి మంచం పక్కనే చాప వేసుకుని పడుకొని వున్నది.

మూర్తి ఆ మాటలు అనటంతో చటుక్కున లేచి నిలబడింది స్పందన. ఆతడి ముందుకు వచ్చి, అతడి చేతిని పట్టుకుని, ఎత్తి తన కళ్ళమీద పెట్టుకుంటూ, "ఈ చేయే నా కళ్ళను ఎప్పుడూ తడవకుండా చూసుకోవాల్సింది... ఇంకెప్పుడూ అలా అనవద్దు... లక్ష మంది లక్ష అనుకోనివ్వనీయండి... నేను భరించ గలను... కానీ మీరు ఒక్కమాటన్నా నేను తట్టుకోలేను... మీ చేతిలోనే నా ఆరో ప్రాణమున్నది!" అన్నది విలవిలలాడుతూ.

ఆమె మాటలకు అతడు చలించిపోయాడు. ఆమె చేతిని పట్టుకొని దగ్గరకు తీసుకొని సోఫాలో పక్కన కూర్చోబెట్టుకున్నాడు ఆత్మీయంగా.

ఆమెకు దుఃఖం ఆగటంలేదు. చటుక్కున తలవంచి అతడి ఒడిలోకి వాలిపోతూ, "నా చేతిని ఎన్నడూ విడిచి పెట్టనని వాగ్దానం చేయండి!" అన్నది, తన చేతిని జాచి, అతడి అరచేతిని గట్టిగా పట్టుకుంటూ, దుఃఖంతో.

ఆమె ఆవేశానికి, ఆవేదనకూ ఉపశమనం కలిగించేలా భుజం తడుతూ, "నువ్వు భయపడాల్సింది, బాధ పడాల్సిందీ ఏమీ లేదు... నేను నీకు ఎలా ఆరో ప్రాణమో, నాకు ఆరు ప్రాణాలూ నువ్వే!" అన్నాడు. "ఓకే... కష్టతరమైన ప్రారంభం, సుఖమైన ముగింపుకు దారి తీస్తుందనే నమ్మేవాళ్ళలో నేను ఒకణ్ణి... నీ ప్రేమా, నీకు నా మీద ఉన్న నమ్మకమే నా జీవితంలో నేను పొందే గొప్ప సుఖం!" అన్నాడు తన్మయంగా కళ్ళు మూసుకుని.

ఇక ఒక్క క్షణం అతడు అక్కడ ఉండలేదు. లేచి, వడివడిగా తలుపుదాటి, గేటు దాటి, రోడ్డు మీద కాలుపెట్టాడు.

చాలా సేపు అతడు వెళ్ళినవైపే, శూన్యంలోకి చూస్తున్నట్లుగా, కనురెప్పలార్పకుండా చూస్తూ ఉండిపోయింది స్పందన.

తరువాత తలుపులన్నీ వేసి, అమ్మకూ, అవ్వకూ దణ్ణంపెట్టుకు వచ్చి పడుకుండేటప్పటికి పదకొండు దాటింది...

ఆ సంఘటన జరిగి వారం రోజులయినా ఇంకా ఆమె పూర్తిగా మరిచిపోలేకపోతున్నది. మనస్సుకు సాంత్వన చేకూర్చుకోలేకపోతున్నది. మనస్సంతా వికలమవుతున్నది.

తన తండ్రి తన జీవితంలో అనుకోకుండా ప్రవేశించి, తన భవిష్యత్తునే అల్లకల్లోలం చేస్తున్నాడా అనిపించగా వేదన కలుగుతున్నది. తన తల్లి ఏనాడూ సుఖం పొందలేదు. ఆమె జీవితం ఆయన మూలకంగా కంటకప్రాయమే అయింది. సరే, ఏదో విధంగా కోలుకొని, శారీరిక సుఖాలను త్యజించి, మానసిక ఆనందంతోనే జీవితాన్ని గడిపి వెళ్ళిపోయింది.

ఆమె వెళ్ళిపోయిన వెంటనే తన జీవితంలో ఈయన ప్రవేశించటం, తనకూ క్షణికానందాన్నే మిగిల్చింది.

కళ్ళెత్తి చికాగ్గా గోడకున్న గడియారం వంక చూచింది– పన్నెండు దాటి ముప్పావు గంట అయింది...

నిద్ర వచ్చే సూచనలు కనబడటం లేదు. లేచి, మంచం పక్కగా చాపవేసుకొని, బాసికపట్టు వేసుకుని కూర్చున్నది. ఎదురుగ్గా గోడమీద తల్లి ఫొటో, లక్ష్మమ్మ అవ్వ ఫొటో... తనివితీరా వాటిని చూసి కళ్ళు మూసుకున్నది...

ఓం... ఓం... ఓం...

ఆమె ఎంతసేపు అలా కూర్చున్నదో ఆమెకే తెలియదు...

తరువాత పడుకున్నా తెల్లవార్లూ కలతనిద్రే... తెలియని ఆవేదన– జరగగూడనిదేదైన జరగబోతున్నదా అన్నట్లుగా. ఎండెక్కిన తరువాతగాని మెళుకువ రాలేదు... కళ్ళు తెరిచి గోడ గడియారం వంక చూస్తే ఏడు గంటలయినట్లుగా గమనించింది. వడివడిగా లేచింది. మాణిక్యం ముందే లేచినా, ఆమె గాఢ నిద్రలో

ఉన్న తీరు చూసి లేపలేదు అ రోజు ఆదివారం అవ్వటంతో.

ముఖం కడుక్కుని కాఫీ త్రాగుతుంటే ఫోను మ్రోగింది.

చేసింది ప్రతాప్...

"స్పందనా! రాత్రి బావకు లైట్‌గా ఎటాక్ వచ్చింది... మా ఇంటికి దగ్గరలో వున్న ఓ సూపర్ స్పెషాలిటీస్ ఆసుపత్రిలో జేర్చాం... ఆయన కులాసాగానే ఉన్నారు... తరువాత, నీకు చెప్పలేదనే నెపం వేస్తావేమోనని ఫోను చేస్తున్నాను!"

"ఇప్పుడెట్లా వున్నది?" కంగారుగా అడిగింది.

"ఎక్కువగా రాలేదని చెప్పాను గదా... డాక్టర్లు ఏం ప్రమాదం లేదన్నారులే... నువ్వు చూడాలనుకుంటే వీలు చూసుకుని రావచ్చు... హడావుడేం లేదు! ఆయన్ను ఇంటెన్సివ్ కేర్‌లో ఉంచారు... ఎవర్నీ లోపలకు రానీయటం లేదు!"

ఆ కంఠం చాలా నిర్లక్ష్యంగా ఉన్నట్లనిపించగా విచలితురాలయింది స్పందన.

"నువ్వు వద్దామనుకుంటే నాకు ఫోను చేస్తే నేను బస్టాండుకు వస్తాను!... ఇక్కడ ఆటోల స్ట్రయిక్ జరుగుతున్నది... ఇబ్బంది పడతావేమోనని చెబుతున్నాను... మీ యింటికి వస్తే నన్ను అవమానించినట్లుగా, ఇక్కడ నిన్నెవరూ అవమానించరు... నీ యిష్టం... నీకు స్కూటర్‌మీద నాతో రావటానికి అభ్యంతరమయితే సరే!" అతడి మాటల్లో తన మీద అతడి కోపం స్పష్టంగా వ్యక్తమవుతున్నా, ఆమె పట్టించుకునే స్థితిలో లేదు... తండ్రికి ఎలా ఉన్నదో అనేదే ఆమె ఆవేదన...

మనస్సంతా కలుషితమవ్వగా, అటుపక్కన అతడు ఫోను పెట్టేసినా, రిసీవర్‌ను అలాగే పట్టుకొని కూర్చుండి పోయింది చాలాసేపు.

కొద్ది సేపటికి కోలుకొని, సెల్ తీసి ఆయన నెంబరుకు చేసింది... అది ఆఫ్‌లో వున్నది...

వెంటనే మూర్తికోసరం మాణిక్యాన్ని పంపించింది వాళ్ళింటికి.

అతడు పావుగంటలోనే వచ్చాడు.

"నాన్నకు హార్ట్ ఎటాక్ వచ్చిందట... ప్రతాప్ ఫోను చేశాడు... వెంటనే వెళ్ళాలి!"

"అయ్యో... ఎలా ఉన్నదట?"

"లైట్‌గానే వస్తే అక్కడేదో నర్సింగ్ హోంలో జేర్చారట... నా భయం అది కాదు... ఆ ప్రతాప్ ఓ త్రాచుపాము ... మొన్న ఇక్కడ గొడవ జరిగింది గదా... దానికి ప్రతీకారం తీర్చుకోవటానికిగానూ, ఈ మిషతో నన్ను అక్కడకు రప్పిస్తున్నాడా అని... ఆయన్ను అసలు నిజంగా ఆసుపత్రిలో జేర్చారా అని నాకు అనుమానంగా ఉన్నది అతడి నిర్లక్ష్యపు మాటలు వింటుంటే!" అన్నది దిగులుగా మూర్తినే చూస్తూ.

"మీ నాన్నగారిదగ్గర సెల్ ఉన్నది గదా ఫోను చేయండి!"

"చేశాను... అది ఆఫ్‌లో వున్నది!"

"అయితే మరేం చేద్దామని?"

"మీరు రాగూడదూ... ఇద్దరం కలసి వెళ్దాం!"

"అది అతడికి మరింత కోపం తెప్పిస్తుందేమో!"

"రానీయండి... మనకొచ్చే నష్టమేమున్నది... మీరుంటే నాకు ధైర్యం... ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కోగలననే నమ్మకం... ఒక పని చేద్దాం... రానూపోనూ కారు మాట్లాడండి... చూసి వీలయినంత తొందరలో వచ్చేద్దాం... అక్కడా ఆటోల స్ట్రయిక్ జరుగుతున్నదట...!"

కాస్త ఇబ్బందిగా చూశాడు మూర్తి స్పందన వంక.

"ఎవ్వరు ఏమనుకున్నా సరే... మనిద్దరం ఒకటే అనుకున్నప్పుడు ఎవ్వరి గురించీ మనం భయపడాల్సిన అవసరం లేదు... మీరు తయారయి మనకు ఎప్పుడూ వచ్చే డ్రయివర్‌నే కారు తీసుకు రమ్మనమనండి... అక్కడ ఏం జరిగినా మనకూ మరొక మనిషి అండవుంటుంది!"

“వాడి మొహం... వాడు మన్నేం చేస్తాడు గాని... వెళ్దాం పదండి... ఎలాగూ ఈరోజు శెలవే... అవసరమొస్తే ఉండి రేపు రాత్రికి బయల్దేరదాం... సుమిత్రా మేడమ్‌ను పిలిచి స్కూలు అప్పచెప్పండి... అమ్మ ఎప్పుడు బయటకు వెళ్ళినా ఆమెనే ఇన్‌చార్జ్ చేసి వెళుతుండేది!”

తరువాత గంటలోనే అక్కడ ఏర్పాట్లన్నీ చేసి ఇద్దరూ కారులో బయల్దేరారు.

* * *

హైద్రాబాద్ వెళ్ళేటప్పటికి మూడు గంటలయింది. సరాసరి నల్లగుంటలో వున్న తండ్రి ఇంటికే వెళ్ళారు.

వసుంధరా, ప్రతాప్ ఇంట్లోనే ఉన్నారు. స్పందనకు అర్థం కాలేదు, ఆయన ఆసుపత్రిలో ఉండగా, వాళ్ళిద్దరూ ఇంట్లోనే ఎందుకు ఉండిపోయారో.

కారు దిగి వసుంధర దగ్గరకు వడివడిగా వెళ్ళి, “ఎలా ఉన్నది వారికి?” అని అడిగింది ఆత్రంగా.

“ప్రస్థుతం ఇన్సెన్టివ్ కేర్‌లో ఉంచారు... మనస్సు కలుషితమైనప్పుడే ఇలాంటి అనర్థాలు నెత్తికి శనిలా చుట్టుకుంటుంటయి... ఆయన ఎంతో ధైర్యస్థులు కాబట్టే తట్టుకొని, బయటపడగలిగారు... బహుశః రాత్రికి రూంకి పంపించవచ్చు... దగ్గర ఎవరూ ఉండటానికి వీల్లేదంటే బయట వరండాలో కూర్చోని ఏం చేస్తామని మేం వెళ్ళలేదు!” ఆమె మాటలకు కించత్ అసహనంగా కదిలింది స్పందన.

“ఆదోనినుంచి కారులో వచ్చారా?” అడిగాడు మూర్తినే చూస్తూ ప్రతాప్ ముఖం చిట్లించి.

“వారు గాభరపడుతుంటేను కారులో తీసుకు వచ్చాను... బస్సులో ఆలస్యమవుతుందని!” అన్నాడు మూర్తి.

అంతా లోపలకు వెళ్ళారు.

“మొహం కడుక్కో! కాఫీ కలుపుతాను... ఇదుగో నీ గది తాళం చెవి!” అంటూ తన గది తాళం చెవి తెచ్చి చేతులో పెట్టి వంటయింట్లోకి వెళ్ళిపోయింది వసుంధర.

ఎందుకో ఆ వాతావరణం తుఫాను ముందు సముద్రంలా ప్రశాంతంగా ఉన్నట్లనిపించింది స్పందనకు.

అక్కడ ఉండబుద్ధి కావటంలేదు. త్వరగా వెళ్ళి ఆసుపత్రిలో ఉన్న తండ్రిని చూడాలనిపిస్తున్నది.

అసలు ఆదోనిలో ప్రతాప్ వచ్చిన రోజున జరిగిన దానికి ప్రతీకారంగానే తన తండ్రికి స్ట్రోక్ వచ్చిందంటూ పిలిచాడని అనుమానించిన తనకు, ఆయన ఆసుపత్రిలో ఉన్నాడని చెప్పి వాళ్ళిద్దరూ ఇంట్లోనే ఉండటం ఆ అనుమానాన్ని బలపరుస్తున్నది. ఆపైన లోపలకు వెళుతుండగానే ఇద్దరూ మీదపడి తగువులాడతారేమోనని కలవరపడింది. కానీ వాళ్ళు ఒక్క మాట గూడా అక్కడి విషయం మాట్లాడక పోవటంతో క్రికెట్ విషయంలో ప్రతాప్ చేసిన తప్పుడు పనికి సిగ్గు పడుతున్నారేమో అనే మరో ఆలోచనా వచ్చింది ఆమెకు.

స్పందన ఆమె గదిలోకి వెళుతుంటే, ప్రతాప్ మూర్తిని తీసుకొని తన గదిలోకి వెళ్ళాడు.

ఎంత కారులో వచ్చినా, ఆరుగంటల ప్రయాణంతో, చాలా చికాగ్గా ఉండటంతో, ఆ గదిలోకి వెళుతూనే, తలుపులు మూసి, బాత్‌రూంలోకి వెళ్ళింది.

ఆమె తయారయ్యేటప్పటికి పావుగంట పట్టింది.

డ్రస్సింగ్ టేబుల్ మీద అంతకు ముందున్న సామాన్లేవీ లేవు. బీరువా తెరిచి, తన గుడ్డలు తీసుకుంటూ గమనించింది... ఆరోజు వాళ్ళిచ్చిన కొత్త చీర పెట్టివున్న అట్టపెట్టె లేదు... ఆమె ఇచ్చిన మూడుపేటల చంద్రహారమూ లేదు...

స్పందనకు గుండె దడదడలాడింది. తలుపులకు తాళాలు వేసి వున్నా ఆ గదిలో పెట్టినవి ఏమైనయ్యో తెలియటంలేదు. ఆమె మనస్సు ఎందుకనో కీడు శంకిస్తున్నది...

కొద్ది క్షణాలలో తుఫాను రాబోతున్నట్లే ఉన్నది...

తన బ్యాగులో ఉన్న దువ్వెన తీసుకొని తల దువ్వుకున్నది. కుంకం డబ్బా తీసి బొట్టు పెట్టుకున్నది.

బయటకు వస్తుండగా, వసుంధర ఆ గదిలోకి వచ్చింది.

"గది దుమ్ము కొట్టుకు పోతుందేమోనని పనిమనిషి చేత రోజూ ఊడిపిస్తున్నాను... వాళ్ళను నమ్మటానికి వీల్లేదు... అందుకే చీరనూ, గొలుసునూ తీసి నా బీరువాలో పెట్టాను!" అన్నది.

"మంచిపని చేశారు!" అన్నది చిరునవ్వుతో స్పందన. కానీ, డ్రస్సింగ్ టేబుల్ మీదనుంచి దువ్వెనతో సహా చిన్నచిన్న వాటినిగూడా తీసి వేయాల్సిన అవసరం ఏమొచ్చిందో అర్థం కాలేదు.

ప్రతాప్, మూర్తి అతడి గదిలోనుంచి బయటకు వచ్చారు తరువాత పావుగంటకు.

వాళ్ళను చూస్తూనే వసుంధర వంటయింట్లోకి వెళ్ళింది కాఫీలు తేవటానికి.

ప్రతాప్ చిన్నగా నవ్వి, "మీకు అభ్యంతరమేమున్నది... స్పందన ఆ గదిలో ఉన్నట్లున్నది వెళ్ళండి!" అంటూ అక్క వెనుకే వంటయింట్లోకి వెళ్ళాడు.

మూర్తికి అతడి మాటలు చాలా చిరాకు కలిగించటమే గాకుండా, కోపమూ కలిగించినయి. అయినా నిగ్రహించుకొని అతడు అన్నట్లుగానే, సరాసరి ఆమె గదిలోకి మరే ఆలోచనా లేకుండా వెళ్ళాడు.

మూర్తిని చూస్తూనే, "నేను రెడీ... మీరూ స్నానం చేస్తారా?" అన్నది.

"అఖ్ఖర్లేదు... క్రితం సారి వచ్చినప్పుడు నీ గుడ్డలు ఇక్కడ ఉంచానన్నావు గదా... వాటినిటివ్వు కారులో పెడతాను!" అన్నాడు విసురుగా.

అతడి మాటలు వింటూ విచిత్రంగా చూచింది అతడి వంక.

"దేనికి?" అన్నది.

"నేను చెప్పింది చేయి...!" అన్నాడు కరుకుగా. "మళ్ళా మనం ఇక్కడకు రావటంలేదు!"

అతడి కంఠానికి ఒక్కసారిగా బిగుసుకుపోయింది స్పందన. నోరు తెరుచుకొని అతడినే చూస్తూ ఉండిపోయింది– ఇంతవరకు ఎన్నడూ అతడిని అలా చూడలేదు.

"నాకూ చాలా బాధగానే ఉన్నదమ్మా! నిన్ను చూసి నాకు స్వంత కూతురే ఉన్నట్లుగా సంతోషించాను... కానీ నిజాలు తెలిసినప్పుడు ఆయనే భరించలేకపోయారు... నేనెంత... అసలు ఎటాక్ రావటానికి కారణం అదే!" అన్నది విచారంగా ముఖంపెట్టి అప్పుడే ఆ గదిలోకి వచ్చిన వసుంధర. "ముందు కాఫీ త్రాగండి ఇద్దరూ!"

ఆమె చేతిలో ట్రే వున్నది. అందులో కాఫీతో రెండు కప్పులు ఉన్నాయి.

వాళ్ళు ఏం చెప్పాలనుకుంటున్నారో, తను ఏం వింటున్నదో అర్థం కానంత అయోమయంలో పడిపోయింది స్పందన. ఆమెకు మూర్తి అసహనానికి కారణం అర్థం కావటంలేదు. వసుంధర మాటలూ అర్థం కావటంలేదు. ఆమె మెదడు పూర్తిగా మొద్దుబారిపోతోంది.

ప్రతాప్ వచ్చాడు, "నేను ఆసుపత్రివైపే వెళుతున్నాను... వేరే అర్జంటు పని ఉన్నది... మీరు బయల్దేరితే చూపించి వెళతాను!" అంటూ.

మూర్తి లేచి స్పందన క్రితంసారి ఇక్కడకు వచ్చినప్పుడు తెచ్చి వదిలేసిన సంచీని అందుకున్నాడు.

బొమ్మలా అతడి వెనుకే నడుస్తున్నది స్పందన.

"నేను ఎనిమిదిగంటలకు ఆయనకు భోజనం తీసుకుని వస్తాను... చెప్పండి ఆయనకు! అప్పటికి ఆయన్ను వేరే స్పెషల్ రూంలోకి పంపుతానన్నారు!" అన్నది తలుపు దగ్గర నిలుచునే వసుంధర వాళ్ళు కారు ఎక్కుతుంటే.

ప్రతాప్ డ్రైవర్‌కి చెప్పాడు. "నేను ముందు స్కూటర్ మీద వెళుతుంటాను...

వెనకాలే ఫాలోకా!"

కారు గేటు దాటి రోడ్డు మీదకు వచ్చింది.

స్పందన ఇక ఆపుకోలేకపోయింది. మూర్తి చేయి గట్టిగా పట్టుకొని, "ఏమైంది... ఏమన్నా అన్నారా వాళ్ళు!" అన్నది ఆత్రంగా. "ఎందుకు అలా ఉన్నారు మీరు?"

"ప్రతాప్ మీమీద పెద్ద దెబ్బకొట్టే అతడి కసినంతా తీర్చుకున్నాడు... ఈ ఇంటితో మీకు ఇక ఏ సంబంధమూ లేకుండా చేయాలనేది వాళ్ళ ప్రయత్నం!"

"అంటే?" నుదురు ముడివేసింది. "సరిగ్గా చెప్పండి!"

అతడు ఆమె చేతిని గట్టిగా పట్టుకున్నాడు. అతడి నరాలు బిగదీసుకు పోతున్నయి. "నువ్వు మీ అమ్మ స్వంత కూతురువి కాదట... కల్యాణి లాగానే నిన్నూ ఈ లోకంలో ఎవరో కనిపారేస్తే ఆమె తెచ్చి పెంచుకున్నదట... జగన్నాథం గారికి పుట్టిన అసలు కూతురు, ఆయన ఆమెను వదిలేసిన సంవత్సరంలోనే చచ్చిపోయిందట... ఇప్పుడు నువ్వు ఆయన్ను వలలో వేసుకొని, ఈ ఆస్తి కాజేయటం కోసరం ఆయన స్వంత కూతుర్నే అంటూ నాటకమాడుతున్నావట! చాలా... ఇంకా విపులంగా చెప్పాలా... ఆయనకు ఈ విషయం తెలిసింతరువాతే ఎటాక్ వచ్చిందట... దానికీ నువ్వే కారణమట!" మూర్తి కళ్ళు నిప్పులు కురిపిస్తున్నయి.

స్పందన ఆ మాటలు వింటూనే బొమ్మలా బిగుసుకుపోయింది.

– తను అమ్మకు స్వంతకూతురు కాదా? ఆమె కూతురు పసిపిల్లగానే చనిపోయిందా?

"ఏ బాస్టర్డ్ చెప్పాడట వాళ్ళకు ఈ అబద్ధాలన్నీ?"

"ఎవ్వరూ చెప్పివుండరు... వీళ్ళే కల్పించి ఆయనకు చెప్పివుంటారు... చూస్తూచూస్తూ ఇంత ఆస్తిని, ప్రతాప్‌ను భర్తగా చేసుకోవటం ఇష్టంలేని నీకు, కట్టబెడతారా ఎవరైనా!"

"చంపేస్తాను వాడిని... ఏమనుకుంటున్నాడో!" ఆమె ఒంట్లో రక్తం మరిగిపోతున్నది.

"కూల్‌డౌన్... కూల్‌డౌన్ స్పందనా... ఈ సమస్యను ఆవేశంతో పరిష్కరించలేవు ... ఆ సంగతేదో తరువాత చూద్దాం... ముందు నాన్నగారిని చూద్దాంపద... అసలు ఆయనకు నిజంగా హార్ట్ ఎటాక్ వచ్చిందో, లేదా అదీ వీళ్ళ కల్పితమేనేమో చూడాలి!"

హాస్పిటల్ బిల్డింగ్ ముందు, స్కూటర్ వెనుకగా కారు ఆగింది. స్పందనా, మూర్తీ కారు దిగి ప్రతాప్ కూర్చొని వున్న స్కూటర్ దగ్గరకు వచ్చారు.

"ఇన్టెన్సివ్ కేర్ యూనిట్ ఫస్ట్‌ఫ్లోర్‌లో ఉంది... మీరు ఆయన్ను చూడాలి అనుకుంటే అద్దంలోనుంచి చూడాల్సిందే... ఆయన టెన్షన్‌లో ఉన్నాడు... వాళ్ళనూ వీళ్ళనూ బ్రతిమలాడి లోపలకు వెళ్ళి డిస్టర్బ్ చేయవద్దు... స్పందనను చూస్తే ఆయనకు ఎటాక్ తిరిగి వచ్చినా రావచ్చు... అప్పుడు ఎవరూ ఆయన్ను రక్షించలేరు... నేను వెళతాను... ఎనిమిదింటి దాకా నాకు వేరే అర్జంటు పనులున్నయి... అప్పటిదాకా మీరు ఉండటం అనవసరమేమో అనుకుంటున్నాను... ఉండి ఆయనకు మరింత ఇబ్బంది కలిగించటం తప్పు!"

ప్రతాప్ వెళ్ళిపోయాడు అక్కడే వాళ్ళను వదిలేసి. అతడి మాటలకు ఇద్దరూ నిర్ఘాంతపోయారు.

వడివడిగా మెట్లెక్కి హాస్పిటల్ లోపలకు వెళుతూనే, రిసెప్షన్‌లో అడిగారు. "ఇన్‌టెన్సివ్ కేర్ యూనిట్ ఎక్కడ?"

"ఎవరు కావాలి?"

"జగన్నాథంగారు!"

రిసెప్షనిస్ట్ రిజిస్టర్ తీసి చూస్తూ, "వారిని రూంకు మార్చారు గదా... టూ నాట్ త్రీలో ఉన్నారు... సెకండ్ ఫ్లోర్... అటునుంచి వెళ్ళండి!" అన్నది.

మూర్తీ, స్పందనా మొహామొహాలు చూసుకున్నారు. ఇద్దరు వడివడిగా మెట్లెక్కి

సెకండ్ ఫ్లోర్‌లోకి వెళ్ళారు. మూడోనెంబరు గది తలుపు మూసి వున్నది.

స్పందన తలుపు మీద రెండు సార్లు కొట్టింది చేతి వేళ్ళతో చిన్నగా.

లోపలనుంచి, ''ఎస్ ప్లీజ్!'' అన్న మాట వినబడటంతోనే ఇద్దరూ తలుపునెట్టుకుంటూ లోపలకు వెళ్ళారు.

వాళ్ళను చూస్తూనే ఆయన ఆశ్చర్యంగా నోరు తెరుచుకు చూస్తుండిపోయాడు.

"మీరెప్పుడు వచ్చారు?"

"ఓ గంటయి వుంటుంది... ఇంటికి వెళ్ళి వస్తున్నాం!"

"ఎందుకు వచ్చారమ్మా?" అన్నాడు ఇంకా వాళ్ళను ఆశ్చర్యంగా చూస్తూనే.

"మీకు ఆరోగ్యం బాగోలేదని, అసుపత్రిలో జేర్చామని ప్రతాప్‌గారు ఫోను చేస్తే, ఉండలేక కారు తీసుకొని వెంటనే బయల్దేరాం!" అన్నది ఆయన్నే నిశితంగా చూస్తూ. ఆయనా వాళ్ళు చెప్పింది నమ్ముతున్నాడా?

వాళ్ళ మాటలు గుర్తుకురాగా స్పందన అసహనంగా ఆయన వంక చూసింది.

"మీరు వెంటనే వెళ్ళి పోతే నేను చాలా సంతోషిస్తానమ్మా... ఆ రాక్షసులు నిన్ను చంపినా చంపేస్తారు! డబ్బు ఎంత పాపిష్టిది?" అన్నాడు ఆయన తలవంచుకుని దిగులుగా. "జీవిత సమస్యలకు సమాధానాలను పట్టుకోవటం బహుకష్టం... అంతేకాదమ్మా... ప్రేమను మనం ఎంత తేలిగ్గా మరొకరికి ఇవ్వగలమో, వారినుండి పుచ్చుకోవటం అంత కష్టం... నా పరిస్థితి అదే ఇప్పుడు!"

స్పందనకు ఆవేశమొచ్చింది.

"మీరు ఆరోగ్యంగానే ఉన్నా తీసుకు వచ్చి ఇక్కడ పడేశారా మీ మీద ప్రేమను కుమ్మరిస్తున్నట్లుగా?" అన్నది ఆతురతతో.

"గుండెల్లో కొద్ది నొప్పి వచ్చిన మాట వాస్తవమే గాని... మనవాళ్ళు హడావుడి చేయటంతో వీళ్ళు ఇంటెన్సివ్‌కేర్‌లో పడేశారు... అవసరమున్నవీ, లేనివీ ఓ పాతిక

పరీక్షలు చేసి, అది హార్ట్‌కు సంబంధించిన నెప్పి కాదని, గాస్ వలననే అని తేల్చి గంట క్రితం రూంకు మార్చారు... వాళ్ళ మాటల్నిబట్టి చూస్తుంటే రేపు ఇంటికి పంపినా పంపివేయవచ్చు!" అన్నాడు ఆయన నవ్వుతూ.

స్పందన మనస్సు స్థిమితపడింది.

ఆయన కూతురు చేయి పట్టుకున్నారు. "ఇక్కడున్నది విషనాగులమ్మా! నువ్వు ఇంకెప్పుడూ ఇక్కడకు రావద్దు... నీ మీద కథలల్లి ఏవేవో చెబుతున్నారు... వాళ్ళ మాటలేవీ నేను నమ్మను... నా నమ్మకమే నన్ను బ్రతికిస్తుంది... నేను నీ సౌఖ్యమే కోరుకుంటున్నాను... మూర్తిగారిని గూడా తీసుకు వచ్చి మంచిపని చేశావ్... నువ్వొక్కదానివే వచ్చి వుంటే వాళ్ళ చేతుల్లో పడి సర్వనాశనమయి ఉండేదానివి... నేను బాగానే ఉన్నాను... మీరు వీలయినంత త్వరలో ఇక్కడనుంచి వెళ్ళిపోండి... నా సెల్‌గూడా లాక్కున్నారు... రేపు డిశ్చార్జ్ అయింతరువాత నీకు ఫోను చేసి వివరంగా మాట్లాడతాను.... నాకేం హాని చేయలేరులే... అంతగా అయితే, ఆస్తంతా వాళ్ళ పేరున పెట్టిందాకా బందీని చేస్తారు... ఎన్నాళ్ళు చేస్తారో చూద్దాం!" అన్నాడు ఆయన ఆలోచిస్తున్నట్లుగా తలవంచుకుని. "కష్టాలెప్పుడూ బలహీనుణ్ణే ఏడిపిస్తయి, బలవంతుణ్ణి మరింత బలవంతుణ్ణి చేస్తయి!"

"మీ ఇన్ని ఇబ్బందులకూ మూల కారణం మీ దగ్గర డబ్బుండటమే కదా... మీరు నా దగ్గరకు వచ్చేయండి... ఇక్కడనుంచి ఒక్క పైసా గూడా తీసుకురావద్దు... అందుకోసరమే ఈ గోలంతా అయితే వాళ్ళనే అనుభవించనీయండి... లక్ష్మమ్మ అవ్వ దీవెనలు మనకు ఎప్పుడూ ఉంటయి... శాంతిలభిస్తుంది... అది చాలు మనకు... నా డబ్బు మీ డబ్బు కాదా... ఎందుకు ఈ వెధవ పంజరపు బ్రతుకు!" అన్నది ఆయన్నే దిగులుగా చూస్తూ.

తండ్రి తన విషయంలో వాళ్ళమాటలు నమ్మనందుకు ఆమెకు చాలా తృప్తిగా వున్నది.

"చూద్దామమ్మా! ఏదో ఒకటి చేస్తాను గదా... మీరు వెళ్ళిరండమ్మా... నిన్ను

ఇప్పుడు చూడటం నాకు చాలా ఆనందంగా ఉన్నది... ఎవ్వరు ఏం చెప్పినా నమ్మవద్దు... ముఖ్యంగా నా భార్య, ఆవిడ తమ్ముడు! వాళ్ళు మళ్ళీ మొదటికి వచ్చారు కాస్త బాణీ మార్చినా... నేను వాళ్ళక్కయ్య కూతుర్లలో శ్యామల్నే కాదు ఎవర్నయినా సరే ఒక అమ్మాయిని దత్తత చేసుకుంటే, ప్రతాప్ ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకుంటాడట! అది నేను చేయను... నాకిష్టంలేదు... వాళ్ళు నన్ను ఏం చేసినా సరే!"

"మీ అన్నయ్యగారి అబ్బాయిని తెచ్చుకోండి!"

"ఎవర్నయినా నేనెందుకు తెచ్చుకోవాలి... నా కూతురు నాకుండగా... ఎవర్నీ తెచ్చుకోను... అంతేగాదు నా కూతురు దానికిష్టమొచ్చిన వాడినే పెళ్ళి చేసుకుంటుంది... మధ్యలో వాళ్ళ నిబంధనలేమిటి!" విసురుగా అన్నాడు ఆయన. "నేను ఇక్కడ జరుగుతున్న విషయాలు ఏరోజు కారోజు చెబుతునే ఉంటాను... ఏం చేయాలో మనం ఆలోచిద్దాం... వాళ్ళను చూస్తుంటేనే నాకు పరమ అసహ్యమేస్తున్నది!" అన్నాడు ముఖం వికారంగా పెట్టి జగన్నాథం.

"మీరు ఎక్సయిట్ అవ్వబోకండి!" అన్నాడు మూర్తి. "స్పందనగారూ! పదండి మనం వెళ్దాం!"

"నాకు తెలుసు మూర్తిగారూ! వాళ్ళ చెబుతున్నవన్నీ కల్పనలు... అది నిజం... మీ కుటుంబం రాజేశ్వరిని ఆదుకొన్నది... ఆమెకో స్థిరమైన జీవితం ఏర్పడేలా చేసింది... అలాగే మీరు స్పందనకు నీడలా నిలబడండి... నేను ఎంతో సంతోషిస్తాను!"

స్పందనా, మూర్తీ ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు ఆయన మాటలకు.

"ఒక్క పని చేయండి... ఈ సెల్లు మీదగ్గర ఉంచుకోండి... ఇది మీరిచ్చిందే... నేను ఆదోని వెళుతూనే ఒకటి కొనుక్కొని, ఈసారి మీరు ఫోను చేసినప్పుడు నంబరు చెబుతాను!" అన్నది స్పందన సెల్లును ఆయన చేతిలో పెడుతూ.

"మంచిదమ్మా! జాగ్రత్తగా వెళ్ళి రండమ్మా... ఇంకా హైద్రాబాద్‌లో మాత్రం ఉండవద్దు... నా గురించి ఏమీ దిగులుపడవద్దు... నన్ను నేను కాపాడుకోగలను!"

ఇద్దరూ బయటకు వచ్చేశారు. తలుపు దాటుతూ ఒక్కసారి వెనక్కుతిరిగి తండ్రి ముఖంలోకి చూసింది స్పందన. ఆయనా ఆమె వంకే చూస్తున్నాడు.

– మొట్టమొదటిసారిగా తను చూసినప్పుడు నున్నగా ఉన్న ఆయన ముఖంలో ఇప్పుడు ముడతలు ఏర్పడుతున్నయి. కళ్ళు లోపలకు పోయినట్లున్నయి... రెప్పల క్రిందంతా నల్లటి చారలు ఏర్పడుతున్నయి....

అలా ఉన్న ఆయన్ను చూస్తుంటే ఆమెకు ఆపుకోలేనంత దుఃఖమొచ్చింది.

* * *

ఆదోని వచ్చేటప్పటికి తెల్లవారుజామున మూడు గంటలయింది.

ఇంటిముందు కారు దిగుతూ స్పందన, "నేను ఆరింటికల్లా లక్ష్మమ్మ అవ్వ గుడికి వెళతాను... వచ్చేటప్పటికి ఎనిమిది గంటలవుతుంది... ఈరోజు నేను స్కూలుకు రాను... మీరూ వెళ్ళవద్దు... మీ పాస్‌పోర్ట్ సైజు ఫొటో ఒకటి, రేషన్ కార్డు తీసుకొని పదిగంటలకు మా ఇంటికి రండి... నిన్న జరిగిన క్రికెట్ మ్యాచ్ ఏమైందో కనుక్కోండి!" అన్నది.

గేటు చప్పుడు చేయటంతో మాణిక్యం వచ్చి తాళం తీసి, మూర్తి ఇచ్చిన బ్యాగ్‌ను లోపలకు తీసుకు వెళ్ళింది.

"అలాగే!" అన్నాడు మూర్తి కారు ఎక్కుతూ.

"దేనికి అని అడగరేం?" అన్నది నవ్వి.

"వాటిని ఉపయోగించేటప్పుడయినా చెబుతారు గదా!" అతడూ నవ్వాడు. కారు ముందుకు వెళ్ళిపోయింది.

తన గదిలోకి వెళ్ళి మంచం మీద పడుకున్నా నిద్రపట్టలేదు.

అసహనంగా అటూ ఇటూ కదులుతునే ఉన్నది. ముడతలు పడిన తండ్రి ముఖమే కనబడుతున్నది. పాముల్లా నాలికలు బయటకు జాపి మాట్లాడుతున్న అక్కా

తమ్ముళ్ళే కనబడుతున్నారు. కల్లోలితమైన మనస్సుతో కళ్ళు మూతలు పడటమే లేదు.

అయిదు గంటలవ్వగానే లేచింది. కాఫీ త్రాగి స్నానం చేసి గుడికి వెళ్ళేటప్పటికి ఆరు గంటలయింది.

అంతా ప్రశాంతంగా ఉన్నది. సరాసరి మెట్లుదిగి క్రిందకు వెళ్ళి లక్ష్మమ్మ అవ్వ సమాధి ఎదురుగా బాసికపట్టు వేసుకుని కూర్చున్నది. కళ్ళు తెరిచి ఆమెనే చూస్తూ నమస్కరించింది.

తరువాత కళ్ళు మూసుకున్న రెండు నిముషాలల్లోనే మరోప్రపంచంలో కాలుపెట్టింది.

శరీరమంతా తేలికవ్వసాగింది. తన చుట్టూ తెల్లని మబ్బులు క్రమ్ముకుంటున్నయి. ఒక పక్కనంతా చల్లదనం. మరో వైపునుంచి ఆవిర్లుతేలుతూ వస్తున్న పొగలు, శరీరాన్ని తాకుతూ, తనని దాటుతూనే చల్లబడి మంచు ముద్దల్లా మారిపోతున్నాయి.

నేనెవర్ని? నేనెవర్ని? నేనెవర్ని?... అరుస్తున్నట్లే గాఢంగా శ్వాసపీల్చుకుంటూ వదులుతున్నది.

తనెక్కడికో వెళ్ళిపోతున్నది?

అలజడితో ముళ్ళతీగెల్లా అల్లుకుపోయిన ఆలోచనలను మెదడునుండి తీసివేయాలన్నట్లుగా, గాలిలో తేలిపోతూ ఇంకా పైపైకి వెళ్ళి అనంత విశ్వంలో విహరించసాగింది... అక్కడ ఎప్పుడూ కనబడే నీలి ఆకాశం లేదు... తెల్లటి మబ్బులు లేవు... అంతకు ముందు తన చుట్టూ ఏర్పడుతున్న మంచుముద్దలు లేవు...శరీరం వదలిపోయేలా మీదిమీదికి వస్తున్న ఆవిర్లులేవు... అంతా శూన్యమే... ఆ శూన్యమే ఆమెను సర్వం మరిచిపోయేలా చేస్తోంది.

ఇప్పుడు ఆమె మెదడులో సందిగ్ధత లేదు. భవిష్యత్ ఆలోచనలు లేవు. ఏ కోరికా లేదు. శరీరం కాని, మనస్సు కానీ ఏమీ కాంక్షించటం లేదు...

నాకింకేంకావాలి? నాకు అన్నీ వున్నయి... ఆమెకు పూర్తి విశ్రాంతి లభించింది...

నిద్రలాంటి సూర్యాస్తమయాన్ని దాటింది. సంధ్యాకాలపు కలల్ని దాటింది. సూర్యోదయపు చైతన్యంలోకి రావటానికి ఆమెకు తరువాత గంటపట్టింది.

అప్పటికే శరీరం స్వేదంతో తడిసి ముద్దయింది.

హాయిగా, తేలికయిన మనస్సుతో లేచి, అవ్వకు నమస్కరించి బయటకు వచ్చింది. ఆమె మనస్సిప్పుడు ప్రశాంతంగా ఉన్నది. హాయిగా ఉన్నది... ఆహ్లాదంగా ఉన్నది.

ఆటో ఎక్కుతూనే నిర్ణయాలు తీసుకోవటం మొదలుపెట్టింది...

– తను ఇక తన తండ్రి విషయంలో పూర్తి బాధ్యత వహించక తప్పదు!... అన్ని ఆలోచనలూ శూన్యంలో కరిగిపోగా ఆమెకు మిగిలింది అదొక్కటే... అదీ అధిగమించాలి...

తన తండ్రి ఆ క్రూర మృగాల బారినుండి తప్పించుకొని తన దగ్గరకు వచ్చేయాలి. ధనమే ఈ బాధలన్నిటికీ మూల కారణం. దాన్నుంచి ఆయన విముక్తుడవ్వాలి.

మూర్తిగారిని పంపి న్యాయవాదితో సంప్రదించి ఆయన సంపాదించి కూడబెట్టిన దంతా సద్వినియోగం అయ్యేలా చూడాలి. ఈ ప్రపంచంలో అన్నార్తులకు లెక్కలేదు. ఆధారం లేక కుమిలి కుమిలి ఏడుస్తున్న వృద్ధులు ఎందరో ఉన్నారు... ఆయన ఆస్తి ఆ భార్యా భర్తల తదనంతరం ఓ ట్రస్టుకు చెందేలా చేయాలి... ప్రతాప్‌లాంటి, ధన దాహార్తులు, అనర్హులచేతుల్లో పడి, ఆయన శ్రమ వ్యర్థమై, కలుషితమై పోగూడదు...

తన తండ్రి భవిష్యత్తంతా ఏ దిగులూ లేకుండా హాయిగా గడిచిపోవాలి...

పది గంటలవుతుండగా మూర్తి వచ్చాడు ఆమె చెప్పినవి తీసుకొని.

"మన టీం నిన్న గూడా గెలిచింది... వచ్చే వారమే ఇక్కడ జరిగే ఆఖరు మ్యాచ్... అది చాలా చిన్న టీం... మనం తేలిగ్గా నెగ్గుతాం... ఇక కర్నూలు వెళ్ళటం ఖాయం!" అన్నాడు సంతోషంగా.

"విజయానికి ముఖ్యమయినది నమ్మకం... అల్పుల మీద విజయం

సాధించటంలో ఆనందం లేదు... బలమైన వారిమీదనే గెలవాలి... అప్పుడే తృప్తి!"

ఇద్దరూ సెంటర్‌కు వెళ్ళారు.

స్పందన రెండు సెల్ ఫోన్‌లు కొన్నది.

"రెండు దేనికి?" మూర్తి అడిగాడు ఆత్రంగా... కించిత్ అనుమానిస్తూనే.

"మనకే!"

"నాకెందుకు... నేనెవ్వరికి చేస్తాను?" అన్నాడు ఇబ్బందిగా ఆమెను చూస్తూ.

"ఇక్కడ మీరు లేరు... నేను లేను... మనం ఉన్నాం!" అన్నది అతడికి మరోమాటకు అవకాశమివ్వకుండా, డబ్బులిచ్చేసింది. వాటిని యాక్టివేట్ చేయించుకొని బయటకు వచ్చారు.

ఆటో పిలిచి ఎక్కి కూర్చున్నది. పక్కన మూర్తి కూర్చున్నాడు.

"రణమండల ఆంజనేయస్వామి గుడికి పోనీయ్!"

ఆమెను విచిత్రంగా చూస్తున్నాడు మూర్తి.

"అయిదొందల పైగా మెట్లున్న ఆ కొండ ఎక్కి స్వామి ముందు మనిద్దరమే నిలబడి ఆయన ఆశీస్సులు పొందాలి!" తన్మయంగా కళ్ళు మూసి తెరుస్తూ, అతడినే చూస్తూ అన్నది.

ఇద్దరూ కొండ ఎక్కారు. నడవలేదు. ఆకాశాన్ని అందుకోవటానికి పరుగెడుతున్నట్లుగా మెట్లెక్కారు.

స్వామికి నమస్కరించి, ఎదురుగ్గా బాసికపట్టు వేసుకు కూర్చుంటూ, "మీరూ కూర్చోండి!" అన్నది స్పందన.

అతడు ఆమె పక్కనే కూర్చున్నాడు.

ఆమె తన సెల్‌ను చేతిలోకి తీసుకొని, తండ్రికి తనిచ్చిన సెల్ నెంబరు నొక్కింది.

అవతల రింగ్ అవుతున్న శబ్దం. తరువాత కొద్ది క్షణాలకే తండ్రి కంఠం... ఎంతో ఉత్తేజితురాలయింది ఆ కంఠం వింటూనే.

ఆమె చెయ్యి అసంకల్పితంగా మూర్తి చేతిని గట్టిగా పట్టుకున్నది. "నేను స్పందనను మాట్లాడుతున్నాను... మీరు వీలయినంత తొందరలో ఆదోని రావాలి... వచ్చి, మూర్తిగారింటికి వెళ్ళి, మా అమ్మాయిని మీ కోడలిగా స్వీకరించాలని, వారి అమ్మగారిని మీరు అడగాలి... ఆమె అంగీకారం తీసుకొని, ఆరు నెలల తరువాత మీ దంపతులిద్దరూ పీటలమీద కూర్చొని మా వివాహం జరిపించాలి!"

మూర్తి కళ్ళు విశాలం చేసుకొని ఆమెనే చూస్తున్నాడు... ఆమె ఒక దేవతలా కనబడుతున్నది ఆ ఎత్తయిన కొండమీద ఆ క్షణాన అతడికి... శరీరమంతా చల్లటి గాలిలో హాయిగా తేలిపోతున్నది.

"మీరు వస్తున్నారు కదా, నాన్నగారూ!" జీవితంలో మొట్టమొదటిసారిగా ఆ మాట అంటున్నప్పుడు ఆమె మొహమంతా వెయ్యి దీపాల వెలుగుతో నిండి ఉన్నది.

**(సమాప్తం)**